అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 29-09-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 271 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల : 8.00


ఏచూరికి నివాళ్లర్పిస్తున్న రాహుల్‌గాంధీ

ఇండియా బ్లాక్ చీఫ్ ఆర్కిటెక్ట్
సీతారాం ఏచూరి
ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన : ప్రకాశ్‌కరత్

ప్రపంచంలోని ఏ అగ్రశ్రేణి సంస్థకైనా చేరుకోగలిగే విద్యార్థి : ప్రభాత్ పట్నాయక్

ఆయన అందరి సొత్తు : మల్లికార్జున ఖర్గే

ఏచూరిని స్మరించుకున్న దేశ రాజధాని

జీవిత చరిత్ర ఆధారంగా ఫొటో ఎగ్జిబిషన్

ఢిల్లీలోని తాల్కతోర ఇండోర్ స్టేడియంలో సంస్మరణ సభ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నిర్భయ పోరాట యోధుడు సీతారాం ఏచూరిని జాతీయనేతలంతా గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలోని తాల్కతోర ఇండోర్ స్టేడియంలో సీపీఐ(ఎం) సెంట్రల్ కమిటీ ఏర్పాటు చేసిన సంస్మరణ సభ దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులకు ఏచూరి చేసిన కృషిని గుర్తు చేసింది. కిక్కిరిసిన సభికులను ఉద్దేశించి నాయకులు ప్రసంగిస్తూ దేశాన్ని కబళించేందుకు ప్రయత్నించిన మతతత్వ శక్తులకు గట్టి ఎదురుదెబ్బ తగలడానికి కారణమైన ఇండియా ఫోరం రూపశిల్పిగా సీతారాం చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. సంక్షోభ సమయాల్లో ఏచూరి తమకు ఆశ్రయం, ఓదార్పునిచ్చిన తీరును ప్రేమగా గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ఏచూరి సంతాప తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. మార్క్సిజం పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తుచేస్తూ సీతారాం తన యవ్వనం నుంచి దేశంలో వామపక్ష ఉద్యమానికి బహుముఖంగా చేసిన సేవలను ఆమె కొనియాడారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణకు, మతతత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటానికి ఆమె నివాళులర్పించారు. దేశ చరిత్రలో ఈ కీలక సమయంలో సీతారాం లేకపోవడం బాధాకరమన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, డి.రాజా (సీపీఐ), ఫరూక్ అబ్దుల్లా (ఎన్‌సి), కనిమొళి (డీఎంకే), మనోజ్ ఝా (ఆర్‌జెడి), రాంగోపాల్ యాదవ్ (ఎస్‌పి), సుప్రియా సూలే (ఎన్‌సిపి), గోపాల్ రాయ్ (ఆప్), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐఎంఎల్), మహువా మాఝీ (జెఎంఎం), మనోజ్ భట్టాచార్య (ఆర్‌ఎస్‌పి), జి దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, సీనియర్ పాత్రికేయులు ఎన్ రామ్, సామాజిక వేత్త తీస్తా సెతల్వాద్ సభలో ప్రసంగించారు. సభా ప్రాంగణంలో ఏచూరి జీవిత చరిత్ర ఆధారంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఆయన చిన్ననాటి ఫొటోలతో సహా స్కూల్, కాలేజీ, స్పోర్ట్స్, జాతీయంగా, అంతర్జాతీయంగా ఆయన పాల్గొన్న ఉద్యమాలకు సంబంధించిన ఫొటోలూ ఉన్నాయి. జననాట్య ...3లో

డిజిటల్ కార్డులో మహిళే కుటుంబ పెద్ద
ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాలు

అందుబాటులోని డాటా ఆధారంగా నిర్ధారణ

అక్టోబరు 3 నుంచి పైలెట్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన : సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ)లో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని నిర్ణయించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎఫ్‌డీసీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25నుంచి 27 వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించిన అధికారులు చేసిన అధ్యయనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్డుల రూపకల్పనలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, వాటితో ...13లో

అద్దెభవనాలు అరకొర ఆహారం

సమయపాలన సవరణతో అన్నీ సమస్యలే

గురుకుల విద్యార్థులు , సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

'గురుకుల విద్యార్థులు, సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. వారు కోరుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమీ కావు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి. అప్పుడు మాత్రమే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించవచ్చు. సగానికిపైగా అద్దెభవనాల్లో గురుకుల పాఠశాలలు నడుస్తున్నాయి. ఆ భవనాల యజమానులకు ఆదాయ గ్యారంటీ భవనాల్లా ఉన్నాయి తప్పితే.. వాటిల్లో తగిన సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు సమయపాలన సవరణ వల్ల మరిన్ని సమస్యలు తోడవుతున్నాయి. వీటి పరిష్కారానికి ఐక్య ఉద్యమాలను నిర్వహించటమే ఏకైక మార్గమ'ని పలువురు వక్తలు అన్నారు.

- ఎనిమిదేండ్లుగా పెరగని మెస్ చార్జీలు
- నాణ్యమైన భోజనం ఎలా ?

టీఎస్‌యూటీఎఫ్, గురుకుల సంఘాల జేఏసీ మహాధర్నాలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శనివారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద టీఎస్‌యూటీఎఫ్, గురుకుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలనీ, మెస్ చార్జీలు పెంచాలనీ, సిబ్బంది సమస్యల పరిష్కారానికై పోరుబాట మహాధర్నాను నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కె జంగయ్య, టిగారియా నాయకులు మామిడి నారాయణ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ధర్నా శిబిరాన్ని టీజీఈజేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల తర్వాత ప్రజాస్వామికంగా హక్కులొచ్చాయనీ, స్వేచ్ఛగా ధర్నా చేసే అవకాశం ...6లో

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. టైం టేబుల్ రివైజ్ చేశారు కదా..! మరి టాయిలెట్స్‌ను రివైజ్ చేయాలనే ఆలోచన ఎందుకు చేయలేదని ఎద్దేవా చేశారు. ఉపాధ్యాయులను నైట్ వాచ్ మెన్‌ల స్థాయికి దిగజార్చారని విమర్శించారు. అదనపు ప్రోత్సాహకాలు లేదా లోగడ ఇచ్చిన పారిటీ స్కేల్స్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు బోధనేతర పనుల భారంతో తీవ్ర ఒత్తిడికి ...6లో

పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి

పట్టభద్రులు నిజాయితీ, విలువలకు
సామాజిక సారథులు

దేశ ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని గుర్తించుకోవాలి

నల్సార్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

6లో..



గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత
మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

హైడ్రా భయంతో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహాన్ని చూడనివ్వని వైనం

సీఎంగా పేదలకు సహాయం చేయ్.. కన్నీళ్లు పెట్టించకు : హరీశ్‌రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో/బేగంపేట

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద శనివారం ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైడ్రా ఆపరేషన్‌లో భాగంగా తమ ఇల్లు కూలుస్తారన్న భయంతో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహాన్ని చూసేందుకు గాంధీ ఆస్పత్రికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పై నుంచి ...13లో



కూల్చక తప్పదు
బాధితులతో మాట్లాడుతాం ఎవర్నీ బలవంతంగా పంపం

హైదరాబాద్‌ను కాపాడేందుకే మూసీ రీ-డెవలప్‌మెంట్

నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు

వాటి విలువ రూ. 26 లక్షల నుంచి రూ. 30 లక్షలు

మూసీ ప్రాంత ప్రజా ప్రతినిధులతో అక్టోబర్‌లో దక్షిణ కొరియా టూర్

మూసీ రివర్ ఫ్రంట్ ఎమ్‌డీ దానకిశోర్

ఆందోళనల వెనుక పెద్దల హస్తం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

వచ్చే వేసవిలో విద్యాసంస్థల అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం



వివరాలు 6లో..

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం
డ్రైవర్, కండక్టర్‌తోపాటు ప్రయాణికుల సహకారం

నవతెలంగాణ-కోదాడరూరల్

ఆర్టీసీ బస్సులో నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో డ్రైవర్, కండక్టర్ సహకారంతో ప్రయాణికులే పురుడు పోశారు. ఈ ఘటన శనివారం సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ డిపో పరిధిలో ...13లో



బిజినెస్

తమిళనాడులో టాటా మోటార్స్ భారీ ప్లాంట్

- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్
- రూ.9,000 కోట్ల పెట్టుబడులు



చెన్నయ్‌ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తమిళనాడులో అతిపెద్ద తయారీ ప్లాంట్ నెలకొల్పడానికి ముందుకు వచ్చింది. చెన్నయ్‌కి 115 కిలోమీటర్ల దూరంలోని రాణిపేటలో రూ.9000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తోన్న తయారీ కేంద్రానికి శనివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్‌లో టాటా మోటార్స్, జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) వాహనాలను తయారు చేయనుంది. ఇక్కడ తయారయ్యే వాహనాలను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించనుంది. తమిళనాడు ప్రభుత్వంతో టాటా మోటార్స్ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. వచ్చే ఐదేళ్లలో రూ.9,000 కోట్లను పెట్టుబడి పెట్టనుంది. సుమారు 5000 ఉద్యోగాలను కల్పించనుంది. "ఎలక్ట్రిక్, లగ్జరీ వాహనాలతో సహా తర్వాతి తరం కార్లు, ఎస్‌యువిలను ఇక్కడ తయారు చేయనున్నాం. తమిళనాడు ప్రగతిశీల విధానాలతో ప్రముఖ పారిశ్రామిక రాష్ట్రంగా ఉంది. అనేక టాటా గ్రూప్ కంపెనీలు ఇక్కడ నుండి విజయవంతంగా పని చేస్తున్నాయి. మహిళా సాధికారతయ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాము. దశలవారీగా ఈ తయారీ కేంద్రం అందుబాటులోకి రానుంది. ఏడాదికి 2.50 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యంలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నాము." అని చంద్ర శేఖరన్ తెలిపారు.

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టీలోకి తేవాలి

- బీజేపీ యేతర రాష్ట్రాల విముఖత : మంత్రి హర్దీప్ సింగ్



న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ఇంధనాలను వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) పరిధిలోకి తీసుకురావాలని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ అన్నారు. అయితే అదనపు వ్యాట్‌ను వదులుకోవడానికి బిజెపియేతర రాష్ట్రాలు సుముఖంగా లేవని పేర్కొన్నారు. దీనిపై ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పూణె ఇంటర్నేషనల్ సెంటర్ 14వ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి మాట్లాడుతూ.. పెట్రోలు, డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి రావాలని తాను చాలా కాలంగా వాదిస్తున్నానని అన్నారు. ఇంధన భద్రతను పెంపొందించడానికి భారత్ వ్యూహాత్మక నిల్వలపై దృష్టి సారిస్తుందన్నారు. దిగుమతి చేసుకున్న ఇంధనంపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించడానికి అన్వేషించాలన్నారు. రాష్ట్రాలకు వాస్తవానికి మద్యం, ఇంధనం ప్రధాన ఆదాయ వనరులుగా ఉండటంతో ఆ రెండింటిని జిఎస్‌టిలోకి చేర్చడానికి ఆనాసక్తిని చూపుతున్నాయన్నారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాల్లోనూ ఇది పలు సార్లు చర్చకు వచ్చిందన్నారు.

సెప్టెంబర్‌లో రూ.57వేల కోట్ల ఎఫ్‌పీఐలు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆచితూచి వ్యవహరించిన విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పిఐ)లు ప్రస్తుతం సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు నికరంగా రూ.57,359 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. తొమ్మిది నెలల్లో ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి. 2024 జనవరిలో రూ.25,744 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించగా.. ఫిబ్రవరిలో రూ.1539 కోట్లు, మార్చిలో రూ.35,098 కోట్లు నికరంగా పెట్టుబడులు నమోదయ్యాయి. ఏప్రిల్‌లో రూ.8,671 కోట్లు, మే నెలలో రూ.25,586 కోట్లు చొప్పున నిధులు తరలిపోయాయి. జూన్‌లో రూ.25,565 కోట్లు, జులైలో రూ.32,359 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారు. ఆగస్టులో రూ.7,322 కోట్ల విలువైన పెట్టుబడులను కుమ్మరించడంతో ఇప్పటి వరకు నికరంగా రూ.1 లక్ష కోట్ల పైనా ఎఫ్‌పిఐలు నమోదయ్యాయి.

ఎంజీ మోటార్ విండ్సర్ విడుదల



హైదరాబాద్ :జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా అందుబాటులోకి తెచ్చిన విండ్సర్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది. పిపిఎస్ మోటార్స్ షోరూంలో దీన్ని జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా విడుదల చేశారు. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.13,49,800గా నిర్ణయించారు. ఇది భారతదేశపు మొదటి ఇంటెలిజెంట్ సియువి సెడాన్ అని సతీందర్ తెలిపారు. వినియోగదారులకు విలాసవంతమైన బిజినెస్‌క్లాస్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. తమ మొత్తం అమ్మకాలలో ఎలక్ట్రిక్ వాహనాల వాటా ప్రస్తుతం 40శాతం ఉండగా, ఎంజి విండ్సర్ ఆవిష్కరణతో ఈ మార్క్ 50 శాతానికి అధిగమించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అక్టోబర్ 3 నుంచి బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పిల్లల్లో సృజనాత్మక శక్తి పెరగాలి

- ఐటీసీ ఫుడ్స్ డివిజన్ హెడ్ హారిస్

హైదరాబాద్ : పిల్లల్లో సృజనాత్మక ఊహాశక్తిని పెంచాలని తమ సంస్థ లక్ష్యంగా పెట్టుకుందని ఐటిసి లిమిటెడ్, బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ పేర్కొన్నారు. ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీలో బిగ్ ఫాంటసీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిగ్ ఫాంటసీస్ గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ (పెద్ద కలలు: మీ ఊహలకు రెక్కలు తొడగండి)" అనే కార్యక్రమంలో హారిస్ మాట్లాడుతూ.. పిల్లల సమగ్ర వికాసానికి కల్పన అనేది ప్రాథమిక అంశంగా ఎలా నిలుస్తుందన్నారు.

బీఎస్ఇ స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లోకి మెర్క్యూరీ ఇవి

హైదరాబాద్ : విద్యుత్ వాహనాల తయారీదారు మెర్క్యూరీ ఇవి టెక్ లిమిటెడ్ తాజాగా బిఎస్ఇ స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లో చేరినట్లు తెలిపింది. ఈ మైలురాయి కంపెనీ ఆవిష్కరణలకు, నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. అదే విధంగా ఈ గుర్తింపు ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతను అభివృద్ధి చేయడానికి, దాని వాటాదారులకు విలువను అందించడానికి దోహదం చేయనుందని తెలిపింది. ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం తమ వాహనాలకు అనుమతిచ్చిందని.. ఇది మార్కెట్‌లో మరిన్ని అవకాశాలను తెరిచినట్లయ్యిందని పేర్కొంది.

ఏఎమ్‌వీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎమ్‌వీఐ) పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఇ నవీన్ నికోలస్ తెలిపారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏఎమ్‌వీఐ పోస్టుల కోసం 2022 డిసెంబర్ 31న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు మూడవ విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అక్టోబర్ 1వ తేదీ నిర్వహిస్తున్నామని వివరించారు. అదేరోజు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ నాంపల్లి ఎమ్‌జే రోడ్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఈ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నదనీ, షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరుకావాలని చెప్పారు. మరిన్ని వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయనీ, చెక్‌లిస్ట్, అటెస్టేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

పతనావస్థలో ప్రభుత్వ విద్యావ్యవస్థ

ఆరువేల పాఠశాలలు మూసివేత

- విద్యాహక్కు చట్టం అమల్లో లేదు
- బాలికలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు
- సీఎం దృష్టిపెట్టాలి-వ్యవస్థను ప్రక్షాళన చేయాలి
- ఎమ్‌వీ ఫౌండేషన్ బహిరంగ విచారణలో బాధితులు, వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తి పతనావస్థలో ఉన్నదని పలువురు బాధితులు, వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మూసివేసిన ఆరువేల స్కూళ్లను రీ ఓపెన్ చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నదనీ, దాని అమలును కోరడం విద్యార్థుల తల్లిదండ్రుల హక్కు అని చెప్పారు. ఎమ్ వెంకటరంగయ్య (ఎమ్‌వీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో "రాష్ట్రంలో పాఠశాల విద్య" అంశంపై బహిరంగ విచారణ నిర్వహించారు. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులుగా నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు పద్మజా షా, పీఎల్ విశ్వేశ్వరరావు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయవాదులు అశోక్ అగర్వాల్, ఎమ్ఏ షకీల్, ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రీసెర్చ్ హెడ్ నావిక్ హర్షే వ్యవహరించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా జ్యూరీ సభ్యులు మాట్లాడుతూ ఆధార్‌కు సర్కారు చదువుకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఆధార్ లేకుంటే చదువు చెప్పరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యలో దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ 35వ ర్యాంక్‌లో ఉందని తెలిపారు. ఆరువేల స్కూళ్లను మూసివేశారనీ, వాటిని తెరిపిస్తామని కాంగ్రెస్‌పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ముఖ్యంగా బాలికలు కనీస మౌలిక సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఆడపిల్లలు కొబ్బరినూనె కోసం కూడా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సి వస్తున్నదంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయో అర్థమవుతున్నాయని ఆక్షేపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ క్రమేణా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గిపోతున్నదనీ, ఇది ఆందోళన కలిగించే అంశమని అన్నారు. రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో ఆరు శాతం నిధుల్ని విద్య కోసం కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫార్సు చేసి, ఏండ్లు గడిచినా ఇప్పటికీ అమల్లోకి రాలేదన్నారు. విద్యకు ఆధార్‌కు ఎలాంటి సంబంధం లేదని ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టమైన తీర్పు ఇచ్చినా, ప్రభుత్వాలు మాత్రం ఆధార్‌నే ప్రామాణికంగా పరిగణిస్తున్నాయని తెలిపారు. ఇది కచ్చితంగా చట్టాల ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి దీనిపై దృష్టిపెట్టాలనీ, విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సవ్య సాచి ఘోష్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

'ఆప్'లో చేరిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం వైస్ చైర్మెన్, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కలీంబాబా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో చేరారు. ఆయనతోపాటు నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సయ్యద్ షా, ఎమ్‌డీ రహీం, అక్బర్, నూర్ అన్వర్, మజీద్, అత్తార్ తదితరులు ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సామాన్యుల కోసం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న కృషిని చూసి పలువురు పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

వర్గీకరణపై జ్యుడీషియల్ కమిషన్

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. శనివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. పంజాబ్, హర్యానా, తమిళనాడుల్లో వర్గీకరణ అమలుకు ముందు ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు విషయాన్ని ఉపసంఘం ప్రస్తావించింది. దీనిపై సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ కావాలని నిర్ణయించారు. ఎస్సీ జనగణనకు 2011 ప్రభుత్వ జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు.

విజయభారతి మరణం సాహిత్యానికి తీరనిలోటు

- గౌరీ శంకర్, కోయి కోటేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకురాలు, బొజ్జా తారకం సతీమణి బోయి విజయభారతి మరణం సాహిత్యానికి తీరనిలోటని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మెన్ జూలూరు గౌరీ శంకర్, ప్రముఖ కవి, విమర్శకుడు కోయి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత దృక్పథంలో నుంచి ప్రాచీన సాహిత్యాన్ని పునర్‌మూల్యాంకనం చేస్తూ ఆమె విలువైన గ్రంథాలను రాశారని పేర్కొన్నారు. అస్తిత్వ ఉద్యమాలకు కొత్త చూపును అందించాయని వివరించారు. దళిత తాత్విక భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంలో ఆమె కీలకమైన పాత్ర పోషించారని తెలిపారు. ఆమె అందించిన ప్రత్యామ్నాయతత్వాన్ని ప్రచారం చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆమె మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రముఖ రచయిత్రి

బోయి విజయభారతి కన్నుమూత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుప్రసిద్ధ కవయిత్రి, అనువాదకురాలు బోయి విజయభారతి (83) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆమెను సనత్‌నగర్‌లోని రెనోవా ఆస్పత్రికి తరలించారు. ఆమె మతిపట్ల పలువురు రచయితలు, మేధావులు, నాయకులు సంతాపం ప్రకటించారు.

తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా సేవలు

తూర్పు గోదావరి జిల్లా రాజోలులో 1941లో ప్రముఖ రచయిత బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతులకు విజయభారతి జన్మించారు. కోఠి ఉమెన్స్ కాలేజీ నుంచి ఆమె పీజీ పూర్తి చేశారు. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం సాంఘిక పరిస్థితులు అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన రెండో మహిళ విజయభారతి కావడం విశేషం. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా విజయభారతి తనదైన ముద్ర వేశారు. దళిత నాయకుడు బొజ్జా తారకంను విజయభారతి వివాహం చేసుకున్నారు. వారి కుమారుడు రాహుల్ బొజ్జా, కూతురు మహిత ఉన్నారు. రాహుల్ బొజ్జ ప్రస్తుతం తెలంగాణ కేడర్‌లో సీనియర్ ఐఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

బోయి విజయభారతి మరణం సాహిత్య లోకానికే కాక బడుగు, బలహీన వర్గాలకూ తీరని లోటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వల్లభాపురం జనార్దన, కె.ఆనందాచారి, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. ఆమె మృతికి సంతాపం ప్రకటించారు.



సీఎం సంతాపం

విజయభారతి మరణంపట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్య కోశం అనే గ్రంథాలను ఆమె రచించారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. సాహితీ రంగానికి ఆమె చేసిన సేవలు అపారమైనవని అన్నారు. రాహుల్ బొజ్జాతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

- సైబారాబాద్ సీపీ అవినాష్ మహంతి

నవ తెలంగాణ - హైదరాబాద్

సైబర్ మోసగాళ్ళతో జాగ్రత్తగా ఉండాలని సైబారాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. నగరంలో శనివారం ఇసాకా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'సెక్యూరింగ్ ది ఫ్యూచర్: నావిగేటింగ్ ది ఇంటర్‌సెక్షన్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అవినాష్ మహంతి పాల్గొని మాట్లాడారు. మనిషిలో రెండు విషయాలను ఆసరాగా చేసుకొని వీరు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అవి.. భయం, దురాశ అన్నారు. ఈ సంవత్సరం సైబర్ క్రైమ్ మొత్తం నేరాలలో 30 శాతం ఉందని, అది రాబోయే కాలంలో 50 శాతానికి చేరవచ్చన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రుణ యాప్ ల మోసాలు విపరీతంగా పెరిగాయన్నారు. వీరు యుపిఐ చెల్లింపులు, క్రిప్టో నెట్‌వర్క్ ఉపయోగించి పెద్ద ఎత్తున మోసాలు చేస్తున్నారని తెలిపారు.

అక్టోబర్ 3 నుంచి టెన్త్, ఇంటర్ దూరవిద్య పరీక్షలు

- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్య వార్షిక పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల తొమ్మిదో తేదీ వరకు అవి జరుగు తాయి. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి శని వారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు విడతల్లో జరుగుతాయని వివరించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలుం టాయని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో 22 పరీక్షా కేంద్రాలున్నాయని వివరించారు. ఈ ఆంక్షలు వచ్చేనెల పదో తేదీ వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

డాక్టర్ విజయభారతికి కేసీఆర్ నివాళి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, అనువాదకురాలు, అంబేద్కరిస్టు డాక్టర్ విజయభారతి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా ఆమె చేసిన కృషిని ఆయన కొనియాడారు. తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్‌గా సేవలందించిన విజయభారతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలకు సంపాదకురాలిగా, మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్టమొదటి సారి అందిం చిన రచయిత్రిగా ఆమె చేసిన కృషి చాలా గొప్పదని పేర్కొన్నారు.

పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్ త్వరగా పూర్తి చేయండి


- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌కు పీఈటీ అభ్యర్థుల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్ త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలంటూ మహేష్‌కుమార్‌కు పీఈటీ అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో పీఈటీ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చిందనీ, ఆ ప్రభుత్వ పదవికాలం పూర్తి అయ్యేంత వరకు కూడా ఫలితాలను విడుదల చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫలితాలను ప్రకటించిందనీ, మెరిట్ లిస్టును కూడా తయారు చేసిందని చెప్పారు. మెరిట్ సంపాదించలేని వారు కోర్టులకు వెళ్లి అక్రమంగా రిక్రూట్మెంట్‌ను ఆపాలని ప్రయత్నం చేస్తున్నారనీ, వెంటనే ప్రభుత్వం ఈ రిక్రూట్మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దసరా పండుగ లోపు వారి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌పై నిపుణుల కమిటీ వేయాలి

- ఏఈవో సంఘం నాయకులను భాగస్వామ్యం చేయాలి : తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే యాప్ అమలుపై నిపుణుల కమిటీని నియమించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) సంఘం నాయకులను సభ్యులుగా భాగస్వామ్యం చేయాలని కోరారు. రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ లక్ష్యాలు చేరుకునేలా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కేంద్రసంఘం కార్యాలయంలో ఏఈవోల సెంట్రల్ ఫోరం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా డిజిటల్ క్రాప్ సర్వేలో ఏఈవోలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే అమలు చేస్తున్న విధానం కాకుండా తెలంగాణలో ఏఈవోలను పూర్తి బాధ్యుల్ని చేస్తూ ఒక యాప్‌ను ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్నదని తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు డి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి కె సురేష్‌రెడ్డి వివరించారు. మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారని చెప్పారు. ప్రతి సర్వే నెంబర్, సబ్ డివిజన్‌లో వేసిన పంట వివరాలను ఫొటోతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే నెంబర్‌ను గుర్తించినప్పటికీ సబ్ డివిజన్‌ను గుర్తించలేకపోతున్నామని అన్నారు. దీంతో రైతులు వేసిన పంటల వివరాల ఫొటోలను పూర్తిగా అప్‌లోడ్ చేసే అవకాశం లేదన్నారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఏఈవోల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ జేఏసీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో 2,604 రైతువేదికలున్నాయని అన్నారు. వాటి నిర్వహణకు నెలకు రూ.తొమ్మిది వేల చొప్పున నిర్వహణ ఖర్చులను ఇస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందని వివరించారు.

రైతువేదికలకు ఆ నిధులను విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, ఏఈవోల సంఘం అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



సంతాప తీర్మానం ప్రవేశపెడుతున్న సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) అగ్రనేత ప్రకాశ్ కరత్, వేదికపై వివిధ పార్టీల జాతీయ నేతలు



స్మృతి గీతాలు ఆలపిస్తున్న జన నాట్య మంచ్ బృందం

ఇండియా బ్లాక్ చీఫ్ ఆర్కిటెక్ట్ సీతారాం ఏచూరి

ఏచూరిని స్మరించుకున్న దేశ రాజధాని

- జీవిత చరిత్ర ఆధారంగా ఫొటో ఎగ్జిబిషన్
- ఢిల్లీలోని తాల్కతోర ఇండోర్ స్టేడియంలో సంస్మరణ సభ

(మొదటిపేజీ తరువాయి)

మంచ్, ప్రచమ్ కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు.

సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన : ప్రకాశ్‌కరత్

మెరుగైన భారతదేశం, సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన అని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ అన్నారు. ఈ ఆలోచనను నెరవేర్చడానికి మనమందరం కలిసి పని చేయాలని, అదే ఏచూరికి ఇచ్చే నిజమైన, ఘనమైన నివాళి అవుతుందని తెలిపారు. ఏచూరితో తనకున్న అనుబంధం 50 ఏండ్ల నాటిదని ఆయన గుర్తు చేసుకున్నారు. వామపక్ష ఉద్యమానికి ఆయన చేసిన కృషిని, ముఖ్యంగా హిందుత్వ రాజకీయాలపై ఆయన చేసిన విమర్శలను వివరించారు.

యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకం : విజయన్

ఏచూరి 'భారతీయ చరిత్ర, సమాజం, సంస్కృతి, రాజకీయాలపై మంచి అవగాహన ఉన్న మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త" అని కేరళ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి అత్యంత అవసరమైన తరుణంలో ఏచూరిని మనం కోల్పోయామని అన్నారు. సెక్యులరిజంపై మతోన్మాదం పెద్దఎత్తున దాడులు చేస్తున్న తరుణంలో ఏచూరి నిష్క్రమణ ఒక దెబ్బని తెలిపారు. దేశంలోని యువతకు, విద్యార్థులకు ఏచూరి ఎప్పుడూ గొప్ప స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. ఏచూరి మరణానంతరం జేఎన్‌యూ ఇచ్చిన ఉద్వేగభరితమైన సందేశం దేశంలోని విద్యార్థులకు ఆయనపై ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమని అన్నారు. పార్లమెంట్‌లో ఆయన పాత్ర చెరగని ముద్ర వేసిందని, ఇండియా బ్లాక్ ఏర్పాటు, పనితీరులో ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు.

ఏచూరి అందరి సొత్తు : మల్లికార్జున ఖర్గే

ఏచూరి కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఆస్తి కాదని, అందరి అభిమాన నాయకుడని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. తమందరితో ఆయన సమావేశాలు పెట్టేవారని, ఇండియా బ్లాక్ ప్రధాన రూపశిల్పి అని, ఇండియా బ్లాక్‌లో ఐక్యతను తీసుకురావడానికి, దానిని ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.

పార్టీల మధ్య వారధి



"ఇండియా బ్లాక్ చీఫ్ ఆర్కిటెక్ట్ ఏచూరి. ఆయన వివిధ పార్టీల మధ్య వారధి. నా స్నేహితుడు. నేను అతని స్నేహితునిగా ఉన్నందుకు గర్వపడుతున్నా. పరిచయమైన మొదటి రోజు నుంచి ఆయన్ని చాలా దగ్గరగా చూశా. ఇతరుల మాటలు విని వారి మాటలకు విలువనిచ్చే వ్యక్తి. ఆయన తన స్వంత భావజాలంలో స్థిరంగా ఉన్నప్పటికీ, ఎదురుగా ఉన్నవారి ఆలోచనలు, వైఖరులు, భావాలను అర్థం చేసుకున్నారు. ఏచూరిలో సాధారణ రాజకీయ నాయకుల ఆగ్రహం, అహంకారం వంటి వైఖరి ఏ మాత్రం కనిపించ లేదు. వ్యక్తిగతంగా ఉత్తమ లక్షణాలు, రాజకీయంగా అత్యుత్తమ లక్షణాలు కలిగిన నేత ఏచూరి. ఇండియా బ్లాక్‌కు ప్రధాన రూపశిల్పిగా ఉన్న ఏచూరి వివిధ పార్టీల మధ్య వారధిగా నిలిచారు. మా అమ్మ (సోనియా) కూడా ఏచూరికి గొప్ప స్నేహితురాలు. నిజానికి మా అమ్మ ఆయనతో నాకంటే ఎక్కువ స్నేహం చేసేది. కొద్దిరోజుల క్రితం అమ్మను చూసేందుకు ఏచూరి వచ్చారు. రాజకీయాల గురించి చర్చిస్తున్నప్పుడు, ఆయన విపరీతంగా దగ్గడం గమనించాను. అప్పుడు నేను, 'ఏచూరీజీ మీరు వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి' అన్నాను. కానీ ఆయన నవ్వి ఊరుకున్నారు. ఆ తరువాత ఆయన ఆస్పత్రికి వెళ్లారు. నా స్నేహితుడు త్వరలో ఆస్పత్రి నుంచి వస్తారని ఆశించా. కానీ నా ఆశ ఫలించలేదు. ఏచూరీజీ మనం ఎప్పుడూ విశ్వసించగలిగే వ్యక్తి. ఎలాంటి ఒత్తిడికి లొంగలేదు. ఆయన చేసినదంతా భారతదేశ మేలు కోసమే"

- రాహుల్ గాంధీ

ప్రపంచంలోని ఏ అగ్రశ్రేణి సంస్థకైనా చేరుకోగలిగే విద్యార్థి: ప్రభాత్ పట్నాయక్

సీతారాం ఏచూరిని కేవలం సహచరుడు,స్నేహితుడిగా మాత్రమే కాకుండా, తన "తెలివైన" విద్యార్థిగా ప్రఖ్యాత ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం అత్యుత్తమ విద్యార్థి అని, స్కాలర్‌షిప్‌తో ప్రపంచంలోని ఏ ప్రముఖ విద్యాసంస్థలోనైనా చదువుకోవచ్చునని, అయితే జేఎన్‌యూలో కొనసాగాలనే ఆయన నిర్ణయం ఆ సంస్థను తీర్చిదిద్దడంలో గొప్ప పాత్ర పోషించిందని ఆయన అన్నారు. ఏచూరి 'ఆధునిక కమ్యూనిస్ట్" అని కొనియాడారు.

హాఫ్ సెంచరీ కామ్రేడ్ : ఎన్ రామ్

సీతారాం అర్ధశతాబ్ద కాలంగా కలిసి ఉన్న స్నేహితుడు, సహచరుడు అని ప్రముఖ జర్నలిస్ట్ ఎన్ రామ్ అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ముఖ్యంగా మీడియా స్వేచ్ఛ కోసం నిలబడి, జర్నలిస్టులకు అండగా నిలబడటంలో సీతారాం పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రాజ్యాంగ విలువలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడులను ప్రతిఘటించిన బలమైన పోరాట యోధుడని అన్నారు.

మహోన్నత కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరు : డి.రాజా

దేశ సమకాలీన చరిత్రలో మహోన్నతమైన కమ్యూనిస్టు నాయకుల్లో సీతారాం ఏచూరి ఒకరని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. సీతారాం మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, యావత్ దేశానికి తీరని లోటని, ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

అందరికీ రాజకీయ గురువు : జి.దేవరాజన్

వామపక్ష ఉద్యమంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రతి ఒక్కరికీ రాజకీయ గురువు అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ అన్నారు. రాజకీయాలంటే కేవలం అవకాశాల కళ కాదని, అసాధ్యాలను సుసాధ్యం చేయడమేనని సీతారాం నిరూపించారన్నారు.

ఏచూరి పోరాటాన్ని కొనసాగించాలి : దీపాంకర్ భట్టాచార్య

ఏచూరి మారుతున్న కాలాన్ని, తాజా పోరాటాల ఆవశ్యకతను అర్థం చేసుకోగలిగారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. మతతత్వం వంటి సమస్యలపై సీతారాం బలమైన, శక్తివంతమైన గొంతెను ఎత్తారని గుర్తు చేసుకున్నారు.

ఆయన స్ఫూర్తితో పోరాడాలి : ఫరూక్ అబ్దుల్లా

సీతారాం ఏచూరికి ప్రత్యర్థులు లేరని, ఆయన జ్ఞాపకాన్ని కాపాడుకోవడానికి మనం నిర్భయంగా పోరాడాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా అన్నారు. అదే ఆయనకు ఇవ్వగల గొప్ప నివాళి అని పేర్కొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వమనే ఆలోచనకు ప్రచారకర్త : కనిమొళి (డీఎంకే)

ఏచూరి నిర్భయ పోరాట యోధుడని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. విద్యార్థి దశ నుండి, ఆయన తప్పుగా భావించే వాటిని నిర్భయంగా వ్యతిరేకించారని, చివరి శ్వాస వరకు అదే కొనసాగిందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యం పక్షాన నిలిచారని, భిన్నత్వంలో ఏకత్వం అనే ఆలోచనకు గొప్ప ప్రచారకర్త అని అన్నారు.

మా హీరో ఏచూరి : సుప్రియా సూలే (ఎన్‌సీపీ)

రాజ్యసభలో ఏచూరి మా హీరో అని ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే అన్నారు. తన స్వంత భావజాలం గురించి ఇంత స్పష్టంగా ఉన్న వారిని తాను మరెవరినీ కలవలేదని అన్నారు. దానికి కట్టుబడి సమకాలీన సమస్యలను నిర్వచించారని, పార్లమెంట్‌లో మొదలైన బాంధవ్యం ఇళ్లలకు ఎదిగిందని తెలిపారు. మహారాష్ట్రలో పోరాటాలకు ఆయన కృషిని, ముఖ్యంగా రాష్ట్రంలోని ఉల్లి రైతులకు ఆయన సంఘీభావాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు.

సమస్య పరిష్కార కర్త : గోపాల్ రాయ్ (ఆప్)

కేజ్రీవాల్‌తో సహా ఆప్‌కి చెందిన ప్రముఖ నేతల అరెస్ట్‌తో ఢిల్లీ ప్రభుత్వం పడిపోవడంతో పాటు పార్టీ కూలిపోతుందని అనే భావన వచ్చినప్పుడు, తన కష్టాలు ఎవరికి చెప్పాలా అని ఆలోచించానని, ఒక్కసారిగా ఏచూరి ముఖం గుర్తుకు వచ్చిందని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ అన్నారు. తాను ఏచూరిని చూడటానికి వెళ్ళానని, "భయపడకు... మేం మీ వెంటే ఉన్నామని, పోరాడుతామని ఏచూరి నాకు భరోసా ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, బీవి రాఘవులు, సూర్యకాంత్ మిశ్రా, సుభాషిణి అలీ, ఎండీ సలీం, ఎంఎ బేబి, తపన్ సేన్, జి. రామకృష్ణ, ఎ. విజయరాఘవన్, నిలోత్పల్ బసు, అశోక్ దావలే, రామచంద్రడోమ్, గోవిందన్ మాస్టర్, పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆధార్, పాన్ సమాచారాన్ని లీక్ చేసే వెబ్‌సైట్‌లు బ్లాక్

- కేంద్రం వెల్లడి
- వ్యక్తిగత డేటా భద్రతపై అనుమానాలు

న్యూఢిల్లీ : భారత్‌లో పౌరుల వ్యక్తిగత సమాచార ఉల్లంఘన మరోసారి ఆందోళనకు గురి చేస్తున్నది. అలా సమాచారాన్ని లీక్ చేసే వెబ్‌సైట్లను గుర్తించి, బ్లాక్ చేసినట్టు సాక్షాత్తూ కేంద్రమే తెలపటం దేశంలో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఆధార్, పాన్ వంటి పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని లీక్ చేస్తున్నట్టు కనుగొన్న పలు వెబ్‌సైట్లను బ్లాక్ చేసినట్టు కేంద్రం వెల్లడించింది. భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వెబ్‌సైట్ల విశ్లేషణలో లోపాలను కనుగొన్న తర్వాత ప్రభుత్వం ఈ చర్యకు దిగిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వెల్లడించింది. అయితే, ఏ వెబ్‌సైట్లను బ్లాక్ చేసిందన్న విషయాన్ని మాత్రం చెప్పలేదు. వ్యక్తిగత సమాచార రక్షణ, సైబర్ సెక్యూరిటీ పద్ధతులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది కాబట్టి దీనిని సీరియస్‌గా తీసుకున్నట్టు వివరించింది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ (ఐసీటీ) మౌలిక సదుపాయాలను పటిష్టపర్చటం, దుర్బలత్వాల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత వెబ్‌సైట్ల యజమానులకు మార్గదర్శకత్వం అందించబడుతుందని సంబంధిత మంత్రిత్వ శాఖ వివరించింది. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 29(4) (ఆధార్ వివరాల బహిరంగ ప్రదర్శన) ఉల్లంఘనకు సంబంధించి యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నది. ఆధార్, పాన్ సమాచారం లీక్ ద్వారా నష్టపోయినవారు సమాచార సాంకేతిక చట్టం కింద ప్రభుత్వం నియమించిన అడ్జుడికేటింగ్ అధికారుల ద్వారా పరిహారం కోరవచ్చు. రాష్ట్రాల ఐటీ సెక్రెటరీలు ఈ అధికారం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది.

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా చనిపోయారు

ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటన

- ధృవీకరించిన హిజ్బుల్లా
- రాత్రంతా దాడులతో భీతిల్లిన ప్రజలు
- బీరుట్ బీచ్ వద్ద రోడ్లపైనే మకాం



బీరుట్ : పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హిజ్బుల్లా టాప్ కమాండర్లే లక్ష్యంగా లెబనాన్‌పై విరుచుకుపడడం మొదలుపెట్టిన ఇజ్రాయిల్ ఇప్పటి వరకు ఇద్దరు కమాండర్లను పొట్టనబెట్టుకుంది. తాజాగా విచక్షణారహితంగా కొనసాగిస్తున్న దాడుల్లో హిజ్బుల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లా మరణించినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ శనివారం ప్రకటించింది. సైనిక ప్రతినిధి అవిచాయ్ అదరీ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు.

బీరుట్‌లో హిజ్బుల్లా ప్రధాన కార్యాలయమే లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున వరుస దాడులు జరిపామని మిలటరీ తెలిపింది. ఆ సమయంలో నస్రల్లా ఆ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తమకు పక్కాగా సమాచారం అందిందని ఆర్మీ వెల్లడించింది. ఆ చుట్టుపక్కల గల పలు అంతస్తుల భవంతులను కూడా వదిలిపెట్టలేదు. హసన్ నస్రల్లాపై దాడి చేయడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని అమెరికా అధికారులు కూడా తెలిపారు. తమ లక్ష్యం నెరవేరిందని, నస్రల్లాను హతమార్చామని ఇజ్రాయిల్ సైన్యం వెల్లడించింది. ఇక నస్రల్లా తన తీవ్రవాద చర్యలతో ప్రపంచాన్ని భయపెట్టలేరని వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ వార్ రూమ్ కూడా దీనిపై స్పందించింది. 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' మిషన్ విజయవంతమైనట్లు ప్రకటించింది. తాజా పరిణామాలతో హిజ్బుల్లా కార్యాచరణలో కూడా మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు లెఫ్టినెంట్ కల్నల్ నాదవ్ షోషాని తెలిపారు. మరోవైపు హిజ్బుల్లా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. జన సాంద్రత ఎక్కవగా గల బీరుట్ శివారు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఉధృతంగా కొనసాగిన దాడుల్లో తమ నాయకుడు నస్రల్లా చనిపోయాడని తెలియజేసింది.

విరామం లేకుండా రాత్రంతా దాడులు

హిజ్బుల్లాకు గట్టి స్థావరమైన బీరుట్ దక్షిణ శివార్లలో శుక్రవారం రాత్రంతా ఒక్క క్షణం కూడా విరామం ఇవ్వకుండా బాంబు దాడులను కొనసాగించింది. తిరిగి శనివారం ఉదయం నుండే మళ్లీ కొత్త దాడులు మొదలుపెట్టామని మిలటరీ తెలిపింది. ఈసారి తూర్పు లెబనాన్‌లోని బెకా ప్రాంతంలో హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు సాగాయి. మొత్తంగా 140 వరకు హిజ్బుల్లా లక్ష్యాలపై దాడి చేసినట్లు బలగాలు తెలిపాయి. భూగర్భంలో బంకర్లు ఏర్పాటు చేసుకుని అక్కడ సురక్షితంగా వుందామనుకున్న ప్రయత్నాలను కూడా ఇజ్రాయిల్ పడనివ్వలేదు. బంకర్లను పేల్చే బాంబులను ఉపయోగించింది.

గత రాత్రి నుంచి అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న దాడులతో, మోగుతున్న సైరన్లతో, విమానాల రొదతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. గ్రామాలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా ఈ దాడులు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు బీరుట్ సముద్రపు ఒడ్డు దగ్గరకు చేరుకుంటున్నారు. శనివారం ఉదయం బీచ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో కార్లు పార్క్ చేసుకుని కుటుంబాలతో రోడ్లపైనే కూర్చుని వుండడం కనిపిస్తోంది.

ఎవరీ హసన్ నస్రల్లా ?

ఇజ్రాయిల్‌తో దశాబ్దాలుగా జరుగుతున్న పోరాటంలో హిజ్బుల్లాకు నాయకత్వం వహిస్తూ ఇరాన్ మద్దతుతో ముందుకు సాగుతున్న హసన్ నస్రల్లా అరబ్ ప్రముఖుల్లో ఒకరిగా మారారు.

రిజర్వ్ బలగాలను సమీకరిస్తున్న ఆర్మీ

హిజ్బుల్లాతో ఘర్షణలు పెచ్చరిల్లుతాయని భావించిన ఇజ్రాయిల్ మూడు రిజర్వ్ బెటాలియన్లను సమీకరిస్తోంది. తమ సెంట్రల్ కమాండ్‌ను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అధికంగా జనాభా వుంటే దహియె శివార్ల నుండి ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ ఆదేశాలు జారీ చేసింది.

పోరు కొనసాగుతుందన్న హిజ్బుల్లా

తమ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన నస్రల్లా చనిపోయినప్పటికీ శత్రువుపై పోరాటం కొనసాగుతుందని హిజ్బుల్లా ప్రకటించింది. పాలస్తీనాకు మద్దతు కొనసాగుతుందని తెలిపింది.

ప్రతిఘటన బలపడుతుంది

నస్రల్లా మృతికి పాలస్తీనా గ్రూపు హమాస్ సంతాపం ప్రకటించింది. "పోరు బాటలో వున్న నేతలు అమరులైనప్పుడు ఆ ప్రతిఘటనా క్రమం ఆదే బాటలో సాగి విజయం సాధిస్తుందని చరిత్ర మనకు రుజువు చేసింది. తర్వాత తరం నేతలు మరింత బలోపేతులై, మరింత కృతనిశ్చయం,, దీక్షతో ఈ పోరును కొనసాగిస్తారు." అని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రత్యేకంగా నస్రల్లా పేరును ప్రస్తావించకుండా శుక్రవారం నాటి దాడుల్లో మరణించిన వారికి టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ సంతాపం తెలిపారు. ఆ దాడులను తీవ్రంగా ఖండించారు.

హిజ్బుల్లా కొత్త నేత హషెమ్ సఫిద్దీన్?

నస్రల్లా మరణంతో హిజ్బుల్లా కొత్త నేతగా మత పండితుడు, రాజకీయ ప్రముఖుడైన హషెమ్ సఫిద్దీన్ పేరు వినిపిస్తోంది.

అప్రమత్తమైన ఇరాన్.. లెబనాన్‌కు అండగా వుండాలని ఖమేని పిలుపు

నస్రల్లా మృతి వార్త తెలిసిన వెంటనే ఇరాన్ అప్రమత్తమైంది. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనిని అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య గుర్తు తెలియని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఇటువంటి విషాద సమయంలో లెబనాన్ ప్రజలకు అండగా నిలబడాల్సిందిగా ఖమేని ప్రజలను కోరారు. ఈ ప్రాంత భవితవ్యాన్ని నిర్ణయించేది ప్రతిఘటనా శక్తులేనని, అందులో హిజ్బుల్లా అగ్ర భాగాన వుంటుందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ విధానాన్ని ఖమేని తీవ్రంగా ఖండించారు. తదుపరి కార్యాచరణపై చర్చించి, నిర్ణయించేందుకు ఇతర ప్రాంతీయ గ్రూపులతో, హిజ్బుల్లాతో ఆయన సంబంధాలను కొనసాగిస్తున్నారు. శనివారం ఉదయం నుండి హిజ్బుల్లా రెండు డజన్లకు పైగా క్షిపణులను ఇజ్రాయిల్‌పై ప్రయోగించింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కాంట్రాక్టు వర్కర్స్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనాలు పెంచాలి. కార్మిక చట్టాలు అమలు చేయాలి. వీటిని ప్రభుత్వం అమలు చేయాలి. కానీ..ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదు. కార్మికుల బతుకుల కంటే పారిశ్రామిక యజమానుల లాభాలే ముఖ్యమని చెప్పకనే చెబుతోంది. కార్మికులు కూడా ప్రజాప్రభుత్వంలో భాగమే.. ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు మరవొద్దు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ పారిశ్రామిక ఉత్పత్తులను పెంచుతున్న కార్మికుల పట్ల సర్కారు మీనమేషాలు లెక్కించటం మానుకోవాలి. వారి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలి. లేదంటే కార్మికులు పోరు సైరన్ మోగిస్తరన్న విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలి. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో లేబర్ కమిషనరేట్ కార్యక్రమం సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో నవతెలంగాణ ప్రతినిధి ఎస్.వెంకన్న ఇంటర్వ్యూ..



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నాన్‌పర్మినెంట్ ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలేంటి?

వీరికి ఉద్యోగ భద్రత లేదు. వీరితో చాకిరీ చేయించుకోవటమే తప్ప.. కార్మిక చట్టాలు వర్తించవు. కనీస వేతనాలు అమలు కావటం లేదు. ఇలా అనేక సమస్యలతో వీరు సతమతమవు తున్నారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ అఖిల భారత కమిటీ దేశవ్యాప్తంగా 2004 సెప్టెంబర్‌లో వీరి సమస్యలపై క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రయివేట్ పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, యానివర్సిటీ నాన్ టీచింగ్, మున్సిపల్, గ్రామ పంచాయతీ తదితర స్థానిక సంస్థ, వైద్య ఆరోగ్య, విద్యుత్ రంగం, సింగరేణి, ఆర్టీసీ తదితర రంగాల కాంట్రాక్ట్, నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యలపై క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాము. వీరి సమస్యలపై సర్వేలు చేశాం. యాజమాన్యాలు కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నాం. గేట్ మీటింగులు, గ్రూప్ మీటింగులు, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టాం. కనీస వేతనాలు పెంచాలనీ, కార్మిక చట్టాలు అమలు చేయాలనీ, 1979 వలస కార్మిక చట్టాన్ని పటిష్టంగా అమలుపర్చాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నదనేది నిజమేనా?

ప్రభుత్వాల విధానాల వల్లే తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల అన్ని రంగాల్లో వీరి సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. 1991 నుంచి అనుసరిస్తున్న ఆ విధానాల వల్ల ఉద్యోగ భద్రత పోయింది. హైర్ అండ్ ఫైర్ విధానం వచ్చింది. 2014 నుంచి కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల్లో మార్పులు చేసింది. 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చింది. కనీస వేతనానికి గ్యారంటీ లేకుండా చేసింది. ఎనిమిది గంటల పనిదినానికి బదులుగా 12 గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టింది. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను యాజమాన్యాల శాఖగా మార్చింది. పర్మినెంట్ వ్యవస్థను, హక్కులను పూర్తిగా రద్దు చేసింది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, విధానాలలో టెంపరరీ, డైలివేజ్ అప్రెంటీస్ పీస్ రేటేడ్, హోమ్ బేస్డ్ వర్కర్స్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నది. మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్రెంటీస్‌లను 30శాతం పెంచుకోడానికి అవకాశం ఇచ్చింది. ఫిక్స్‌డ్ టర్మ్, లాంగ్ టర్మ్‌ట్రైనీ, నీమ్, వంటి స్కీమ్‌ల పేరుతో కార్మికులను రిక్రూట్ చేసుకుని శ్రమ దోపిడీ చేస్తున్నారు. శిక్షణ పేరిట స్టైఫండిచ్చి యంత్రాల మీద పనిచేయిస్తూ ఉత్పత్తి పెంచుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారు.

కనీస వేతనాలు పెంచకపోతే.. బతికేదెట్లా?

ఈ విధానాల ప్రభావం రాష్ట్రంలో ఎలా ఉంది.?

రాష్ట్రంలో కార్మికుల పొందికలో చాలా మార్పులొచ్చాయి. పర్మినెంట్ వర్కర్స్ సంఖ్య పడిపోయి నాన్ పర్మినెంట్ కార్మికుల సంఖ్య 96 శాతానికి పెరిగింది. ఇందులో మహిళా వర్కర్స్ సంఖ్య కూడా 25 శాతం ఉంది. ఉత్పత్తి రంగంలో 34.6, నిర్మాణ రంగంలో 23.1, అగ్రికల్చర్‌లో 12.2, మైనింగ్ అండ్ క్వారీ 4.2, ట్రాన్స్‌పోర్ట్ 3.4శాతం చొప్పున, మిగిలిన రంగాల్లో 2.0 శాతం చొప్పున కార్మికులున్నారు. ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్రే కీలకం. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి, ఆర్టీసి, విద్యుత్ ఇతర కార్పొరేషన్లలో వేల సంఖ్యలో కాంట్రాక్టు ఎంప్లాయీస్‌ను పర్మినెంట్ చేయకుండా దశాబ్దాల తరబడి పని చేయిస్తున్నారు. స్థానిక సంస్థలు (మున్సిపల్, గ్రామ పంచాయతీ), యూనివర్సిటీల్లో కూడా పెద్ద సంఖ్యలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు లేని దయనీయ స్థితి ఉంది. రాష్ట్రంలో షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లోని సుమారు కోటి మంది కార్మికులకు ప్రతి ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ 2012 నుంచి నేటివరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ వేతనాలు సవరించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం..డీఏను బేసిక్‌లో కలిపేసి అదే కనీస వేతనం అని చెబుతున్నది. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నేడు కార్మికుల ధర్నాలు జరిగాయి. హైదరాబాద్ చుట్టూ ఉన్న పారిశ్రామిక కార్మికులతో పాటు ఇతర అసంఘటిత రంగ కార్మికులను కలుపుకుని పెద్ద ఎత్తున లేబర్ కమిషనరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నాం.





పూలతత్త్వం

పువ్వులు ప్రకృతి మనకందించిన ఓ గొప్ప వరాలుగా భావించవచ్చు. ఈ భూమండలం పైన సమస్త జీవరాశుల జీవన లయలకు ప్రతిబింబాలుగా, ప్రతీకలుగా ఒప్పారే సౌందర్యానందాలను అందించే మహారూపాలు రూపగుణ మేల్కలయికలు. పరిమళకాంతులు. రంగుల హరివిల్లులు.. విశ్వ మానవ సౌందర్యాత్మక చూపుకు అక్షరాలు దిద్దిన సంగీత ధ్వనులు. సౌరభాకృతుల వర్ణ సమ్మేళనాలు. కవితోద్దీపనా కేంద్రకములు. మనో వికాసహారికలు. పువ్వులు, మనసవ్వులు. మానవజీవితానికి ప్రకృతి పరంగా పోల్చదగిన ఉపమానాలు. సంతోష ఆనందాలకు సంకేతాలు. శృంగార పోషణోద్ధరణా వృత్ప త్తులు. భక్తి పారవశ్యాలకు అనుసంధానకర్తలు. ప్రేమాభివ్యక్తికి మధ్యవర్తులు.కడసారి వీడ్కోళ్లకు, జోహార్ల కు ఆశ్రయమిచ్చు అంజలీ పత్రములు. అలంకరణా రాజ్యానికి పట్టపురాణులు...ఇలా పూలనెన్ని విధము లైనా అన్వయించవచ్చు, వివరించవచ్చు.

ఎందుకంటే మనుషుల జీవితానికి, పూల జీవితానికి దగ్గరి సంబంధం ఉంది.పూలు పుడతాయి. గిడతాయి మనుషుల్లాగే. వాటికీ శిశు, బాల్య, యవ్వన, వృద్ధాప్య దశలూ ఉంటాయి. మనుషుల్లోని మానవతలా, పరిమళమూ ఉంటుంది. అది ఎదుటివాళ్లను ఆనందమయం గావిస్తుంది.ముద్దొచ్చే గుణం ఇద్దరిలోనూ ఉంది. భాషల కతీతంగా ప్రేమను వ్యక్తం చేయగలరు. దు:ఖపు వేళలోనూ కన్నీళ్లతో పాటు పువ్వులూ విడుస్తాము. బాధల సమయాన మనతో ఉంటాయి. విజయానికి గుర్తుగా హారమై వీర గర్వాన్ని వ్యక్తం చేస్తాయి. అనుబంధాలను బంధించే సందర్భంలోనూ మన మధ్యే ఉంటాయి. మనుషుల్లోని జీవన రసస్వాదనలాగే, మధురతేనెలనందించే రసధుని కుసుమం. మనిషికి సంతోషాలతో పాటు ఇక్కట్లు ఎదురైనట్లే, పూలనంటుకునీ ముళ్లుంటాయి. చెట్టు

మనిషి కూడా ప్రకృతిలో భాగమే. కేవలం ఒక మెదడును అభివృద్ధి చేసుకున్నాడు. ఆలోచనను పెంచుకున్నాడు. ఊహించగలుగుతున్నాడు. మరింత ఉన్నతంగా ఉండాల్సింది పోయి, కుంచించుకు పోతున్నాడు. స్వార్థపరుడై తన భవితనే విధ్వంసమొనరుస్తున్నాడు. ప్రకృతి పరిరక్షణలోనే మన రక్షణ ఆధారపడి ఉంటుంది. పచ్చనితనం, పూలపరిమళం లేని, ఎడారినేలలో మనిషి మనుగడ సాధించ లేడు. స్త్రీలను పూలతో పోలుస్తాము కదా మనం. ఆ స్త్రీలను మన సమానంగా, గౌరవంగా చూడలేక పోతే మనుష్యులుగా మిగలము. సమానంగా చూడకపోగా, బలహీనురాలుగా భావించి స్త్రీలపై జరుగుతున్న లైంగిక దాడులు, అణచివేతలు పెరిగిపోవడం మానవ జాతికి కళంకంగా మారుతున్నది.

ఆధారంగానే పువ్వు ఉనికై నట్లు, సమాజం, మనిషిని నిర్మిస్తుంది. పువ్వు సహజ లక్షణం, పరిమళాన్ని వెదజల్లడం. మనిషి సహ జంగా మానవతను అందించాలి. పువ్వేమీ దాని సహజాతాన్ని వొదలలేదు. కానీ మానవుడు మాత్రం మానవీయతను వదిలేస్తున్నాడు.

ప్రకృతిపరంగా పూలనూ స్త్రీలనూ కలపి పోలుస్తారు. కానీ పూలతత్వం మనుషులందరిలోనూ ఉంటుంది.ఉండాలి కూడా. ఇప్పుడు పూల గురించి ఎందుకు యాది చేసుకోవడమంటే బతుకమ్మ పండ గొచ్చింది. అమ్మలందరు మంచిగ బతకాలని పూలను కొలుస్తరు. స్త్రీలను కన్నీళ్లకు, కడగండ్లకు గురిచే యొద్దని పూలతో పాటలతో ఊరేగే పండుగ. సామాజిక, ప్రాకృతిక, పర్యావరణ సాంస్కృతిక వేడుక ఈ పండుగ. దీని విశిష్టత గురించి మనం చాలా చెప్పుకోవచ్చు. కానీ పువ్వుల గురించిన భావనలను కొంత పరికించాలి. పూలలో అనేక రకాలుంటాయి. గునుగుపూలు, తంగేడు, నందివర్ధనం, మల్లెలు, చామం తులు, బంతిపూలు, గులాబీలు, గడ్డిపూలు, గన్నేరుపూలు... ఇలా చెప్పుకుంటూ పోవచ్చు. ఎన్నిరకాలుగా ఉన్నా, వాటికున్న పేరు పూలు. పూలన్నీ అందంగానే ఉంటాయి. వాటికి కులం, మతం ఉండదు. అన్ని మతాలూ ఆ పువ్వుల్నే వాడతారు. ప్రాంతీయ భేదమూ వాటి జోలికిరాదు. కుల కుత్సితం వాటికంటదు. రంగులన్నీ వాటి ప్రత్యేకతలు తప్ప బేదాలు, వ్యత్యాసాలు కావు. అన్ని రంగుల కలయికలే కంటగింపుగా ఉంటాయి. లౌకికత్వం వాటి సార్వజనీన విలువ. తాము పరులకు, పదుగురికి పరిమళాన్ని పంచుతు న్నామని ఏమీ హెచ్చులకుపోవు.అందాన్ని ఆనందం కోసం అందిస్తున్నామనీ అనుకోవు. తమ తమ సహజ లక్షణంగానే వ్యక్తం చేస్తాయి. కానీ మనిషి త్యాగం అనుకుంటాడు. తనవల్లే అనే అహం ఉన్న వాడు మానవుడు.

మనిషి కూడా ప్రకృతిలో భాగమే. కేవలం ఒక మెదడును అభివృద్ధి చేసుకున్నాడు. ఆలోచనను పెంచుకున్నాడు. ఊహించగలుగుతున్నాడు. మరింత ఉన్నతంగా ఉండాల్సిందిపోయి, కుంచించుకు పోతున్నాడు. స్వార్థపరుడై తన భవితనే విధ్వంసమొనరుస్తున్నాడు. ప్రకృతి పరిరక్షణలోనే మన రక్షణ ఆధారపడి ఉంటుంది. పచ్చనితనం, పూలపరిమళం లేని, ఎడారినేలలో మనిషి మనుగడ సాధించ లేడు. స్త్రీలను పూలతో పోలుస్తాము కదా మనం. ఆ స్త్రీలను మన సమానంగా, గౌరవంగా చూడలేక పోతే మనుష్యులుగా మిగలము. సమానంగా చూడకపోగా, బలహీనురాలుగా భావించి స్త్రీలపై జరుగుతున్న లైంగిక దాడులు, అణచివేతలు పెరిగిపోవడం మానవ జాతికి కళంకంగా మారుతున్నది.

ప్రకృతి విధ్వంసాలతో ప్రళయాలు, ఉపద్రవాలు వెల్లువెత్తినట్లుగానే, సాటి మనుషుల పట్ల అమానవీయ దాడులు సామాజిక ఉపద్రవాలకు దారిస్తాయి. ముఖ్యంగా స్త్రీల పట్ల ఎన్నోతరాలుగా మన మెదళ్లపై ముద్రించిన అసమానతా భావాలను తుడిచివేయాలి. కుల, మత ద్వేషాలతో రగిలిపోయే అమానవీయాంశాలను మట్టుబెట్టాలి.అందరూ సమానమనే సుందర జగతికి సంకల్పం కట్టాలి. పువ్వులంత పరిమళంగా, అంతగా మానవ సమాజం వెల్లివిరియాలి!

సంపాదకీయం

సనాతన మనుధర్మమా? సామాజిక సమధర్మమా?



తెలకపల్లి రవి

పదిరోజులుగా తిరుపతి లడ్డూ చుట్టూనే పరిభ్రమిస్తున్న వివాదం పాలక పార్టీల రాజకీయాల తీరునూ, మోడీ హయాంలో ప్రబలిపోయిన మత రాజకీయాల లోతునూ బహిర్గతం చేశాయి. తిరుపతి కొండపై అనేక రకాల అక్రమాలనూ అందులో భాగంగా ఈ కల్తీ దుమారాన్ని కూలంకషంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి తగుచర్యలు తీసుకోవాలనడంలో సందేహం లేదు. కొండమీద మంట అన్నట్టు ఇలాంటి మతలబులు ఇదే మొదటిసారి కాదు, చివరిసారీ కాకపోవచ్చు. దేశంలోని ఆలయాలన్నిటా ప్రసాదాల కల్తీ జరుగుతూనే వుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్వయంగా వారణాసిలోనే వాక్రుచ్చారు.యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో ప్రస్తుతం ప్రయాగరాజ్‌గా మారిన త్రివేణీ సంగమంలో, ఆలయాల్లో, కాశీమధుర అన్ని చోట్ల అదే పరిస్థితి దాపురించడం వెనక అంతర్జాతీయ కుట్రదాగి వుందని అయోధ్య రామాలయ ప్రధాన పూజారి సత్యేంద్రనాథ్ దాస్ ప్రకటించారు. కాస్త వెనక్కు వెళితే తిరుపతి లడ్డూకోసం కర్నాటక పాల ఉత్పత్తిదార్ల సంఘం(కెఎంఎఫ్) నెయ్యి సరఫరా కాకపోవడం హిందూ వ్యతిరేక చర్య అని ఏడాది కిందటే బీజేపీ ఆ ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై దాడిచేస్తే అది 'మీ హయాంలోనే' జరిగిందని ఆయన ఎదురు వడ్డించారు. కనుక ఈ కథకు ముందూ వెనకా చాలా తతంగం వుంది. చాలాశక్తులూ వున్నాయి. అవి ప్రజలందరూ ఇష్టంగా తినే తియ్యనైన లడ్డూతో సంబంధం లేనివి. కాకపోతే ఈ వివాదం కూడా చినికిచినికి గాలివానగా అదే దారి పట్టడం వల్ల వాటిని ముచ్చటించాల్సి వచ్చింది. ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానమే దీనిపై మూడు పిటిషన్లను రేపు విచారించనుంది గనక పరిష్కారం ఏం చూపిస్తుందో వేచిచూడొచ్చు. ఈలోగా ముఖ్యమంత్రి నియమించిన సిట్ దర్యాప్తు ప్రారంభించింది గనక అదేం తేలుస్తుందో, కోర్టు దానికి ఏమి చెబుతుందో కూడా చూడాలి. ఈలోగా సంయమనం పాటించడం అందరి బాధ్యత.

పరివార్ భాషలో పవన్

కాకపోతే ఈలోగా రాజ్యాంగ పదవిలో వున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేశ భాషణలు ఒక్కసారిగా అందరినీ ఆశ్చర్యపరిచాయి. తెలుగునాట బాధ్యతాయుత పదవిలో వున్న ఒక బీజేపీయేతర నాయకుడి నోట అలాంటి మాటలు వినడం చాలా అరుదు. ఆఖరుకు బీజేపీ... నాయకులు కూడా ఈ విషయంలో అప్ప టికి ఆ విధంగా మాట్లాడలేదు. లౌకిక వాదంపై లౌకికవాదులపై దాడి చేయడానికి పవన్ కల్యాణ్ లడ్డూ వివాదం ఉపయోగించుకోవడం జనసేన అధ్యక్షుడి ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ప్రతివారిలో తొంగిచూసింది. ఈ సందర్భంగా ఆయన ప్రయోగించిన భాష సంఘ్ పరివార్ ఘనాపాటీలను మించిపోయిందంటే అతిశయోక్తి కాదు. హిందువుల మనోభావాలపై దాడి జరిగితే ఎవ్వరికీ కనిపించదని ఆయన ఆక్రోశం వెలిబుచ్చారు.ఇదే మసీదులోనో, చర్చిలోనో జరిగితే ఇలా వుంటారా? అని ఇతర మతాల ప్రార్థనాస్థలాలను పోటీకి తెచ్చారు. ఇతర మతాలపై జరిగితే విమర్శలు కురిపించే లౌకికవాదులు హిందువులపై జరిగితే పట్టించుకోరా? అని ధ్వజమెత్తారు. ఇందులో ఏ ఒక్కదానికి ఆయన ఎలాంటి ఉదాహరణ గానీ, సందర్భంగానీ చూపించింది లేదు. ఎందుకంటే అన్ని రకాల మతోన్మాదాలను వారు విమర్శిస్తూనే వున్నారు. తప్పులు జరిగితేమీ అధికారంతో చర్య తీసుకోండి గానీ మతభాషలో మాట్లాడటమెందుకని హితవు చెప్పిన దాడిచేయడమే అన్నింటికన్నా తీవ్రమైన విషయం. మొదటిది తను సగటు హిందువు కాదు. ఉప ముఖ్యమంత్రి,ప్రముఖ కథానాయకుడు కూడా. సగటు హిందువులు మామూలుగానే తిరుపతి సందర్శించుకుంటున్నారు.ఈ వివాదం రగిలిన మూడు రోజుల్లోనూ రోజుకు మూడు లక్షలపైన లడ్డూలు ఎప్పటిలానే విక్రయమయ్యాయి. కనుక సగటు హిందువు పేరిట ఇతర మతాలను పోటీ పెట్టి మాట్లాడటం రాజ్యాంగ లౌకిక సూత్రాలకే విరుద్ధమైన విషయం. కుల, మత, లింగ తేడాలకు అతీతంగా విధులు నిర్వహిస్తామని వీరంతా ప్రమాణం చేశారు. భారత రాజ్యాంగం కూడా అదే లౌకిక విలువలు బోధిస్తుంది. పీఠికలోనే లౌకిక ప్రజాస్వామిక, సామ్యవాద, సార్వభౌమిక గణతంత్ర రాజ్యంగా పేర్కొంటుంది. దీన్ని అత్యవసర పరిస్థితిలో ఇందిరాగాంధీ చేర్చారని బీజేపీ వారు అంటుంటారు గాని అది రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణమైన చేర్పు మాత్రమే. ఆ మాట సుప్రీం తీర్పులోనే చెప్పింది. దాంతోపాటు అప్పుడే చేర్చిన ప్రజాస్వామిక సార్వభౌమిక అనే మాటలు తీసేస్తారా?

హిందూత్వను మరింతగా రగిలించాలనే ప్రయత్నంలోనే బుల్డోజర్ రాజ్యాలు,హక్కుల అణచివేత, కవులూ, రచయితలు, పాత్రికేయులపై దాడుల వంటివి జరుగుతున్నాయి. తను కూడా సినిమా నేపథ్యం నుంచి వచ్చినా అదే రంగానికి చెందినవారికి హెచ్చరికలు జారీ చేయడం మత పరమైన అసహనానికి నిదర్శనం. ఈసమయంలోనే తమిళనాడు బీజేపీ గవర్నర్ ఆర్ఎన్ రవి లౌకికవాదం (సెక్యులరిజం) పాశ్చాత్య భావన తప్ప భారతీయం కాదని ప్రవచించడం యాదృచ్ఛికం కాదు. లౌకికతత్వం కోసం పోరాటం,ప్రజాస్వామ్య సమరం విడదీయరానివిగా వుంటాయి.తెలంగాణ ముస్లిం రాజ్యం, ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ రాజ్యం అయిపోయాయని గతంలో బండిసంజయ్ ట్వీట్ చేస్తే దాన్ని రీట్వీట్ చేసిన వారు ఇప్పటికైనా కళ్లు తెరిస్తే మంచిది. బీజేపీతో జత కట్టాక ఎలాంటి భావాలు ఆవరిస్తాయో, ఒత్తిళ్లు ఎలా పనిచేస్తాయో అర్థం కావడానికీ ఇదో ఉదాహరణగా వుంటుంది.



సాటినటుడు ప్రకాశ్‌రాజ్‌పై విరుచుకు పడ్డారు. లడ్డూ వివాదంపై ఏమంటారని అడిగితే అది సున్నితమైన విషయం అని దాటేసిన తమిళనటుడు కార్తీకి హెచ్చరికలు జారీచేసి సారీలు చెప్పించారు. తన కొత్త సినిమా ప్రమోషన్ కోసం ప్రయాస పడుతున్న కార్తీ సహజంగానే సారీ చెబుతూనే ఆ సందర్భం తెలియక మీరు ఆగ్రహించారని ముక్తాయిం చారు. ఇక మోడీ దాడినే లెక్కపెట్టని ప్రకాశ్‌రాజ్ అసలు పవన్ విషయాలు తెలుసుకోకుండానే దాడి చేస్తున్నారని వరుస ట్వీట్లతో వెంటాడుతున్నారు.దీన్ని చక్కదిద్దుకోవడం కోసం పవన్ తర్వాత చాలా తంటాలు పడాల్సి వచ్చింది. ఢిల్లీలోని స్నేహితుల కోసం తాను ఇలా మాట్లాతున్నానని ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్య తను అర్థం చేసుకున్నానని కూడా సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. నిజంగానే ఎన్‌డిఎలో భాగస్వాములుగా నితీశ్‌కుమార్ సీతామర్హిలో జానకి జన్మభూమి పిలుపునివ్వడం, చంద్రబాబు లడ్డూ వివాదం తేవడం జరిగాయని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వివరమైన కథనం ప్రచురించింది. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ పోటీ ప్రభావం కూడా వుందని పేర్కొంది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి గనక దాన్ని అడ్డుకోవడానికే ఈ వివాదం రగిలించినట్టు కనిపిస్తుందని 'హిందూ' సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. అంతేగాక పక్కనే మైసూరులో ఎన్‌డిబిబి పరిశోధన శాల వుండగా ఎప్పటిలాగా అక్కడికి పంపకుండా ఎక్కడో వున్న గుజరాత్‌కు ఎందుకు పంపాల్సి వచ్చిందని ప్రశ్నలు కూడా వచ్చాయి. ఘజియాబాద్‌కు ఎందుకు పంపలేదని కూడా హిందూ ప్రశ్నించింది.

లౌకిక వాదంపై లౌకికవాదులపై దాడి చేయడానికి పవన్ కల్యాణ్ లడ్డూ వివా దం ఉపయోగించుకోవడం జనసేన అధ్యక్షుడి ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ప్రతివారిలో తొంగిచూసింది.ఈ సందర్భంగా ఆయన ప్రయోగించిన భాష సంఘ్ పరివార్ ఘనాపాటీలను మించిపోయిందంటే అతిశయోక్తి కాదు. హిందువుల మనోభావాలపై దాడి జరిగితే ఎవ్వరికీ కనిపించదని ఆయన ఆక్రోశం వెలిబుచ్చారు. ఇదే మసీదులోనో, చర్చిలోనో జరిగితే ఇలా వుంటారా? అని ఇతర మతాల ప్రార్థనాస్థలాలను పోటీకి తెచ్చారు. ఇతర మతాలపై జరిగితే విమర్శలు కురిపించే లౌకికవాదులు హిందువులపై జరిగితే పట్టించుకోరా? అని ధ్వజమెత్తారు.ఇందులో ఏ ఒక్కదానికి ఆయన ఎలాంటి ఉదాహరణ గానీ, సందర్భం గానీ చూపించింది లేదు. ఎందుకంటే అన్ని రకాల మతోన్మాదాలను వారు విమర్శిస్తూనే వున్నారు.

సగటు హిందువుగా ఏమిటి?

ఇవన్నీ ఒక ఎత్తుగానీ, తాను సగటు హిందువుగా మాట్లాడుతున్నానని ఉపముఖ్యమంత్రి లౌకిక వాదంపై లౌకికతత్వం అనేది ఒకవైపునే వుండకూడదని, హిందువులకు కూడా వర్తించాలని పదేపదే అనడంలో పవన్ ఉద్దేశమేమిటి? అసలు లౌకికతత్వమంటే రాజకీయాలకు మతానికి సంబంధం లేకుండా వుండటం. లోక సంబంధమైన విషయాలు తప్ప పౌర లౌకిక అంశాల జోలికి పోకూడదని అవి వ్యక్తిగతానికి వదిలేయాలని సారాంశం. దీన్ని మైనార్టీల పట్ల బుజ్జగింపుగా వక్రీకరించింది బీజేపీ, ఆరెస్సెస్ సంఘ్‌పరివార్. పవన్ మరోభాషలో అదే చెబుతున్నారన్నమాట. సచార్ కమిటీ నివేదికతో సహా అనేక అధ్యయనాలు చూస్తే ఆయన వాస్తవాలకు ఎంత దూరంగా వున్నారో తెలుస్తుంది. రకరకాల వివక్షలకు గురవుతున్న వారిలోనూ,అనేక విధాల వెనకబడిన వారిలోనూ మైనార్టీ ముస్లింలు ఎక్కువగా వున్నారు. పైగా భాషా సాంస్కృతిక మైనార్టీలకు ప్రత్యేక రక్షణ కల్పించింది రాజ్యాంగమే.


మైనార్టీ అంటే ముస్లింలు అన్నది సామాన్య భావన తప్ప ఒకోచోట ఒకరు మైనార్టీగా వుండొచ్చు.దేశ సరిహద్దులు దాటితే మైనార్టీలై పోవచ్చు. భారతదేశం ముందునుంచి భిన్న మతాలతో కూడింది తప్ప ఏకమత దేశం కాదు. హిందూ మతం కూడా ఏకశిలా సదృశ్యమైంది కాదు. ఈ ప్రాథమిక వాస్తవాలు తెలియ కుండా పవన్ కల్యాణ్ వంటివారు మతా వేశానికి లోనై అందరిలోనూ అదే రగిలించాలని చూడటం దురదృష్టకరం. హిందూమత భావనకు భిన్నంగా రాజకీయం దట్టించిన హిందూత్వను దామోదర సావర్కార్ ఖచ్చితంగా వందేళ్ల కిందట 1923లో ప్రతిపాదించారని ఆయన తెలుసుకోవాలి. తమలాంటివారు మోడీకి జైకొట్టినా సగటు భారతీయులు దాన్ని ఆమోదించలేదు గనకే మూడోసారి కనీస మెజార్టీ కూడా రాలేదు. హిందూత్వను మరింతగా రగిలించాలనే ప్రయత్నంలోనే బుల్డోజర్ రాజ్యాలు,హక్కుల అణచివేత, కవులూ, రచయితలు, పాత్రికేయులపై దాడుల వంటివి జరుగుతున్నాయి. తను కూడా సినిమా నేపథ్యం నుంచి వచ్చినా అదే రంగానికి చెందినవారికి హెచ్చరికలు జారీ చేయడం మత పరమైన అసహనానికి నిదర్శనం. ఈసమయంలోనే తమిళనాడు బీజేపీ గవర్నర్ ఆర్ఎన్ రవి లౌకికవాదం (సెక్యులరిజం) పాశ్చాత్య భావన తప్ప భారతీయం కాదని ప్రవచించడం యాదృచ్ఛికం కాదు. లౌకికతత్వం కోసం పోరాటం, ప్రజాస్వామ్య సమరం విడదీయరానివిగా వుంటాయి. తెలంగాణ ముస్లిం రాజ్యం, ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ రాజ్యం అయిపోయాయని గతంలో బండిసంజయ్ ట్వీట్ చేస్తే దాన్ని రీట్వీట్ చేసిన వారు ఇప్పటికైనా కళ్లు తెరిస్తే మంచిది. బీజేపీతో జత కట్టాక ఎలాంటి భావాలు ఆవరిస్తాయో, ఒత్తిళ్ల ఎలా పనిచేస్తాయో అర్థం కావడానికీ ఇదో ఉదాహరణగా వుంటుంది.

సనాతనమా, సమధర్మమా?

అలాగే సనాతన ధర్మం కోసం కంకణబద్ధులం కావాలని పవన్ కల్యాణ్ పిఠాపురంలో ఎన్నికల ప్రచారంనాటి నుంచి చెబుతున్నారు. దాన్ని కాపాడటం కోసం జాతీయ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన తాజా పిలుపు! సతీ సహగమనం, కుల వివక్ష, అస్పృశ్యత, పితృస్వామ్య దురహంకారం, ఆధిపత్య కులాల దురహంకారం వంటి అసంఖ్యా జాడ్యాలతో నిండిన సనాతన ఆచారాలను సంస్కరించడానికి సంస్కర్తలు, మహనీయులు ఎంతగానో పోరాడవలసి వచ్చింది. తనే పిఠాపురం పక్కన రాజమండ్రిలోనే కందుకూరి వీరేశలింగం వితంతు పునర్వివాహం కోసం చేసిన కృషి ఆయనను ధ్రువతారగా నిల్పింది.కానీ చేగువేరా బొమ్మతో బయలుదేరి సావర్కార్‌ను భుజానికెత్తుకున్న పవన్ పదేపదే సనాతన మంత్రం జపించడం ఈ సంస్కర్తల విప్లవకారుల స్ఫూర్తికే కళంకం. దేశభక్తి అంటూ నిరంతరం మాట్లాడేవారు 'ఈ దేశమంటే మనుషులోయ్ అనీ, అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్' అనీ తెలుసుకోవాలి. 'వెనకచూసిన కార్యమేమోయ్ మంచి గతమున కొంచెమేనోయ్' అనీ ఆ గురజాడ ప్రబోధించిన పరమసత్యం గ్రహిస్తే అప్పుడు సనాతన మంటూ ఇంకా ఇంకా వెనక్కు చూసే పరిస్థితి వుండదు. కాలం వెనక్కు నడవదు కూడా. వివక్షలకు మారుపేరైన సనాతన ధర్మం స్థానంలో సమధర్మం కోసమే సామాన్యుల పోరాడతారు. మనుధర్మం కన్నా మానవ ధర్మం మిన్న అని నినదిస్తారు. సరళీకరణ ప్రపంచీకరణలో సమిధలవుతున్న సామాన్యులను సమరాలనుంచి దూరం చేసేందుకోసం మత ప్రాతిపదికన విడదీసే ప్రయత్నాలు ఎవరు చేసినా ప్రజలే తిరస్కరిస్తారు. ■

ఇంకా నరబలి?

బడి బాగు కోసం
బాలుని నరబలి
ఇదేమి చదువు?
ఇదేమి జ్ఞానం?
ఇదేమి పాలన?
ప్రధాని మోడీ స్పందించడా?
సి.ఎం. యోగి
సమాధాన మివ్వడా?
హత్రాస్ ఎప్పుడూ
అకృత్యాల అడ్డాగా
మిగిలి పోవడమేనా?
నరబలుల దేశంగా
నవభారత్...?
అయ్యో! అయ్యో! అయ్యో!
ఎంతగా గుండెలు బాదుకున్నా
బాలుడు తిరిగిరాడు.



మూర్ఖత్వం మళ్లీ మళ్లీ
పురుడు పోసుకుంటున్నదే...
పాలకులరా......
కండ్లప్పగించి
చోద్యం చూస్తూ....
జీవశ్చవాల్లా మిగిలిపోండి.
లేదా శవాలను పీక్కుతినే
రాబందుల్లా మారిపోండి.
ఆగ్రహం
బలిచ్చిన వారిపై కాదు
మూర్ఖత్వాన్ని
చోద్యంగా చూస్తున్న
పాలకులపైనే...
స్పందించని
అమానవీయ ఉదాశీనతపైనే

మనమధ్యనే
బలులు కోరుకునే
మానవ మృగాలు
తిరుగుతున్నాయి.
నిద్ర నుండి మేల్కోకపోతే
నిద్రలోనే చంపేస్తాయ్.

- కె. శాంతారావు,
9959745723
(28/9/24 హత్రాస్‌లో పదకొండేండ్ల బాలుడి నరబలి వార్త చదివి)

ప్రాయశ్చిత్తం!

అంతా హడావుడిగా ఉంది. భారీ టెంట్ వేస్తున్నారు. ఎయిర్ కండీషన్లు, మైకులు, పెద్ద కుర్చీలు, మొ॥ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఛోటా, మోటా నాయకులు వచ్చి సూచనలు, సలహాలు చెబుతూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు! ప్రస్తుత రాజకీయ నాయకుడు, గతంలో ఫిల్మ్ హీరో అయిన 'కవర్‌'స్టార్ ఆ టెంట్‌లో దీక్ష చేయబోతున్నాడు! అందుకే ఏర్పాట్లు!

ఎట్టకేలకు టెంట్ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి! అంతా సిద్ధం! అభిమానుల కోలాహలం, కేరింతల మధ్య కవర్‌స్టార్ టెంట్‌లోకి వచ్చాడు. నుదిట వీర తిలకం, కాషాయ వస్త్రాలతో చూడముచ్చటగా ఉన్నాడు. మైకు తీసుకు న్నాడు.'వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ కల్తీ చేయటం ఎంతో అపవిత్రం! అసలు కల్తీ చేయటానికి వారికి మనసెలా వచ్చింది! ఇదేమైనా హోటల్‌లోపెట్టె బిర్యానియా? దేవదేవుడి ప్రసాదం! అంత మహోన్నతమైన ప్రసాదం కల్తీ అయినం దుకు నేను ఈ రోజు ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నాను! మీ అందరికీ నేను ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు కూడా ఇంతకు ముందు ఏదైనా తప్పు చేసి ఉంటే ఆ తప్పును ఇక్కడ చెప్పి, మీరు కూడా ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొని పాప పరిహారం చేసుకోండి" అన్నాడు.

సూటు, బూటూ వేసుకున్న ఒక పెద్దమనిషి వచ్చాడు. "అయ్యా నేను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను నా ఇలాకాలో ఎన్నో ప్రాణావసర మందులు కూడా కల్తీ చేస్తున్నారు! వాటిని నేను చూసీ చూడనట్లు వదిలేస్తున్నాను. దానికి పరిహారంగా నేను కూడా మీతో పాటు ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొంటున్నాను" అంటూ ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్ కవర్‌స్టార్ చేతిలో పెట్టాడు!

"ఇదేమిటి! ఇందులో ఏమైనా కల్తీ అయ్యిందా?" అడిగాడు కవర్‌స్టార్.

"లేదు సార్? ఇదేమీ కల్తీ కాలేదు! మీరు దీక్ష విరమించేటప్పుడు తీసుకోవటానికి తీసుకొచ్చాను?" అన్నాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్.

మరొక పెద్దమనిషి వచ్చాడు "అయ్యా! ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాను. నా పరిధిలోని అనేక స్టార్ హోటల్స్, తినుబండారాలు అమ్మే కార్పోరేట్ కంపెనీలు కల్తీ చేస్తుంటాయి! నేను వాటిని ఏనాడు డిస్ట్రబ్ చేయకుండా నా ఆఫీసులో నేనుంటాను! ఎప్పుడో ఏడాదికోసారి బయటకు వచ్చి తనిఖీ చేస్తుంటాను!" అంటూ టిఫిన్ బాక్స్ కవర్‌స్టార్ చేతిలో పెట్టాడు.

"ఇదేమిటి? నాకే లంచమిస్తావా? " అంటూ బాక్స్ విసిరి కొట్టబోయాడు కవర్‌స్టార్.

"సార్ అది లంచం కాదు సార్! మీరు దీక్ష విరమించిన తర్వాత తినడానికి మా ఇంటి నుండి తెచ్చిన అల్పాహారం! నా భార్య చేసింది. కల్తీ ఎంత మాత్రం లేదు సార్!" అన్నాడు ఫుడ్ ఇన్‌స్పెక్టర్.

"ఆ ముక్క ముందే చెప్పాల! ఆ.." అన్నాడు కవర్‌స్టార్.

మరొకడు వచ్చాడు!


"అయ్యా! నేను ఇప్పటివరకు నలుగురి మహిళలపై అత్యాచారం చేశాను!"... అంటూ ఏదో చెప్పబోయాడు!

"ఆగు.. రేపిస్టులకు ఇక్కడ స్థానం లేదు!" అని కవర్ స్టార్ అంటూండగానే కొందరు పూ భక్తులు ఆ రేపిస్టుకు శాలువా కప్పి, పెద్ద గజమాల వేసి కేరింతలు కొడుతూ, కిందికి తీసుకుని పోయారు!

ఒక పారిశ్రామిక వేత్త వచ్చాడు.

"అయ్యా! నాకు ఆరు పరిశ్రమలు ఉన్నాయి! అందులో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు కూడా ఇవ్వను. ఇరవై వేల మంది కార్మికులు నా వద్ద పనిచేస్తున్నారు. ఏ ఒక్క కార్మిక చట్టమూ నేను అమలు చేయటం లేదు! అందుకుగాను పాప పరిహారం కోసం నేను కూడా మీతో పాటు ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొంటున్నాను"! అంటూ దీక్షలో కూర్చున్నాడు.





రోల్స్‌రాయిస్ కారు దిగి ఒక పెద్దాయన వచ్చాడు. "నేను మన దేశంలోని ప్రముఖ బ్యాంకుల వద్ద డెబ్బయి మూడు వేల కోట్ల రూపాయల అప్పు చేసి పదేండ్లయ్యింది! ఆ అప్పు బ్యాంకులకు తిరిగి చెల్లించ లేదు! అందుకే ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొని పరిహారం చేసుకుందామని వచ్చాను! ఇదిగో ఈ పదివేలు మీకు విరాళం ఇస్తున్నాను"! అంటే చెక్ ఇచ్చాడు.

"అయ్యో రామా! మీరు చెక్ ఇచ్చిన తర్వాత ఇంక ప్రాయశ్చిత్త దీక్ష అవసరమే లేదు! ఎలాగూ మీ బాకీని మొండి కింద జమకట్టి మన పెద్దాయన తప్పక రద్దు చేస్తాడు! నాదీ హామీ! వెళ్లిరండి!" అన్నాడు కవర్‌స్టార్.

రోల్స్ రాయిస్ వెళ్లిపోయింది.

మరో వ్యక్తి వచ్చాడు.

"సార్! మన రెండు రాష్ట్రాల్లో ప్రాజెక్టులు, పెద్ద బిల్డింగ్స్ కట్టే కాంట్రాక్టర్‌ను. ప్రభుత్వాలు మారినా, మా కాంట్రాక్టు పనులు కొనసాగుతూనే ఉంటాయి! రూ. వంద కోట్ల పనిని రెండు వందల కోట్ల పనిగా మార్చి ప్రజాధనాన్ని కొట్టేస్తాము. ఎవరి కమీషన్లు వారికి ముట్టజెబుతుంటాము! అందుకే మా కాంట్రాక్టర్ల అందరి తరపునా ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొనటానికి వచ్చాను! అన్నట్లు మన దీక్ష చేస్తున్న టెంట్ నేనే వేయించాను!" అన్నాడు కాంట్రాక్టర్.

"నీవే టెంట్ వేయించావా? టెంట్ ఉంటదా లేక ఊడిపోతుందా?" ఆందోళనగా అడిగాడు కవర్‌స్టార్.

"ఇది ప్రజల కోసం చేయలేదు! మన కోసం చేసిన పని పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది! ఆందోళన పడకండి సార్! " అన్నాడు కాంట్రాక్టర్.

విభిన్న వ్యక్తులు వచ్చి తమ పాపాలకు, తప్పులకు తగిన రీతిలో ప్రాయశ్చిత్తం చేసుకోవటం చూసిన కవర్‌స్టార్ ఉప్పొంగిపోయాడు. తన ప్రాయశ్చిత్త దీక్ష ఇంతమందిని కదిలించినందుకు ఎంతగానో గర్వపడ్డాడు. తప్పులు, పాపాలు చేసినవాళ్లందరూ ఇదే విధంగా ప్రాయశ్చిత్తం చేసుకునేలా ప్రాయశ్చిత్త చట్టం అసెంబ్లీలో చేయాలని నిర్ణయించుకున్నాడు! ఇదే చట్టం పార్లమెంటులో కుడా చేయమని పెద్దాయనకు సలహా ఇవ్వాలని కూడా అనుకున్నాడు! ఇంత మంచి ఆలోచన వచ్చినందుకు తన భుజం తట్టుకుంటున్న కవర్‌స్టార్‌కి ముగ్గురు తేజోమూర్తులు కనబడ్డారు. తొందర్లోనే వారిని పోల్చుకున్నాడు.

"హేయ్ సుమన్! ఏంటీ మేకప్ తీయలేదు! అన్నమయ్య పార్ట్-2 లో యాక్ట్ చేస్తున్నావా? వీళ్లిద్దరూ భానుప్రియ, శ్రీకన్య కదూ! వీరు కూడా మేకప్‌లోనే ఉన్నారెందుకు? షూటింగ్ లొకేషన్ ఎక్కడా?" అన్నాడు.

"నాయనా! మేము అన్నమయ్య సినిమా షూటింగ్‌లో నుండి రావటం లేదు! నేను నిజమైన వేంకటేశ్వరుడను! వీరిరువు మదీయ పత్నులు పద్మావతీ దేవి, బీబీ నాంచారీ దేవి!" అన్నారు స్వామి వారు!

"నీవు వేంకటేశ్వరుడవా! కాదు! సీనియర్ ఎన్టీఆర్ పోలికలు లేనే లేవు! కాబట్టి నేను నమ్మను!" అంటూ కవర్‌స్టార్ మెడ మీద చేయి వేసి రుద్దుకున్నాడు.

"నాయనా నీవు నమ్మితే ఎంత? నమ్మకుంటే ఎంత? నేను నిజమైన వేంకటేశ్వరుడనే వారిరువురూ నా దేవేరులే. మేము కూడా ప్రాయశ్చిత్తం చేసుకోవటానికి వెళుతున్నాము" అన్నాడు స్వామి వారు.

కవర్ స్టార్ ఆనందానికి అవధుల్లేవ్! తన ధీక్ష సాక్షాత్తూ స్వామివారినే కదిలించింది! తన పవర్ అలాంటిది మరి!" లడ్డూ కల్తీ అయినందుకు స్వామి వారు కూడా దీక్షకు సిద్దం అయ్యారన్న మాట! అనుకుని ఏదో చెప్పబోయాడు.

"నాయనా లడ్డూ కల్తీ అయినందుకు నేను బాధపడటం లేదు! మీ మెదళ్లు కల్తీ అయినందుకు బాధపడి ప్రయాశ్చిత్తం చేసుకోవాలనుకుంటున్నాను. ఈ సకల చరాచర విశ్వంలో నాకు అందరూ సమానమే! దుష్టరక్షణ, శిష్టశిక్షణ చేస్తున్నారు! నా లడ్డూ కల్తీ అయ్యిందని, మీరు పూర్తిగా నిరూపించలేదు. ఒక వేళ కల్తీ అయిన మాట నిజమే అయితే, కల్తీ నెయ్యి సరఫరా చేసిన వారిని ఇంతవరకూ ఎందుకు శిక్షించలేదు! కనీసం కేసు కూడా పెట్టలేదు కదా! అంటే నా లడ్డూ కల్తీ అయ్యిందని మీరు బాధ పడటం లేదు! కల్తీ పేరు చెప్పి నా భక్తులను రెచ్చగొడుతున్నారు! మీ రాజకీయ లబ్ధి కోసం నన్ను వాడుకుంటున్నారు! ఇంతకు ముందు శ్రీరామ చంద్రుని వాడుకుని, కేంద్రంలో ఒక పార్టీ అధికారంలోకి వచ్చింది! ఇప్పుడు రాష్ట్రంలో నన్ను వాడుకుందామని మీరు చూస్తున్నారు! పసిపాప తాగే పాలనుండి అవసాన దశలో ఉన్నవారి గొంతులో పోసే తులసినీరు వరకు సర్వం కల్తీ జరుగుతుంటే మీరు కండ్లు మూసుకుని, లడ్డూ కల్తీ అంటూ అల్లకల్లోలం చేస్తున్నారు! నేనే ఇక్కడి నుండి వెళ్లిపోతున్నాను" అంటూ దేవేరులతో సహా స్వామివారు అంతర్ధానమయ్యారు.

- ఉషాకిరణ్


మాట్లాడుతున్న మంద నరసింహారావు

లాభాల లెక్కలపై సింగరేణి వివరణివ్వాలి

- ఎస్సీఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి సంస్థ 2023-24లో గడించిన లాభాలపై గతంలో మాదిరిగానే కరపత్రం రూపంలో కార్మికులకు తెలియజేయాలని ఎస్సీఈయూ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-2వ గనిలో ఫిట్ కార్యదర్శి ఎ.శంకరన్న అధ్యక్షతన శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థ ఎంత లాభం ఆర్జించిందనేది, గత సంవత్సరం వివరాలు కలిపి తెలపాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా 35 శాతం లాభాల వాటా రావాలని డిమాండ్ చేసిన కార్మిక గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు అధికారంలోకి రాగానే 33 శాతానికి ఒప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పన్నులు పోగా వచ్చిన లాభాల నుంచి వాటా పంచాల్సి ఉండగా.. లాభాల డబ్బుల నుంచి సగం మేర పక్కకు పెట్టి సగాన్ని పంచుతూ 33 శాతం అంటూ గొప్పలు చెప్పుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి లాభాలపై కార్మికుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండే శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తోట నరహరిరావు, బ్రాంచి ఉపాధ్యక్షులు ఎస్‌కె.గౌస్, వంగల రామన్న, పి.శ్రీనివాస రావు, ఎ.శంకరన్న, పి.సమ్మయ్య, బీమా నాయక్, శివ రామరెడ్డి, జంగాపల్లి మల్లేష్, ఈదుల సాగర్, కొండపల్లి కృష్ణ, బొంకూరు సురేష్ తదితరులున్నారు.

హైడ్రా పేరుతో కొరివితో తల గోక్కుంటున్న కాంగ్రెస్

- సీఎం నిర్ణయంతో రోడ్డున పడ్డ పేదలు : కేంద్ర మంత్రి బండి సంజయ్

నవతెలంగాణ-గండిపేట్



హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొరివితో తల గోక్కుంటోందని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో శనివారం ఆయన పర్యటించారు. సరస్వతి విద్యా పీఠం శిశుమందిరంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేండ్లలో జరగని విధ్వంసం ఈ ఎనిమిది నెలల్లో జరిగిందన్నారు. నగరంలో హైడ్రా పేరుతో హిందువులను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ మూసీ ప్రక్షాళన పేరుతో పేదలకు అన్యాయం చేయడం దారుణమని తెలిపారు. గతంలో ఒకాయన ఇలాగే చేస్తే ఇప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని, రేవంత్‌రెడ్డికి కూడా అదే గతి పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్పారు. రాష్ట్రం మరో శ్రీలంక కాబోతుందన్నారు.

షాద్‌నగర్‌లో మహిళ దారుణ హత్య

- దస్ట్‌కవర్‌లో చుట్టి ఇండ్ల మధ్య పడేసిన దుండగులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ రంగస్వామి



నవతెలంగాణ-షాద్‌నగర్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో దారుణం చోటుచేసుకుంది. గుర్తు తెలియని మహిళను దుండగులు హత్యచేసి శవాన్ని డస్ట్ కవర్‌లో చుట్టి ఇండ్ల మధ్య పడేసిన ఘటన షాద్‌నగర్ పట్టణం ఫరూఖ్‌నగర్ శ్రీనివాస కాలనీలో శనివారం జరిగింది. ఏసీపీ రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కోర్టుకి కొద్ది దూరంలో ఇండ్ల మధ్యలో ఒక ప్లాస్టిక్ కవర్‌లో బ్లాంకెట్‌లో చుట్టి శవాన్ని పడేశారు. శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఏసీపీ రంగస్వామి, పోలీసులు చేరుకుని పరిశీలించారు. సుమారు 35 నుంచి 45 సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని మహిళను ఎక్కడో చంపేసి ఇక్కడ పడేసినట్టు ఏసీపీ అనుమానం వ్యక్తం చేశారు. మహిళ రెండు చెవులు కత్తిరించి, చెవి కమ్మలు తీసివేసిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. స్థానిక సీఐ ఈ కేసు దర్యాప్తు చేస్తారని ఏసీపీ పేర్కొన్నారు. మహిళ ఒంటిపై పసుపు రంగు దుస్తులు ఉన్నాయని అన్నారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు శంషాబాద్ డీసీపీ రాజేష్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరుగుతోందని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చాక మరిన్ని విషయాలు తెలుస్తాయని ఏసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ఏసీపీతో పాటు సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ శరత్‌కుమార్ ఉన్నారు.

చౌటుప్పల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రయివేట్ ట్రావెల్ బస్, కంటైనర్ లారీ ఢీ.. ఇద్దరు మృతి
- 9 మందికి తీవ్రగాయాలు, హైదరాబాద్‌కు తరలింపు



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామం వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65పై శ్రీ కృష్ణ ప్రోమో ట్రావెల్స్ బస్సును కంటైనర్ లారీ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 9మందికి తీవ్ర గాయాలయ్యాయి. చౌటుప్పల్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి మియాపూర్ వెళ్తున్న శ్రీకృష్ణ ప్రయివేట్ ట్రావెల్ బస్సును శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామం వద్ద వెనక నుంచి వచ్చిన కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో 9 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతిచెందిన వారిలో.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మడంపల్లి గ్రామానికి చెందిన యజ్జు రవీందర్(24), హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన పాల సతీష్‌కుమార్‌రెడ్డి(46) ఉన్నారు. దుగ్గినాగిరెడ్డి, గౌరాజు శ్రీనివాస్, బండారవి, తుమ్మలపల్లి ఈదయ్య మామిండ్ల వెంకట రమేశ్, దుగ్యారు సాయికృష్ణ, భీంరెడ్డి సునీత, కర్రి కిరణ్, గుడ్డు రహమత్అలీలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పునరావాసం తర్వాతే మూసీ సుందరీకరణ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే మూసీ సుందరీకరణ చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై శనివారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ నాలాకు ఇరువైపులా 50 మీటర్ల దూరం వరకు ఉన్న ఇండ్లను కూల్చేస్తామంటూ ప్రభుత్వం నోటీసులిచ్చిందనీ, దీంతో నివాసితులు తమ భవిష్యత్ గురించి ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

మరి కొందరు హార్ట్ ఎటాక్‌తో ఆస్పత్రి పాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదంతా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్లాన్ అనీ, దాన్నే మేము అమలు చేస్తున్నామంటూ రేవంత్ సర్కార్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగానే చెరువులు, మూసీ ఇరువైపులా స్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారన్నారని విమర్శించారు. వీటిని పేద, మధ్య తరగతి ప్రజలు కొన్నారనీ, వారి ఇండ్లను ప్రభుత్వం కూల్చేయటానికి పూనుకోవటం అన్యాయమన్నారు. పేదలకు పక్కా ఇండ్లు కట్టించి, వారికి పని కల్పించిన తర్వాతే మూసీ నది సుందరీకరణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. లేదంటే ప్రజలను ఐక్యం చేసి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.కోటయ్య, కమిటీ సభ్యులు అబ్దుల్ సత్తార్, జంగయ్య, పద్మానగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు కె.నర్సింహ చారి, రాజు, సురేష్, గోవింద్‌తో పాటు మూసీ ఇరువైపులా ఉన్న కుటుంబాల ప్రజలు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్ త్వరగా పూర్తి చేయండి

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌కు అభ్యర్థుల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్ త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీఈటీ పోస్టుల రిక్రూట్మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలంటూ మహేష్‌కుమార్‌కు పీఈటీ అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో పీఈటీ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చిందనీ, ఆ ప్రభుత్వ పదవికాలం పూర్తి అయ్యేంత వరకు కూడా ఫలితాలను విడుదల చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫలితాలను ప్రకటించిందనీ, మెరిట్ లిస్టును కూడా తయారు చేసిందని చెప్పారు. మెరిట్ సంపాదించలేని వారు కోర్టులకు వెళ్లి అక్రమంగా రిక్రూట్మెంట్‌ను ఆపాలని ప్రయత్నం చేస్తున్నారనీ, వెంటనే ప్రభుత్వం ఈ రిక్రూట్మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దసరా పండుగ లోపు వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పంట పొలాలపై కార్పొరేట్ల ఆధిపత్యమా?

- కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలపై సమరశీల పోరాటాలు : భగత్‌సింగ్ జయంతి సభలో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకుల పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పంట పొలాలపై కార్పొరేట్ల ఆధిపత్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. డిజిటలైజేషన్ పేరుతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్నదని విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తన ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటానికి డాక్టర్ అరిబండి ప్రసాదరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, ప్రభులింగం, బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ రైతుల్లో అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని, కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన మూడు వ్యవసాయ చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శిం చారు. ఈనెల 2న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డీఏఎం)కు అధిక ప్రాధాన్య తనిస్తూ ఏడు కొత్త పథకాలను కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని తెలిపారు. అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారుల డిమాండ్లకనుగుణంగా భారత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసేందుకే ఈ ప్రాజెక్టు చేపట్టారని విమర్శించారు. బహుళ జాతి సంస్థలతో భారత వ్యవసాయ పరి శోధనా మండలి (ఐసీఏఆర్) ఒప్పందాలు చేసుకోవడంతో ఆ సంస్థలు పెద్ద ఎత్తున దేశంలోనికి ప్రవేశిస్తాయని చెప్పారు. దేశవ్యాప్తంగా రైతులందరూ ఐక్యతతో కార్మికులను, ఇతర ప్రజలను కలుపుకుని ఈ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు బొప్పని పద్మ, స్కైలాబ్ బాబు, వజ్రాల అరుణ, ఆంజనేయులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

'నేను చేస్తున్నది తప్పే అయినా.. బతకాలని లేదు'


- తన చావుకు ఆర్థిక సమస్యలు కారణం కాదు
- కానిస్టేబుల్ సూసైడ్ నోట్ కలకలం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి


ఫైల్

'అమ్మానాన్న నేను చేస్తున్నది తప్పే.. కానీ బతకాలని లేదు. జీవితంపై విరక్తి చెందాను. అక్క పిల్లలను మంచిగా చూసుకోండి. నా చావుకు ఆర్థిక సమస్యలు, ప్రేమ వ్యవహారాలు కారణాలు కాదు. ఇప్పటికే ఆత్మహత్య చేసుకొని చులకనయ్యాను. దయచేసి నేను చనిపోయిన తర్వాత లేనిపోని నిందలు వేయకండి.' అంటూ ఓ కానిస్టేబుల్ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల గ్రామానికి చెందిన దూసరి బాలకృష్ణ(28) రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీకి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున తన తుపాకితో బాత్‌రూమ్‌లో కాల్చుకొని చనిపోయాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని లేఖ రాసి బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కానిస్టేబుల్ తండ్రి దూసరి సత్తయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే క్రైమ్ డీసీపీ కరుణాకర్, ఎస్బీ డీసీపీ ఘటనా స్థలానికి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాలకృష్ణ గతంలో ఓసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాగా, కానిస్టేబుల్ బాలకృష్ణ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో స్వగ్రామం మంచాలలో జరిగాయి. అంత్యక్రియల్లో గ్రామస్తులు, స్నేహితులు, పోలీసులు సిబ్బంది భారీగా పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు చివరి వరకు అక్కడే ఉన్నారు. అయితే కానిస్టేబుల్ సూసైడ్ నోట్‌పై గ్రామంలో చర్చలు సాగుతున్నాయి గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తూనే అప్పుల పాలైనట్టు పలువురు చర్చించుకున్నారు. బాలకృష్ణ మరణంతో మళ్లీ ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవహారం తెరమీదికి వచ్చింది.

అమ్మా నిందలు భరించలేక చనిపోతున్నా.. అంటూ సూసైడ్ నోట్



'అమ్మానాన్న నేను చేస్తున్నది తప్పే.. కానీ నాకు బతకాలని లేదు. జీవితం రోజు ఒక నరకంలా ఉందని, ఆత్మహత్య చేసుకోవద్దని ఎంత కంట్రోల్ చేసుకున్నా నా వల్ల కావడం లేదు. జీవితంలో ఏదో కోల్పోతున్నాననే బాధ నాలో ఉంది. మిమ్మల్ని బాగా చూసుకోలేకపోతానేమో అనుకుంటున్నా. జీవితంలో ఫస్ట్ టైం ఆత్మహత్యాయత్నం చేసి తప్పు చేశాను. దాని వల్ల నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో, గ్రామంలో నా మీద లేనిపోని నిందలు వేస్తున్నారు. ఆ నిందలు ఇప్పటికీ భరించలేకపోతున్నాను. నాకు జీవితం మీద విరక్తి పుట్టింది. అందుకే చనిపోదాం అనుకున్న. నా చావుకు నేనే కారణం. నాకు ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వంటివి లేవు. దయచేసి నేను చనిపోయిన తర్వాత నా మీద లేని పోనీ నిందలు వేయొద్దు' అని కానిస్టేబుల్ సుసైడ్ నోట్ రాశాడు. ఇది చదివిన గ్రామస్తులు, స్నేహితులు శోక సంద్రంలో మునిగిపోయారు.

వెండి తెర కీర్తి పతాకం పైడి జైరాజ్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెండి తెర తెలంగాణ కీర్తి పతాకం పైడి జైరాజ్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. 115వ జయంతి సందర్భంగా ఆయన జీవితంపై సీనియర్ జర్నలిస్టు పొన్నం రవిచంద్ర రాసిన "ద ఫస్ట్ యాక్షన్ హీరో" పుస్తకాన్ని సచివాలయంలో సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాల్లో నటించాలనే తన కలను సాధించడం కోసం ఎన్నో కష్టాలను గెలిచిన జైరాజ్ జీవితం వ్యక్తిత్వ వికాస పాఠమనీ అన్నారు. తెలుగు సినీరంగంలో ఎదుగుదామనుకునే యువ దర్శకులు, నటులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. పుస్తక రచయిత మాట్లాడుతూ మూకీ సినిమాల కాలంలోనే తెలంగాణ ప్రాంతం నుంచి ముంబైకి వెళ్లి ఆనాటి శాంతారామ్, అశోక్ కుమార్ వంటి గొప్ప నటుల సరసన నటించారని పేర్కొన్నారు. 130కిపైగా సినిమాల్లో నటించిన జైరాజ్ 1980లోనే దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని పొందారని అన్నారు. హిందీ చలన చిత్ర పరిశ్రమను కొన్ని దశాబ్దాల పాటు శాసించిన ఆయన పేరిట తెలంగాణ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని ఈసందర్భంగా వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై కలం యుద్ధం

- జయంతి వేడుకలో వక్తలు
- ఎస్వీకే వద్ద గుర్రం జాషువా చిత్రపటానికి నేతల నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేల సంవత్సరాలుగా వేళ్లూనుకుని ఉన్న సామాజిక అంతరాలపై కలం యుద్ధం చేసిన విప్లవ కవి గుర్రం జాషువా నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదరికం, అంటరానితనం ఆయన జీవితంలో అనేక పాఠాలను నేర్పించాయని అన్నారు. ఆ రెండింటినీ ఏకకాలంలో రూపుమాపడం ద్వారా దేశంలో సామాజిక అంతరాలను తొలగించాలని భావించారని చెప్పారు. గబ్బిలం, పిరదౌసి వంటి కావ్యాలు తెలుగు రాష్ట్రాలను ప్రభావితం చేశాయని వివరించారు. గబ్బిలం లండన్ మ్యూజియంలో ఉంచారనీ, ఆయన సాహిత్య చరిత్ర చాలా ఉన్నతమైందని కొనియాడారు. కులమతాలు గీసుకున్న ఈ బందీ ఖానాలో తాను నిలబడనంటూ విశ్వ నరుడునని ప్రకటించాడని గుర్తు చేశారు. నేటికీ కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం ఇది ఒక సామాజిక రుగ్మతగా నిలుస్తుందన్నారు. దాన్ని పారద్రోలే బాధ్యత ప్రభుత్వంతోపాటు పౌర సమాజంపై ఉందన్నారు. రాచరికపు వ్యవస్థ మతోన్మాద పద్ధతులు కుల అసమానతలు వంటి దురాచారాలపై ఆయన కవిత్వం ద్వారా ప్రతిఘటించాడని అన్నారు. సమాజంలో వైవిధ్యాలను అంతరాలను చూపిన సామాజిక విప్లవ కవి జాషువా అని చెప్పారు. సాహిత్యం కలలు సామాజిక మార్పులకు దోహదం చేస్తాయన్నారు. ఆయన స్ఫూర్తితో కుల, మత వైషమ్యాలకు వ్యతిరేకంగా సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర కోశాధికారి అనంతోజు మోహన కృష్ణ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, చెన్నారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం

- 7, 8 తేదీల్లో దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల సమావేశం
- నవంబర్ 26న నిరసనలు : ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి టి. సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే మార్గమని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శి టి. సాగర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడి విజయం సాధించారని గుర్తు చేశారు. ఆ ఉద్యమం కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిందన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో 750 మంది రైతులు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి త్యాగాలు వృథా కాలేదన్నారు. నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26, 2020న దేశవ్యాప్తంగా ఢిల్లీలో రైతాంగ ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. ఆ ఉద్యమ ప్రారంభ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. శనివారం ఏపీలోని ద్వారకా తిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటాలు సాగాయన్నారు. తద్వారా పంటలకు మద్దతు ధరలు, పంట రుణాలు, నష్టపరిహారాల కోసం రైతాంగ ఉద్యమాలు నడిచాయనీ, ఆ ఉద్యమాలకు ఏఐకేఎస్ నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. అక్టోబర్ 7,8తేదీల్లో బెంగళూరులో దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల సమావేశం జరుగుతున్నదని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో రైతులు ఉద్యమాలను చేస్తున్న విధంగా దక్షిణాది రాష్ట్రాల్లో రైతు ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపకల్పన చేయనున్నారని తెలిపారు. ఈనెల 30న కర్నాటకలోని కల్బుర్గిలో అఖిలభారత చెరకు రైతుల సమావేశం జరుగుతున్నదని చెప్పారు. కేరళ తరహాలో కేంద్ర ప్రభుత్వ రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దని సూచించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జొన్నా శివ శంకరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.మోహనరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కీచక ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

- వికృత చేష్టలు భరించలేక తల్లిదండ్రులకు ఫిర్యాదు
- కోపోద్రిక్తులై ఫర్నీచర్ ధ్వంసం
- పరారైన హెచ్ఎం
- ఎంఈఓతో సహా ఉపాధ్యాయ బృందం గదిలో నిర్బంధం
- పాలడుగు ప్రభుత్వ పాఠశాలలో ఘటన



నవతెలంగాణ-వైరా

సామాజిక విలువలను నేర్పవలసిన ఉపాధ్యాయులే వికృత చేష్టలకు పాల్పడుతుంటే విద్యార్థినుల భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న ఉద్భవిస్తుంది. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఏడాది కాలంగా సాగుతున్న కీచక చేష్టలను భరించలేని విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దాంతో శనివారం తల్లిదండ్రులు మూకుమ్మడిగా పాఠశాలకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు చేరుకోక ముందే తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కీచక ప్రధానోపాధ్యాయుడు వస్తే దేహశుద్ధి తప్పదని భావించిన ఉపాధ్యాయ బృందంలో ఒకరు ఆయనకు కబురందించడంతో స్కూల్‌కు రాకుండా పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాలడుగు పాఠశాలకు చేరుకోగా.. ఆవేశంలో ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓను కూడా తరగతి గదిలో బంధించి తాళం వేశారు. కీచక ప్రధానోపాధ్యాయుడిని రప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వైరా సీఐ సాగర్.. పాలడుగు చేరుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్తులను శాంతింపజేసి, గదిలో నిర్బంధించిన ఎంఈఓ, ఉపాధ్యాయులను విడిపించారు. ఈ విషయాన్ని డీఈఓ సోమశేఖర్ శర్మకు తెలపడంతో.. ఆయన పాఠశాలకు వచ్చి.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావుపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దాంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన విరమించారు. అతనిపై చర్యలు తీసుకొని యెడల తమ ఆందోళన తీవ్ర రూపాన్ని చూడాల్సి వస్తుందని తల్లిదండ్రులు హెచ్చరించారు.

అద్దెభవనాలు...అరకొర ఆహారం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిందని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు.

అరకొర వసతులతో అద్దె భవనాల్లో గురుకులాలు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల పనివేళలను విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా శాస్త్రీయంగా నిర్ణయించాలన్నారు. 2016-17 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన 700కుపైగా గురుకులాలు ఇంకా అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో ఉన్నాయన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా గురుకుల విద్యాసంస్థల్లో మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేండ్లుగా మెస్ చార్జీలు పెంచకపోతే నాణ్యమైన భోజనాన్ని ఎలా అందిస్తారని ప్రశ్నించారు. గతేడాది 25శాతం పెంచుతున్నట్టు ప్రకటించినప్పటికీ జీవో ఇవ్వలేదని చెప్పారు. ఇప్పుడున్న మెస్ చార్జీలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడంలేదన్నారు. ఇటీవల ఇచ్చిన కామన్ టైంటేబుల్ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ఉన్నదని చెప్పారు. శాస్త్రీయంగా లేకపోగా విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి కలిగిస్తున్నదన్నారు. పలు అనారోగ్య సమస్యలకు కారణమౌతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా ఒకటో తారీఖున్నే వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. తమ కుటుంబాలకు సమయం ఇవ్వకుండా 24 గంటలూ విధుల్లో ఉంటున్న సిబ్బందికి శ్రమకు తగిన వేతనాలుకూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి కోర్కెలు గొంతెమ్మ కోర్కెలేమీ కావనీ, వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు.

ఉపాధ్యాయులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

గురుకుల ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు రవిచందర్ మాట్లాడుతూ గురుకులాల్లో సమస్యలతో సతమతమౌతూనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, జేఏసీ సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఎ మధుసూదన్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులెదుర్కొం టున్నపలు సమస్యలను పరిష్కరించాలని ఆరేండ్లుగా ఉపాధ్యాయ సంఘాలు విడివిడిగా పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ఆందోళనలు చేసినా పరిష్కరించలేదని చెప్పారు.

కనీసం చర్చలు జరిపి మౌలికమైన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం కూడా చేయలేదని తెలిపారు. అన్ని సంఘాలు కలిసి ఐక్యంగా పోరాడితే ఫలితం ఉంటుందని భావించి జెండాలకు అతీతంగా గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంయుక్తంగా పోరాడాలని టీఎస్ యూటీఎఫ్, గురుకుల సంఘాల జేఏసీలు నిర్ణయించా యని గుర్తు చేశారు. ఆ మేరకు మూడు దశల పోరాటాన్ని నిర్వహించామన్నా రు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతమైన పోరాటాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, టీఎస్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, రాజ్యసభ మాజీ సభ్యులు ఆర్ కృష్ణయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు, ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రజనీకాంత్, బీసీ నాయకులు వెంకటేశ్, జనార్ధన్ రెడ్డి, కాశీనాథ్ మాట్లాడారు. టీఎస్ యుటీఎఫ్, గురుకుల సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, కె సంజీవ, డాక్టర్ ఎ అజయ్ కుమార్, డి ఎల్లయ్య, ఎస్ శ్యామ్ కుమార్, పి నరసింహులు, శారద, మాణిక్ రెడ్డి, జి రాంబాబు, జి లివిన్ స్టన్, బి సురేంద్ర, ఎం మహేశ్, హరీందర్ రెడ్డి, కె దామోదర్, శంకర్, డాక్టర్ సత్యం, వేదాంతాచారి, నరసింహులు గౌడ్, గణేష్, నరేందర్ రెడ్డి, సుబ్బారావు, శశిధర్, ముత్తయ్య, అనీసా, భరత్, వి దామోదర్ పాల్గొన్నారు.

కూల్చక తప్పదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సిందేనని మూసీ అభివృద్ధి ప్రాజెక్టు ఎమ్‌డీ దానకిషోర్ స్పష్టం చేశారు. ఆయా నిర్వాసితులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల విలువైన ఇండ్లను ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇదే సమయంలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఇండ్లను కూల్చటం లేదని, ఎవర్నీ బలవంతంగా బయటకు పంపటం లేదని వెల్లడించారు. మూసీ నది పరిసరాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. 2026 జూన్ లోపు మూసీలో మంచినీళ్లు ప్రవహించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ నదిలోకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామనిఅన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో హైడ్రా కమిషనర్ ఏ.వీ.రంగనాథ్‌తో కలిసి దానకిశోర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మూసీపై మీడియాలో వచ్చిన వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగించాయని అన్నారు. నిజాం హయాంలో హైదరాబాద్‌కు భారీ వరదలు వచ్చాయనీ, అప్పట్లో ప్రజలకు ఎంత ఇబ్బంది కలిగిందో గుర్తు చేసుకోవాలని సూచించారు. ఐదేండ్ల నుంచి మన రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. వీటి వల్ల మూసీ పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాల నుంచి హైదరాబాద్ ప్రజలను కాపాడుకునేందుకే మూసీ రీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టామని దాన కిశోర్ తెలిపారు. అక్టోబర్‌లో దక్షిణ కొరియాకు వెళ్తున్నామనీ, ఆ పర్యటనకు మూసీ పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలు, హైదరాబాద్ మేయర్, కార్పొరేటర్లను తీసుకుపోతామని చెప్పారు. మూసీ నీళ్లను శుద్ధి చేసేందుకు ఎస్టీపీలను నిర్మిస్తున్నామని తెలిపారు. మూసీ రీ-డెవలప్‌మెంట్‌కు ఇంటర్ నేషనల్ ఏజెన్సీలు వస్తున్నాయని వివరించారు. తొలి దశలో రూ.10 వేల కోట్లతో వచ్చే జూన్, జులై నెలలో మూసీ నీటిని శుద్ధి చేస్తామన్నారు. అందుకు సంబంధించి త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. హైడ్రా వస్తోంది, కూలగొడుతోందంటూ దుష్ప్రచారం చేయటం తగదని హితవు పలికారు. ఇప్పటి వరకు మూసీ పరివాహక ప్రాంతంలో 50 కుటుంబాలు తమ ఇష్టం మేరకే షిఫ్ట్ అయ్యాయని వివరించారు. మరో 200 కుటుంబాలు షిఫ్ట్ అయ్యేందుకు ముందుకు వచ్చాయన్నారు. మూసీ నిర్వాసితులతో సామరస్యంగా మాట్లాడి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వారిని తరలిస్తున్నామని చెప్పారు. నిర్వాసితుల్లో దాదాపు 90 శాతం మంది ఖాళీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితుల్లో ఎవరికైనా పట్టాలు ఉంటే రెట్టింపు ధర ఇస్తున్నట్టు తెలిపారు. బఫర్ జోన్‌లో ఉండి పట్టా భూమి ఉంటే తప్పకుండా రెట్టింపు ధర చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రంగనాథ్ మాట్లాడుతూ హైడ్రా బాధితుల ఆందోళనల వెనుక పెద్దల హస్తముందని ఆరోపించారు. హైడ్రాకు కూల్చివేతలే లక్ష్యం కాదనీ, ప్రజలకు అది ఒక భరోసా అని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాపై ఉందని ఆయన స్పష్టం చేశారు. దీనిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని వాపోయారు. ఇది సరికాదని హెచ్చరించారు. హైడ్రాను ఒక బూచిగా చూపించి బుచ్చమ్మ అనే మహిళను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఆమె ఆత్మహత్యకు, హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేదవాళ్ళను ఇబ్బందులు పెట్టే పనులను హైడ్రా ఎప్పటికీ చేయబోదని హామీనిచ్చారు. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న భవనాలను మాత్రమే హైడ్రా కూల్చివేసిందని తెలిపారు. కొన్ని కట్టడాలను కూల్చితే హైడ్రా బాగా పని చేస్తుందని కితాబిచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే సీఎం రేవంత్ దాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. ఎన్- కన్వెన్షన్ ను కూల్చేశామనీ, దాని పక్కనున్న గుడిసెల జోలికి మాత్రం వెళ్లలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజలు నివసిస్తున్న భవనాలను కూల్చలేదని స్పష్టం చేశారు. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులోని ఆక్రమణల ను, అక్రమ కట్టడాలను కూల్చేశామని తెలిపారు. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయలేదనీ, ఈ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించి అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేశామని తెలిపారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. ఆ ప్రాంతంలో మూడుసార్లు హెచ్చరించినప్పటికీ తిరిగి నిర్మాణాలను చేపట్టారని తెలిపారు. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తామన్న ధీమాతో కొందరు బడా వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని అన్నారు. అర్హతలేని వాళ్లు ఇచ్చే పర్మిషన్ రిజిస్ట్రర్ అయినా అది అక్రమమేనని అన్నారు. అలాంటి అనుమతులు ఇచ్చిన వాళ్లు ఇప్పటికే సస్పెండయ్యారని గుర్తు చేశారు. అలాంటి రిజిస్ట్రేషన్లు కూడా రద్దయ్యాయని తెలిపారు. బ్యాంకు అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండా లోన్లు ఇచ్చారనీ, అక్రమార్కులను ఇలాగే వదిలేస్తే సిటీలో కోటి మంది మునిగే ముప్పుం దని రంగనాథ్ ఈ సందర్భంగా హెచ్చరించారు. రోజుకు రూ.లక్ష బిజినెస్ చేసే వ్యక్తి బాధితుడిలా చెప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. హైడ్రా బాధితులు పేదలు కారనీ, అక్రమాలు చేసిన వాళ్లు మాత్రమే దాని బాధితులుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. సరైన అనుమతులు ఉంటే తాము టచ్ కూడా చేయలేదని వివరించారు. నోటీసులు ఇచ్చినా కూడా లైట్ తీసుకుని, కూల్చాక ఇవ్వలేదంటున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కాలేజీలు బఫర్ జోన్‌లో ఉన్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. విద్యార్థుల అకడమిక్ సంవత్సరానికి నష్టం కలుగుతుందనే ఆలోచనలో తామిప్పుడు ఉన్నామనీ, అందువల్ల ఆయా అక్రమ విద్యా సంస్థల భవనాలను వేసవిలో కూల్చివేస్తామని ఆయన వెల్లడించారు. పేదల పట్ల ఒకలా, పెద్దల పట్ల మరోలా హైడ్రా వ్యవహరించబోదని రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమంగా నిర్మిం చిన పెద్దవాళ్ళే ప్రథమ టార్గెట్‌గా హైడ్రా చర్యలు చేపడుతోందని హెచ్చరించారు.

మోడీ గుత్తాధిపత్యం ఉద్యోగాలను హరిస్తోంది

- రాహుల్ మండిపాటు



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ గుత్తాధిపత్య నమూనా ఉద్యోగాలను హరిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను ధ్వంసం చేసి ప్రజలకు ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని మోడీపై మండిపడ్డారు. జీఎస్టీని సరళతరం చేయాలని, బ్యాంకులు చిన్న చిన్న వ్యాపారులకు ఆర్థిక సాయం అందించి తద్వారా వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు, ఉద్యోగాలు కల్పించేం దుకు చేయూత అందించాలని డిమాండ్ చేశారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల ప్రచారం సందర్భంగా యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో నిరాశానిస్పృహలు చూశానని, దేశంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు పడుతున్న ఇబ్బందులకు ఇది అద్దం పడుతోందని చెప్పారు. జమ్మూలో కొద్ది రోజుల క్రితం ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ (ఏఐపీసీ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో జరిపిన చర్చల వీడియోను రాహుల్ ఈ సందర్భంగా షేర్ చేశారు. 'జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు వంటి అసమర్థ విధానాల ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం దాడి చేస్తోంది. దేశాన్ని ఉత్పత్తి చేసే ఆర్థిక వ్యవస్థ నుండి వినియోగించే ఆర్థిక వ్యవస్థగా మార్చేస్తోంది. ఈ వృద్ధి రేటుతో మనం చైనాతో పోటీ పడలేము. దేశ ప్రజలందరికీ సౌభాగ్యాన్ని అందించలేము' అని రాహుల్ చెప్పారు. గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఐదు పది మంది నుండి చిన్న, మధ్య తరహా వ్యాపారులు తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అంబేద్కర్ వర్సిటీ భూకేటాయింపును విరమించుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి మేధావులు, విద్యావంతుల లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ (బీఆర్ఏఓయూ) ప్రాంగణంలో పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ)కు కేటాయించడాన్ని విరమించుకోవాలని మేధావులు, విద్యావంతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం తెలంగాణ మేధావులు, విద్యావంతులు 61 మంది లేఖ రాశారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు, దాని ఆవశ్యకత, పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు ఈ విశ్వవిద్యాలయం ఏ విధంగా ఉపయోగపడుతున్నదో, సేవలు అందిస్తున్నదో వివరించారు. ఉన్నత విద్యా వ్యాప్తికి విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని సీఎం దృష్టికి తెచ్చారు. లేఖ రాసిన వారిలో మాజీ వీసీలు వీఎస్ ప్రసాద్, కె సీతారామారావు, రాంచంద్రం, వాయునందన్, వి వెంకయ్య, టీజీపీఎస్సీ మాజీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ కోదండరాం, హరగోపాల్, కె నాగేశ్వర్, దొంతి నరసింహారెడ్డి, పద్మజాషాలతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ , హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు యూనివర్సిటీ, సీఫెల్ , కాకతీయ, మౌలానా ఉర్దూ యూనివర్సిటీలతోపాటు పలు విద్యాసంస్థల ప్రొఫెసర్లు ఉన్నారు. ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలనీ, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని పేర్కొన్నారు.

పట్టభద్రులు నిజాయితీ, విలువలకు సామాజిక సారథులు

- దేశ ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని పట్టభద్రులు గుర్తుంచుకోవాలి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- నల్సార్ స్నాతకోత్సవంలో పట్టాలందజేత



నవతెలంగాణ-శామీర్ పేట

స్నాతకులు నిజాయితీ, విలువలకు సామాజిక సారథులుగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 21వ వార్షిక స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరయ్యారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ లా యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంతో రాష్ట్రపతి మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో చట్టాల రూపకల్పనలో నల్సార్ కృషిని ప్రశంసించారు. ప్రధానంగా నల్సార్ జంతు సంరక్షణ చట్టాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఒడిశా ప్రభుత్వంలో తాను.. మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. జంతువుల రక్షణ, సంక్షేమం గురించి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ జంతు సంరక్షణ చట్టాల అవగాహన అత్యవసరమని తెలిపారు. దేశ రాజ్యాంగ విలువల్లో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులకు ఆమె సూచించారు. నిజాయితీ, ధైర్యం విలువలకు కట్టుబడి సానుకూల సామాజిక మార్పులకు సారథులుగా నూతన స్నాతకులు ఉండాలని కోరారు. బంగారు పతకాల విజేతల్లో విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనేక ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థినులు మంచి ప్రతిభను చూపుతున్నారని అన్నారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ ఆడపిల్లలు తమ ఉన్నత ప్రదర్శనతో వారి తల్లిదండ్రులు గర్వపడేలా చేస్తున్నారని చెప్పారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నెట్‌వర్క్ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి ఎంతో పని చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వీసీ ప్రొ.కృష్ణదేవరావు మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల చట్టాలు, బాలల హక్కులు, ఖైదీల హక్కులు, సంస్కరణల రంగాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నల్సార్ సాధించిన విజయాల గురించి వివరించారు. విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహాయం అందించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్విభాగ అధ్యయనాలు చేయడం ఆధునిక విద్యారంగంలో చాలా ప్రధానమని, నల్సార్ బోధనా, అభ్యసన పరిశోధన కార్యక్రమాన్ని విస్తరించడానికి, అలాగే యూనివర్సిటీ విద్యా విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు. నల్సార్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే, గౌరవ అతిథి, జస్టిస్ పీ.ఎస్. నరసింహ, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి పట్టభద్రులైన విద్యార్థులకు పతకాలు అందజేశారు. మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు. వాటిలో 8 పీహెచ్‌డీలు, లా, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో వరుసగా 68, 48 మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి. 115, 28 బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ లా, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్లలో ప్రదానం చేశాక ఆనందోత్సహాలతో స్నాతకోత్సవం ముగిసింది. స్నాతకోత్సవ ఊరేగింపునకు రిజిస్ట్రార్ నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.వాసంతి నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీ బయలుదేరిన రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము హైదరాబాద్ పర్యటన ముగించుకొని శనివారం రాత్రి ఢిల్లీకి తిరిగి వెళ్లారు ఈ సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో ఆమెకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ వీడ్కోలు పలికారు. కాగా మధ్యాహ్నం ఆమె విమానాశ్రయంలో దిగి బొల్లారం రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఈశాన్య దేశాల భారతీయ కళా మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాష్ట్రపతికి సీఎం స్వాగతం

ఒక్కరోజు పర్యటన నిమిత్తం శనివారం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వాగతం పలికారు. మినిస్టర్ ఫర్ వెయిటింగ్ హోదాలో మంత్రి సీతక్క రాష్ట్రపతి పర్యటన ముగిసేవరకు ఆమెతోనే ఉన్నారు. ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ బిల్లును ఆమోదించాలని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మంత్రి సీతక్క రాష్ట్రపతిని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటిగా మార్చే చట్టానికి ఆమోదం తెలపాలనీ, రెండేండ్లుగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉన్నదని వివరించారు.

జీహెచ్‌ఎం పదోన్నతులివ్వాలి

టీచర్ నజీముద్దీన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్‌ఎం) పదోన్నతులను కల్పించాలని మల్టీజోన్-2 ఉపాధ్యాయుడు ఎండీ నజీముద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో మల్టీజోన్-1, మల్టీజోన్-2లో 324 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందుకు సంబంధించి జులై 31న సీనియార్టీ జాబితాను విద్యాశాఖ విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆగస్టు 20న మరోసారి జారీ చేసిందనీ, అదేనెల 23న వెబ్‌ఆప్షన్లను నమోదు ప్రారంభమవుతుందని ప్రకటించిందని వివరించారు. కానీ ఇప్పటి వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ విషయంపై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు కూడా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేశారని పేర్కొన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారని తెలిపారు.

మల్టీజోన్-1లో గతేడాది సెప్టెంబర్‌లో జీహెచ్‌ఎం పదోన్నతులను కల్పించారని వివరించారు. మల్టీజోన్-2లో కోర్టు కేసుల వల్ల ఈ ఏడాది జూన్‌లో పదోన్నతులిచ్చారని పేర్కొన్నారు.

మల్టీజోన్-1లో నాట్ విల్లింగ్ ఉపాధ్యాయులు ఆగస్టులో కోర్టును ఆశ్రయించారని తెలిపారు. వారికి అవకాశం కల్పించాలంటూ కోర్టు ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. 145 జీవో ప్రకారం పదోన్నతిని తిరస్కరించిన వారు ఏడాది వరకు పదోన్నతిని పొందలేరని వివరించారు. దీంతో రెండు జోన్లలో జీహెచ్‌ఎం పదోన్నతులను ప్రభుత్వం నిలిపేసిందని తెలిపారు. ప్రస్తుతం జీహెచ్‌ఎం పదోన్నతులను కల్పించడానికి ఎలాంటి అడ్డంకుల్లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ చొరవ చూపి ఖాళీగా ఉన్న జీహెచ్‌ఎం పదోన్నతులను నింపాలని కోరారు.

18 మంది చిన్నారులకు

నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్ర చికిత్స

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆపరేషన్లు చేసిన బ్రిటన్ వైద్య బృందం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాదు

బ్రిటన్‌కు చెందిన 12 మంది వైద్యుల బృందం హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో 18 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసింది. ఈ నెల 22 నుంచి 28 వరకు 'హీలింగ్ లిటిల్ హార్ట్స్ చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్'లో భాగంగా రెండు కిలోలు ఉన్న చిన్న పిల్లల నుంచి రెండు రోజుల చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేశారు. క్యాంప్‌నకు వచ్చిన దాదాపు 700 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించగా, అందులో 450 మందికి శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరముందని తేలింది. అయితే ప్రాధాన్యతా క్రమంలో వారి వ్యాధి తీవ్రతను బట్టి 18 మంది చిన్నారులకు ఆపరేషన్లు నిర్వహించారు. 2022 నుంచి నిమ్స్‌లో ఉచిత శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది 9 మందికి, రెండవ ఏడాది 2023లో 14 మందికి, తాజాగా ఈ ఏడాది 18 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లను నిర్వహించారు.

ప్రతి వెయ్యిమందిలో 16 మంది చిన్నారులకు గుండె జబ్బులు

డాక్టర్ అమరేశ్వర్‌రావు, హెచ్‌వోడీ, నిమ్స్ సిటీ సర్జరీ

రాష్ట్రంలో ప్రతి వెయ్యి మందిలో 16.4 శాతం మంది పిల్లలు పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని నిమ్స్ సిటీ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ అమరేశ్వర్‌రావు అన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఉచిత గుండె శస్త్ర చికిత్స క్యాంప్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవజాత శిశు మరణాలకు మూడో అతి పెద్ద కారణం పుట్టుకతో వచ్చే గుండె జబ్బులేనని అన్నారు. పిండదశలో అవయవాలు ఏర్పడే క్రమంలో అనేక కారణాల వల్ల ఈ జబ్బులు వస్తాయని చెప్పారు. సకాలంలో ఆపరేషన్లు చేయక పోతే వారి ప్రాణానికే ప్రమాదం ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏటా దాదాపు 6 వేల మంది పిల్లలు గుండె జబ్బుల బారిన పడుతున్నారని చెప్పారు. నిమ్స్ ఆధ్వర్యంలో తమకున్న పరిధిలో చిన్నారులకు వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. బ్రిటన్ వైద్య బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ రమణ ధన్నపునేని మాట్లాడుతూ తాము గత మూడేండ్ల నుంచి ఉచిత గుండె ఆపరేషన్ల క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. భవిష్యత్‌లో మరింత ఎక్కువ మంది చిన్నారులకు వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ డి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొండలా పెరుగుతోంది!

రూ.176 లక్షల కోట్లకు చేరిన కేంద్ర రుణం

- గత జూన్‌తో పోలిస్తే 25 శాతం అధికం
- రాబడిలో 19 శాతం వడ్డీలకే సరి



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రుణం కొండలా పెరిగిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వ రుణభారం రూ.176 లక్షల కోట్లకు చేరింది. గత సంవత్సరం ఇదే సమయంలో రూ.141 లక్షల కోట్లుగా ఉన్న రుణం ఏకంగా పాతిక శాతం పెరిగింది. ప్రతి త్రైమాసికంలోనూ రుణభారం 1.2 శాతం చొప్పున పెరుగుతూనే ఉంది. అయితే సంవత్సరం క్రితం నాటి త్రైమాసిక పెరుగుదల 4.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. జూన్‌తో ముగిసిన త్రైమాసిక కాలంలో విదేశీ రుణభారం రూ.9.78 లక్షల కోట్లకు చేరుకుంది. గత సంవత్సరం జూన్ నాటికి విదేశీ రుణం రూ.8.50 లక్షల కోట్లుగా ఉంది. జూన్ నాటికి ఉన్న రూ.149 లక్షల కోట్ల అంతర్గత రుణాలలో ప్రభుత్వ బాండ్ల ద్వారా సేకరించినవి (మార్కెట్ రుణాలు) రూ.104.5 లక్షల కోట్లు. సెక్యూరిటీల (చిన్న మొత్తాలు) ద్వారా రూ.27 లక్షల కోట్లు, టీ-బిల్లుల ద్వారా రూ.10.5 లక్షల కోట్లు, బంగారం బాండ్ల ద్వారా రూ.78,500 కోట్లు రుణాలుగా పొందారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.1 లక్షల కోట్ల మేర రుణాలు సేకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రూ.6.61 లక్షల కోట్ల రుణం తీసుకుంటామని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.14.1 లక్షల కోట్ల రుణం తీసుకోవాలని ప్రభుత్వం అనుకుంటున్నప్పటికీ దీనిని తగ్గించుకునే అవకాశం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రారంభంలో ప్రభుత్వ వ్యయం పెరిగినప్పటికీ ఇంకా వేగం పుంజుకోలేదు. 2024-25లో ద్రవ్య లోటు లక్ష్యం 4.9 శాతంగా ఉన్నా అది తగ్గవచ్చునని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త గౌరసేన్ గుప్తా అంచనా వేశారు.

ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయంలో 19 శాతం రుణ బకాయిలపై వడ్డీ చెల్లింపులకే ఖర్చవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపుల కోసం బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.11.6 లక్షల కోట్లు కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరపు జీడీపీ అంచనా రూ.326 లక్షల కోట్లలో జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం రుణం 54 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర రుణం, జీడీపీ నిష్పత్తి 57.5 శాతంగా ఉంది. 2020-21 నుండి ఈ నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. 2020-21లో అది గరిష్టంగా 62.75 శాతానికి చేరింది.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో విద్యాసంస్థ పేరు, అడ్రస్ పొందుపర్చాలి

- సీఈవో సుదర్శన్‌రెడ్డికి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో విద్యాసంస్థ పేరుతోపాటు పోస్టల్ అడ్రస్ పూర్తిగా ఉండేలా పొందుపర్చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఎన్నికల కమిషన్ (ఈసీ)ని కోరింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి సుదర్శన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబూరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. 2019 'వరంగల్-ఖమ్మం-నల్లగొండ' ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా ఓటర్ జాబితాలోని 'కాలమ్ నెంబర్-5లో' ఓటరు పనిచేసే పాఠశాల/ కళాశాల/ విశ్వవిద్యాలయం పేరు మాత్రమే ప్రస్తావించాలని ఉందని తెలిపారు. పూర్తి అడ్రస్ పేర్కొనాలంటూ ఆ కాలమ్‌లో లేదని వివరించారు. అడ్రస్ లేనందువల్ల బోగస్ ఓట్లు నమోదయ్యే అవకాశముంటుందని పేర్కొన్నారు. ఇతర కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. అక్టోబర్ ఒకటి నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతున్నదని వివరించారు. ఈ ఓటర్ల జాబితాలోని 'కాలమ్ నెంబర్-5'లో విద్యాసంస్థ పూర్తి పేరుతోపాటు, మండలం, జిల్లా తదితర పోస్టల్ అడ్రస్‌ను పొందుపర్చాలని కోరారు. బోగస్ ఓట్ల నమోదు ను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ఓటర్ల జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాల గడువు అక్టోబర్ 15 వరకు పొడిగింపు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును వచ్చేనెల 15వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో చేరేందుకు ఆలస్య రుసుం రూ.500 చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీలకు ఆలస్య రుసుం నుంచి మినహాయింపు ఉందని పేర్కొన్నారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులకు, చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఆ కాలేజీల జాబితాను acadtgbie.cgg.gov.in , tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వచ్చేనెల 15వ తేదీ వరకు ప్రవేశాలను కల్పించాలని జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆమె ఆదేశించారు.

'గుట్ట' గోపురానికి బంగారు తాపడం 2025 మార్చిలోపు పూర్తిచేయాలి

- అధికారులకు మంత్రి సురేఖ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం విమాన గోపురానికి బంగారు తాపడం పనుల్ని ప్రారంభించాలని దేవాదయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అధికారుల్ని ఆదేశించారు. ఈ పనుల్ని స్మార్ట్ క్రియేషన్స్ అనే కంపెనీకి ప్రభుత్వం అప్పగించిందనీ, బ్రహ్మోత్సవాలు ప్రారంభానికంటే ముందు 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతల్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ చైర్‌పర్సన్‌గా, డైరెక్టర్ కన్వీనర్‌గా, ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ వైస్ చైర్మెన్ జీ కిషన్‌రావు, యాదగిరి గుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్‌ను సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి రెండు వేర్వేరు జీవోలను జారీ చేసినట్టు మంత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణకు అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వం మరో జీవోను కూడా జారీ చేసిందని చెప్పారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

లోనౌతున్నారన్నారు. పాఠశాల ఆవరణలో నివాస వసతి లేక, కనీసం రాత్రి బసచేసే సౌకర్యం కూడా లేకున్నా మహిళలతో సహా రాత్రి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఊరికి దూరంగా ఉన్న పాఠశాలల్లో నైట్ స్టడీ తర్వాత ఇంటికి వెళ్ళే మహిళా ఉపాధ్యాయులకు రక్షణ, భద్రతా సమస్యలు ఎదురౌతున్నాయని చెప్పారు. కేర్ టేకర్లు, వార్డెన్లు ప్రత్యేకంగా లేకపోవటం చేత వార్డెన్ డ్యూటీ చేస్తూ, క్లాసులు బోధించటం, సిలబస్ కవర్ చేయటం కష్టంగా మారిందన్నారు. ఒత్తిడి తట్టుకోలేక ప్రత్యామ్నాయ ఉద్యోగాలను వెతుక్కునే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నిలుపుకోలేకపోతే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండాపోతుందన్నారు. గురుకుల విద్యావ్యవస్థ అర్థమే మారిపోయే దుస్థితి దాపురించిందని చెప్పారు. సీఎం జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.





మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లోని స్వేచ్ఛ నివాస్, వినాయక హిల్స్ ఫేస్ 2 రోడ్ - 7 వినాయక హిల్స్ పోచమ్మ టెంపుల్ రోడ్డు, శ్రీహిల్స్ మెయిన్ రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను గల్ఫార్ మిషన్ సహాయంతో సమస్యను పరిష్కరించినట్టు కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

'కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

నవతెలంగాణ - బడంగ్‌పేట్

కాలనీ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ రంగనాయకుల కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ - చంపాపేట్

బండ్లగూడ మండలం జంగంమెట్ ఎంసిహెచ్ క్వార్టర్స్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థానికులకే కేటాయించాలని కోరుతూ బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ.. బండ్లగూడ మండలంలో జంగంమెట్ డివిజన్ ఎంసి హెచ్ క్వార్టర్స్‌లో 252 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మించారని తెలిపారు.

అందులో 72 ఇండ్లు కేటాయింపులు చేశారని, మిగతా 190 ఇండ్లను స్థానికంగా ఉన్న పేద ప్రజలకు ఇవ్వాలని కోరారు. పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారు గత 10 సంవత్సరాలు అనేక సార్లు ఆన్లైన్, ఆఫ్‌లైన్ కలెక్టర్, ఆర్డీవో జీహెచ్ఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. అర్హులుగా ఉన్న వారిని గుర్తించి.. వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా నాయకులు కిషన్, రామ్, కుమార్, శ్రీను, రాజేష్, మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేసి పేద ప్రజల సంక్షేమానికి సహకరించాలని మాజీ, మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పెద్ద చెరువు సుందరీకరణ పనులను చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది, కమిషనర్ వాణిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. పెద్ద చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.9కోట్ల నిధులను కేటాయించటం జరిగిందని, ఆ పనులను కాంట్రాక్టర్ చెరువు సుందరీకరణ పనులను పూర్తి చేయక పోవటంతో సుందరీకరణ పనులు నిలిచి పోవటం జరిగిందన్నారు. నిలిచిపోయిన పనులకు రీస్టిమెంట్ వేయించి సుందరీకరణ పనులను కాంట్రాక్టర్ పూర్తి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్‌లో అన్ని కాలనీలో పేద ముస్లిం, మైనార్టీ ప్రజలు ఉన్నారని ఆయా కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల కోసం మంజూరు చేయించిన రూ.25కోట్ల ఎస్‌డిఎఫ్ నిధులను వెంటనే విడుదల చేసి, జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చెరువు మధ్యలో ఐలాండ్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వెంకన్న, ఏఈ అయేషా, హెచ్ఎండబ్ల్యూఎల్ డీఈఈ శివారెడ్డి, ఏఈ రామారావు, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, జల్ పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎంజాల జనార్ధన్, షర్ఫుద్దీన్ హమీద్, కౌన్సిలర్లు పల్లపు శంకర్, షేక్ పమీద అఫ్జల్, యూత్ ప్రెసిడెంట్ ఎంజాల అర్జున్, మాజీ ఆర్మీమెన్, సోషల్ మీడియా ఇంచార్జి వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వృత్తి శిక్షణలో రాణించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో మహిళలు వృత్తి శిక్షణలో రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 31వ డివిజన్ శ్రీ సాయి బాలాజీ ఫేస్ 2 కమ్యూనిటీ హాల్లో జన శిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాము గౌడ్, చంద్రపాల్ రెడ్డి, పరమేష్, మల్లికార్జున మూర్తి, రమేష్ రెడ్డి, వెంకట నరసింహారావు, కేశవర్ధన్ రెడ్డి, గోపి కృష్ణ, కులకర్ణి సంపత్, పవన్ కుమార్, కమిటీ సభ్యులు జన శిక్షణ సంస్థాన్ సభ్యురాలు శ్రీలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.



'పారిశుధ్య కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం'



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ లైన్స్ క్లబ్ కార్యాలయంలో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ హైదరాబాద్ రీజినల్ సౌజన్యంతో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ మూడవత్ దుర్గా దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ హైదరాబాద్ రీజినల్ ఆర్ లలిత కళ, జిల్లేలగూడ గీతాంజలి లైన్స్ క్లబ్ ఫౌండర్ చైర్మెన్ సురసాని సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. తర్వాత 250 మంది పారిశుధ్య కార్మికులకు ఒక సంవత్సరానికి సరిపడా ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఒక లక్ష రూపాయలను కార్పొరేటర్ అనిల్ కుమార్ యాదవ్, గీతాంజలి లయన్స్ క్లబ్ ఫౌండర్ సురసాని సుధాకర్ రెడ్డి తమ స్వంత డబ్బులను ఇన్సూరెన్స్ కంపెనీలకు అందజేశారు. అనంతరం కార్మికులను శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సూపర్వైజర్లు, పారిశుధ్య సిబ్బంది నీటి సరఫరా సిబ్బంది, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులు, వివిధ హెూదాలలో ఉన్న నేషనల్ ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

'మూసీ బఫర్ జోన్ బాధితులకు డబుల్ ఇండ్లు కేటాయించాలి'





నవతెలంగాణ - ఎల్బీనగర్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి బృందం శనివారం ఎల్బీనగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంత పేదలు మధ్యతరగతి వారు అనేక సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారని చెప్పారు. ఈ నివాస ప్రాంతాలను ఖాళీ చేయాలని చెప్పి ప్రభుత్వం గుర్తులు వేసి పోయిందని అన్నారు. కానీ వారికి ఎలాంటి నష్టపరిహారం కానీ, ఇండ్లు కానీ నిర్మించి ఇవ్వకుండానే ఖాళీ చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బజారులో 21 ఇండ్లు ఉండగా అందులో ఆరుగురు పేర్లు మాత్రమే రాసుకొనిపోయినట్లు స్థానికులు తెలిపారని చెప్పారన్నారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ సర్కిల్ నాయకులు ఎం. వీరయ్య, సి. మల్లేష్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

మూసీ పరివాహక ప్రాంతంలోని శంకర్ నగర్, ముసారాంబాగ్ కమల్ నగర్ ప్రాంతాల్లో శనివారం సీపీఐ(ఎం) నాయకులు పర్యటించారు. తర్వాత శంకర్ నగర్‌లో స్థానికులతో కలిసి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మలక్‌పేట్ యాకుత్‌పురా నియోజకవర్గం జోన్ కార్యదర్శి ఎం. బాలు నాయక్ మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ పేరుతో సర్వేలు నిర్వహించి... ఇండ్లను గుర్తించి మార్కింగ్ చేయడంతో స్థానిక ప్రజలు ఏం టైంలో ఏమవుతుందోనని భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బిలాల్ నర్సింగ్, వెంకటేష్, రాము యాదవ్, స్థానిక ప్రజలు మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1637 కేసులు పరిష్కారం



నవతెలంగాణ-హయత్ నగర్

జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1637 కేసులు పరిస్కారం అయ్యాయని హయత్‌నగర్ 14వ అడిషనల్ మెట్రోపాలిటన్ జడ్జి ఫాతిమా, 7వ అదనపు మెట్రోపాలిటన్ జడ్జి సాంకేత్ మిత్రాలు తెలిపారు. శనివారం హయత్ నగర్ కోర్టులో హయత్‌నగర్ మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందన్నారు. కక్షి దారులు వివిధ కేసుల్లో రాజీ పడ్డారని, ప్రతి ఒక్కరూ రాజ మార్గమే రాజీ మార్గంగా ఇరువురు కక్షి దారులు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జ్ కె. రవీంద్ర సింగ్, వనస్థలిపురం ఏసీపీ కాశి రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఏపీపీ లావణ్య కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డు భిక్షపతి గౌడ్, కార్యదర్శి, సంతోష్ గౌడ్, బెంచ్ మెంబర్లు వేణుగోపాల్, హేమంత్ ప్రవీణ్, రామ్ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, సూపరిడెంటెంట్ రాములు, న్యాయవాదులు ప్రభాకర్ గౌడ్, బుద్దే కమలాకర్, కిక్కర గోపీ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న పన్యాల'



నవతెలంగాణ-ఎల్బీనగర్

నేటి యువతకు పన్యాల జైపాల్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. పన్యాల జైపాల్ రెడ్డికి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కేందుకు కృషి చేసిన తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డిని చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలను, సంక్షేమాలను ప్రజలకు చేరవేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. అనంతరం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, రోడ్ డెవలప్‌మెంట్ కారొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రైతులు గడ్డిఅన్నారం మార్కెట్‌కు వస్తుంటారని, మార్కెట్‌లో రైతుల సమస్యలను అర్థం చేసుకొని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు మరియు లింగోజిగూడ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగాల నాగేశ్వరరావు, సీనియర్ మైనార్టీ నాయకులు ఎండీ.జానీమియా, నరేందర్ గౌడ్, ఆనంద్, సతీష్, విజయ్, అరుణ్, చందు, షఫీ, శరత్, ఇంతియజ్, హుసేన్, రబ్బానీ, అస్లాం, వీరేందర్, అంజి, సంపత్, శ్రీనివాస్, హరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్లేనింగ్ గర్ల్స్ అవేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులకు అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గ్లేనింగ్ గర్ల్స్ అవేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ రాజీవ్ గార్గ్ , డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ముఖేష్ రావు, డాక్టర్ మలింద్ర స్వామి, కార్డియోథొరసిక్ సర్జన్, డాక్టర్ అజయ్ జోషి ,కార్డియాలజిస్ట్ అనాస్థ టీస్ట్ డాక్టర్ సుదర్శన్ రావులు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గుండె జబ్బులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో రెగ్యులర్ కార్డియాక్ స్క్రీనింగ్ లో ముఖ్యమైన దశ ఈ స్క్రీనింగ్‌లు మీ గుండె ఆరోగ్యం పై అవసరమైన అవగాహనాలను అందిస్తాయన్నారు. కోరోనరీ ఆర్టరీ ధిస్ ఇస్ హైపర్ టెన్షన్ మరియు అర్థిమ్యాస్ వంటి పరిస్థితుల యొక్క ముందస్తు సంకేతాలను అవి పరిస్థితుల్లో రాకముందే గుర్తించగలవు అని చెప్పారు. ముందస్తుగా గుర్తించడం మరియు జోక్యం చేసుకోవడం చాలా ముఖ్యం.. ఎందుకంటే గుండె జబ్బులను తరచుగా అణచివేతగా అభివృద్ధి చెందుతాయి ఇది క్లిష్టమైన దశకు చేరుకునే వరకు ఎటువంటి సూచనలు చూపదు అని పేర్కొన్నారు.

ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించడం:

రెగ్యులర్ కార్డ్యక్ స్క్రీనింగ్‌లో అధిక కొలెస్ట్రాల్ అధిక రక్తపోటు మధుమేహం మరియు గుండె జబ్బుల కుటుంబం చరిత్ర వంటి కీలక ప్రమాద రకాలను గుర్తించగలవు. ఈ కారకాలను సకాలంలో అర్థం చేసుకోవడం ద్వారా రోగులు మరియు వైద్యులు రక్షణ చర్యలను తీసుకోవచ్చు .ఉదాహరణకు అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను ఆహార మార్పు లేదా మందుల ద్వారా నిర్వహించచవచ్చు. అయితే జీవనశైలి మార్పుల, వైద్య చికిత్స ద్వారా అధిక రక్తపోటును నియంత్రించచవచ్చు. ఈ పరిస్థితులను ముందుగానే గుర్తించడం వల్ల గుండెపోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్కు తగ్గుతుంది అని అన్నారు.

కార్డ్ యాక్ స్క్రీనింగ్ లో ఏమి ఉంటుంది..

ఒక సమగ్ర కార్డియాక్ స్క్రీనింగ్ సాధారణంగా అనేక పరీక్షలను కలిగి ఉంటుంది. బ్లడ్ ప్రెజర్ మానిటరింగ్, కొలెస్ట్రాల్ స్థాయిలో ఈసీజీ, ఎకోకార్డియోగ్రామ్, టిఎంటి, అధునాతన ఇమేజింగ్ సకాలంలో రోగనిర్ధారణ జీవితాలను కాపాడుతుంది. రెగ్యులర్ కార్డియాక్ స్క్రీనింగ్‌లా యొక్క అత్యంత ప్రాథమిక ప్రయోజనాలలో ఒకటి సకాలంలో రోగనిర్ధారణ అథెరొస్కి రోసిస్ వంటి పరిస్థితులను ముందుగానే గుర్తించినట్లయితే సమర్థవంతంగా నియంత్రించవచ్చు. చికిత్స జీవనశైలి మార్పుల నుండి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటూ ధూమపానం మానేయడం వ్యాయామలు చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రెగ్యులర్ కార్డ్ యాక్ టెస్టులు చేసుకోవడం వలన ప్రతి ఒక్కరికి ప్రయోజనకరంగా ఉంటుంది. 40 ఏళ్ళ పైబడిన వారు క్రమమం తప్పకుండా పరిష్కలు చేయించుకోవాలని సూచించారు. గుండె జబ్బులు ఉన్నవారు ఆహారపు అలవాట్లు ఫైబర్ ఎక్కువ ఉండడం చూసుకోవాలని సూచించారు. నడక, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి రెగ్యులర్‌గా చేయడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చని అన్నారు. గుండె జబ్బులు ఉన్నవారు ధూమపానం మానేయడం, ఆల్కాహాల్‌ను తీసుకోకపోవడం మంచిదని అన్నారు. ఒత్తిడి లేకుండా చూసుకోవాలని దీనివల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారించవచ్చు అని తెలిపారు. అనంతరం హాస్పిటల్ సీఈవో డాక్టర్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మా హాస్పిటల్ నందు 1550 రూపాయలకు ముఖ్యమైన గుండె పరీక్ష ప్యాకేజీని అందిస్తున్నామని తెలిపారు. బ్లడ్ షుగర్ , ఈ ఎస్ఆర్, సిరం క్రియేటినిన్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, 2డి ఈకో, కార్డియాలజిక్ కన్సల్టేషన్ సలహాపై 500 రూపాయల వద్ద టీఎంటి, ఈ ప్యాకేజ్ అక్టోబర్ 5 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



- చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని ఫంక్షన్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంటింట చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్, చెత్తను సరైన పద్ధతిలో తొలగింపుపై చర్చించారు. అలాగే బతుకమ్మ పండుగకు చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన అంశాలు మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో చర్చించినట్లు చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి వెల్లడించారు.

'పారిశుధ్య సిబ్బందికి హెల్త్ క్యాంప్'

తొర్రూరులో పురపాలిక పరిధిలోని పారిశుధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయిస్తామన్నారు. కార్మికుల ఆరోగ్యం పట్ల కౌన్సిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు.

'స్వచ్ఛత హి సేవకు అనూహ్య స్పందన'

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత హి సేవకు అనూహ్య స్పందనకు లభిస్తోంది. తొర్రూరులో సెంటర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి విశేషస్పందన వచ్చింది. విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకమండలి సభ్యులు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి చైర్‌పర్సన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు నక్క శివలింగం గౌడ్, కుంట ఉదయశ్రీగోపాల్‌రెడ్డి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, కంబాలపల్లి ధన్‌రాజ్, నారని కవితాశేఖర్‌గౌడ్, గుండా భాగ్యమ్మ ధన్‌రాజ్, కొండ్రు మల్లేశ్, రేవల్లె హరితాయాదగిరి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్వో శ్రీనివాస్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సైకిల్ రిక్షాలు పంపిణీ

నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో నూతనంగా జీహెచ్ఎంసీ నుండి వచ్చిన చెత్త సేకరణ సైకిల్ బండ్లను పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ నీలిమలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో రోడ్ల పైన ఎక్కడ కూడా చెత్త కుప్పలను ఉండకుండా చూడాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రతి రోజూ కాలనీలలో రోడ్లను పారిశుధ్య కార్మికులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. జీహెచ్ఎంసీ సిబ్బందికి ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాస్యఆంజనేయ ఆలయ చైర్మెన్ ప్రదీప్ రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ కాలనీ ఫేస్ 1 అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, సెక్రటరీ ధనరాజ్, రవి కిరణ్, జవాన్ యాదగిరి, ఎస్ఎస్‌పి లు పురుషోత్తం, బాలకృష్ణ, గోవర్ధన్ రెడ్డి,శ్రీనివాస్, ప్రకాష్ రెడ్డి, మైరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్‌లోని కమలానగర్ సంక్షేమ సంఘం భవనం వద్ద జీహెచ్ఎంసీ ద్వారా వచ్చిన చెత్త రిక్షాలను కార్మికులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ యాదయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్స్ వెంకట్ రెడ్డి, రాజ్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



చంపాపేట్‌లో డ్రంకెన్ డ్రైవ్

నవతెలంగాణ- చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ చౌరస్తా, భారత్ గార్డెన్, యాదిరెడ్డి గార్డెన్ వద్ద సంతోష్ నగర్, మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ జోన్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్ చార్యులు, ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, సీఐలు నరసింహ నాయక్, నముద్దీన్ ఆదేశం మేరకు సీఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా సుమారు 17 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 13 మంది ద్విచక్ర వాదారులు, 3 త్రీ వీలర్, ఒకటి వీలర్ వాహనదారులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి, సంతోష్ నగర్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐలు ట్రాఫిక్ పోలీసులు శివ, ఉమార్, మూర్తి, మధు, దస్తగిరి, రమేష్, ప్రవీణ్, రామ మదిలేటి, యాదయ్య, నాగరాజు, ఖాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ. 50 లక్షలు స్వాధీనం..

నవతెలంగాణ - సుల్తాన్ బజార్

అక్రమంగా ద్విచక్ర వాహనం పై తరలిస్తున్న రూ. 50 లక్షల నగదును సుల్తాన్ బజార్ పోలీసులు స్వాధీనం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ ప్రకాష్ నగర్ వెల్కిన్ పార్క్ ప్రాంతానికి చెందిన అమిత్ సిర్వానీ సికింద్రాబాద్ లో ఆనంద్ బజార్ టెక్స్‌టైల్ వ్యాపారం చేస్తుంటారు. బొగ్గులకుంట, సభా కేఫ్ సమీపంలో ఆస్తి నేరాలు పెరుగుతున్నాయని విశ్వసనియా సమాచారంతో సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి అబిడ్స్ వైపు నుంచి టీఎస్10 ఎఫ్ఈ -2442 నెంబర్ గల చెతక్ స్కూటర్‌పై వచ్చి తిలక్ రోడ్డు వైపు వెళ్తున్నాడు. అనుమానంతో ఆ వ్యక్తి వాహనాన్ని ఆపి తనిఖీ వేయగా, పైన జీపుతో కప్పిన జూట్ బ్యాగ్ లో రూ.50 లక్షల నగదు ఉంది. ఈ నగదు పై విచారణ చేయగా పొంతన లేని సమాధానాలు చెప్పడం తో అతడి నుండి రూ.50లక్షలు ఉన్న దేవి జ్యువెలర్స్ బ్యాగ్‌ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అమిత్ సిర్వాణికి వ్యతిరేకంగా అవసరమైన చర్య తీసుకోవడానికి ఆదాయపు పన్ను అదనపు డైరెక్టర్ కు అప్పగించారు.

జాతీయ లోక్ అదాలత్ కారణంగా శనివారం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని లోక్ అదాలత్‌లో 2557 కేసులు పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న 742 కేసులు, 1815 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరమయ్యాయి. పధాన న్యాయమూర్తి రేణుకా యారా, XXV అదనపు ప్రధాన న్యాయమూర్తి డి వి నాగేశ్వర్ రావు , XI అదనపు ప్రధాన న్యాయమూర్తి దానీ రూత్, IV సీనియర్ సివిల్ జడ్జి బవానీ, XVIII, సీనియర్ సివిల్ జడ్జి పురుషోత్తమ్ రావు, XIX జూనియర్ సివిల్ జడ్జి అనిషా జవియన్ పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



జీవో 25ను సవరించాలి



- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ
- జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన

నవతెలంగాణ- సిటీబ్యూరో

జీవో 25ను సవరించాలని, బదిలీ అయిన ఎస్జిటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీపీటీ ఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు తో పాటు, ప్రతి పాఠశాలకు ఒక హెచ్ఎం ఉండేలా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధమైన జీఓ 25 ను సవరించకపోతే భవిష్యత్ లో రాష్ట్ర స్థాయి పోరాటానికి సిద్ధం అవుతామని తెలియచేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి కి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమం లో టీఎస్ యుటిఎఫ్ నాయకులు శారద, రాజారావు, శ్యామ్ సుందర్, విశాలి, టీపీటీఎఫ్ నాయకులు రాంబాబు, ప్రసాద్, శాస్త్రి, వెంకటరమణ, డిటిఎఫ్ నాయకులు వినోద్ కుమార్, రేణుక తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతా



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

కార్పొరేటు హాస్పిటల్స్‌కు ధీటుగా అంబర్‌పేట మున్సిపల్ కాలనీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను అన్ని సదుపాయలతో తీర్చిదిద్దుతామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.5 కోట్ల 75 లక్షల నిధుల మంజూరయ్యాయని ఆయన తెలిపారు. త్వరలోనే కొత్త బిల్డింగ్ పనులు ప్రారంభించి వచ్చే ఏడాది మార్చి నెల లోపు బిల్డింగ్ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. శనివారం అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, మున్సిపల్ ఆస్పత్రిని ప్రధాన వైద్యురాలు దాక్షాయని, ఏఎంహెచ్ హేమలత, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సునీత, డీఈలు జగదీశ్, శివకుమార్, ఏఈ దీపక్ తదితరులతో కలసి అంబర్‌పేట మున్సిపల్ దవాఖానాలో కొత్త భవనం నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అనంతరం అధికారు లతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ 4 వందలకు పైగా ఔట్ పేషెంట్లతో పాటు నెలకు 30 మంది వరకు గర్భిణులకు డెలవరీలు చేస్తున్నామని, అయితే డాకర్లు, సిబ్బంది కొరతతో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించలేక పోతున్నామని దావాఖాన ప్రధాన వైద్యురాలు దాక్షాయని తమ సమస్యలు వివరించగా.. వెంటనే పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు. ఇక కొత్త భవనంతో విశాలమైన ఔట్ పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూం, పేషెంట్ అటెండెంట్లు ఉండే విధంగా రెండు ఫ్లోర్లలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో పాటు లిఫ్ట్, ర్యాంపింగ్ తదితర నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. త్వరలోనే టెండర్లు పిలిచి పక్కా ప్రణాళికతో వచ్చే ఏడాది మార్చి నెల లోగా కొత్త భవనంలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్దార్థ్ ముదిరాజ్ తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ ఆధ్వర్యంలో మెంబర్‌షిప్ క్యాంపెయిన్


రహీం


మోతిలాల్


ఇందిరా

నవతెలంగాణ-సిటీ బ్యూరో

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మమ్మద్ ఇష్తాకారుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు, జిల్లా నాయకులు సైదాబాద్ మండలంలో మెంబర్స్ షిప్ క్యాంపెయిన్ చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ పాఠశాలల సందర్శించి మెంబర్షిప్ తీసుకున్నారు. అనంతరం సైదాబాద్ మండల బాధ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎంఏ. రహీం, ప్రధాన కార్యదర్శిగా మోతిలాల్, మండల ఆర్థిక కార్యదర్శిగా ఇందిరాను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇష్తాకారుద్దీన్ మాట్లాడుతూ సైదాబాద్ మండలంలో ఎస్‌టీయూ సీనియర్ నాయకులు అనేకమంది ఉన్నారని, వారు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. సంఘం ఇంకా బలపడాలని సూచన చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు మాట్లాడుతూ మెంబర్షిప్ క్యాంపెయిన్ లో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను, వారు పాఠశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని అధికారులతో మాట్లాడారు.

జీ వో 25 పేరిట ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదు..

అనవసరంగా జీవో 25 ను ప్రభుత్వం తీసుకువచ్చి, వర్క అడ్జస్ట్మెంట్ అనే పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదని, ఇటువంటి చర్యలు చేపట్టడం వలన పాఠశాలలను బలహీనపరచడమేనని జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇష్తాకారుద్దీన్ , ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు తెలిపారు. ఇంకా అడ్మిషన్స్ జరుగుతున్నాయని , ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల అవసరం ఉందని, ఈ సమయంలో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టవద్దని ఈ జీఓ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు , తమ ఉపాధ్యాయులు చేస్తున్న మధ్యాహ్న భోజన విరామ సమయ నిరసన కార్యక్రమంలో పాల్గొని, వారికి తమ మద్దతును తెలిపి జో 25 ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ మండలం , జిల్లా నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థానికులకే కేటాయించాలి

- సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ - ధూల్ పేట్

బండ్లగూడ మండలం జంగంమెట్ ఎంసీహెచ్ క్వార్టర్స్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థాని కులకే కేటాయించాలని సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ మండలంలో జంగంమెట్ డివిజన్ ఎంసీహెచ్ క్వార్టర్స్ లో 252 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మించారన్నారు. అందులో 72 ఇండ్లు కేటాయింపు కాగా, మిగితా 190 ఇండ్లను స్థానికంగా ఉన్న పేదలు ఎస్టీ, ఎస్సీ. బీసీ కులనికి చెందిన వారికి కేటాయించాలన్నారు. గత 10ఏండ్లుగా అనేక మార్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలెక్టర్, ఆర్డీవో జీహెచ్ఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అర్హులను గుర్తించి పేదలకు న్యాయం చేయలన్నారు. కానీ ఇతరులను ఇష్టం వచ్చినట్టు గుర్తించి ప్రజలను మోసం చేస్తున్నారని, అది సరికాదన్నారు. స్థానికంగా చిన్న చిన్న వ్యాపారం, కిరాణషాపు ఇతర చిన్న పాటి ఉద్యోగాలు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. అది వదిలేసి ఎవరు బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. వారు వెళ్లడానికి సిద్ధం లేకున్నా బలవంతంగా పంపిస్తున్నారన్నారు.జంగంమెట్ డివిజన్ లో స్థానికంగా ఉన్న వారు ఇల్లు కావాలని అధికారులు చుట్టు తిరిగిన పట్టించుకోకుండా ఉన్న పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానిక ఉన్న వారికి దూరంగా పంపించి, బలవంతంగా చేసిన గత ప్రభుత్వం పడిపోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిషయానికి గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. స్థానిక డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయింపు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి స్థానికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కిషన్, రామ్ కుమార్, శ్రీను, రాజేష్, మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



నేడు 'తెలుగు పదానికి జన్మదినం' శీర్షికన సంగీత విభావరి

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 29 వ తేదీన శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై తెలుగు పదానికి జన్మ దినం జానపదానికి జ్ఞాన పథం శీర్షిక న శ్యామ గాయత్రి సాంస్కృతిక సంస్థ నిర్వహణ లో తొమ్మిది గంటల పాటు నిర్విరామ సంగీత విభావరి నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షులు చిల్ల శివ పార్వతి విలేకరులకు తెలిపారు ఈ విభావరి లో ప్రముఖ గాయనీ గాయకులు తో పాటు బాల గాయకులు పాల్గొంటారని తెలిపారు ప్రముఖ పారిశ్రామిక వేత్త యు మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ప్రముఖ గాయకుడు త్రినాథ రావు అధ్యక్షత వహిస్తారు అని చెప్పారు

ప్రాణదాత చింతచెట్టు..

- వరదలు, నాటి గుర్తులు మరవలేనివి..
- సమావేశంలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మెన్, అర్బన్, రీజినల్ ప్లానర్ ఈఆర్. వేద కుమార్ మనికొండ

నవతెలంగాణ - ధూల్‌పేట్

నాటి మూసి వరదల్లో ప్రాణధాత చింతచెట్టు చేసిన సహాయం, నాటి గుర్తులు మరవలేనివని ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మెన్, అర్బన్, రీజినల్ ప్లానర్ ఈఆర్. వేద కుమార్ మనికొండ అన్నారు. 1908 మూసీ వరదల 116వ వర్ధంతిని పురస్కరించుకొని, ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్, సివిల్ సొసైటీ గ్రూపులతో కలిసి, అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఆవరణలోని ప్రాణధాత చింతచెట్టు కింద 16వ స్మారక, ఐక్యసమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆవరణలో కొన్ని మొక్కలు నాటారు.

ఆయన అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ జై కిషెన్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం కన్వీనర్ ఈఅర్. శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఈఅర్. రమణ నాయక్, ఆర్కిటెక్ట్ మౌనిక జేబీఆర్ఏసీ, గవర్నమెంట్ సిటీ కాలేజ్ ప్రొఫెసర్ శ్రీనివాస్ దూసి, ఫిల్మ్ మేకర్ రఘురామ చంద్ర, ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ వీరేష్ బాబు, ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ట్ రామ్ రాజ్, సామాజిక కార్యకర్త, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ శోభా సింగ్ సభను స్వాగతించారు. స్మారక సమావేశం రామ్ నివాస్ పరాశర్ చింత చెట్టు యొక్క పాత్ర 1908 వరదల్లో దాని సహాయంపై అవగాహన కల్పించటం పై రచించిన "అంకోన్ దేఖా హాల్ ఆఫ్ ఫ్లడ్స్" లావణి పాటను ఆలపించారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఎస్ఆర్డీ అర్ఫనేజ్ విద్యార్థులు ప్రకృతిని ప్రధానాంశంగా తీసుకున్న స్వాగత గీతంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈఅర్. వేద కుమార్ మనికొండ మాట్లాడుతూ.. 1908 మూసీ వరదల సమయంలో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాన్ని గుర్తుచేసు కుంటూ, అఫ్జల్ పార్క్‌లోని ఈ చింతచెట్టుపైకి 150 మంది ఎక్కి ఆశ్రయం పొంది ప్రాణాలను కాపాడుకో గలిగినట్టు వివరించారు. 1914లో ఈ తరహా విపత్తులను నివారించడానికి సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సీఐబీ)ను స్థాపించిన హైదరాబాద్ దక్కన్ 7వ నిజాం చేసిన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య మూసీ నదిపై రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించాల్సిందిగా ప్రతిపాదించారని ఆయన తెలిపారు. ఈ రిజర్వాయర్లు వరద ముప్పును తగ్గించడమే కాకుండా, నగరానికి నిరంతర తాగునీటి సరఫరాను, దిగువ ప్రాంతాల సేద్యానికి నీటిని అందించాయన్నారు. సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సీఐబీ) భూగర్భ పారుదల వ్యవస్థను నిర్మించడంలో కీలకమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన హైలైట్ చేశారు. ఇందులో మురుగ ఎనీరు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు కూడా ఉన్నాయన్నారు.

హైదరాబాద్ నగర ప్రాంతానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ అవసరాన్ని, ముఖ్యంగా డ్రయినేజీ వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని వివరించారు. నగరంలోని నీటి వనరులను, మూసీ నదిని కాలుష్యం, ఆక్రమణల నుండి రక్షించాల్సిన అవసరం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నివాస, పారిశ్రామిక వనరుల నుండి వెలువడే మురుగునీటిని సర్ఫేస్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా శుద్ధి చేయాల్సిందిగా, తద్వారా దానిని తోటలు, వ్యవసాయం, పారిశ్రామిక అవసరాల కోసం తిరిగి ఉపయో గించుకోవచ్చని ఆయన సూచించారు. శుద్ధి చేసిన మిగతా నీటిని సురక్షితంగా నీటి వనరులు, మూసీ నదిలో విడుదల చేయాల న్నారు. నగరంలోని నీటి వనరులను రక్షించడానికి, శుభ్రమైన నీటిని నిర్ధారించడానికి ఘనవ్యర్థాల నిర్వహణ ముఖ్యం అని, హైదరాబాద్ పర్యావరణ, నగర పరిశుభ్రతను సురక్షితం చేయడానికి సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

ఈఅర్. శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో నదులను కలుషితం చేయకుండా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈఅర్. రమణ నాయక్ మాట్లాడుతూ.. నీటిని సక్రమంగా శుద్ధి చేసి వాడుకునేందుకు తగిన పరిశోధన, విశ్లేషణ నిర్వహించాలన్నారు.ఈ చింతచెట్టు కులమతాలకు అతీతంగా 150 మంది ప్రాణాలను కాపాడిందని, పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర ఎంతో ఉందని అన్వర్ ఖాన్ అన్నారు. రాజలింగం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో వేదకుమార్, ఫోరమ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన కూడా చెట్టు ముందు నమస్కరించి చింతచెట్టుకు మొక్కులు చెల్లించుకున్నారు.

హాజరైన ప్రముఖులంతా పర్యావరణ వనరుల పరిరక్షణపై పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎఫ్ బీహెచ్ కో-ఆర్డినేటర్ సయ్యద్ ఖైజర్ బాష్ కృతజ్ఞతలు తెలిపారు. రాజలింగం, ప్రముఖ రచయిత సుభాష్ రెడ్డి, వర్షపునీటి నిపుణుడు సుభాష్ రెడ్డి, సేవ్ హెరిటేజ్ కు చెందిన మహమ్మద్ అఫ్జల్, తురాబ్, ఎఫ్ బిహెచ్ సభ్యుడు నరహరి, ఎస్ ఆర్ డి అనాథాశ్రమం సమన్వయకర్త శివరాణి, ఇలియాస్, శ్రీధర్, శ్రీధర్, జెబిఆర్ ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమయత్ నగర్, సెయింట్ జోసెఫ్, ప్రగతి, రోస్ బడ్స్, సెయింట్ జోసెఫ్ తదితర స్కూల్స్ చెందిన విద్యార్థి, అధ్యాపకులు, పాఠశాల నిర్వహకులు, సివిల్ సొసైటీలకు ప్రతినిధులు పాల్గొన్నారు.





రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి..



- ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్

నవతెలంగాణ - ధూల్ పేట్

ఉస్మానియా ఆస్పత్రి రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్ అన్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన ప్రభుత్వ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన కుటుంబం వైద్య కుటుంబం, ఆయన తండ్రి డాక్టర్ బీకే సహాయ్ ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సేవలందించగా, తల్లి డాక్టర్ చంద్రకళ సహాయ్ పేట్ల బూర్జ్, సుల్తాన్ బజార్ మెటర్నిటీ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. తల్లిదండ్రులకు తగ్గ తనయుడిగా వైద్య విద్యనభ్యసించి, వైద్యులుగా, ప్రొఫెసర్ గా, హెచ్ఓడీగా బాధ్యతగా వైద్య సేవలందిస్తూ వారి బాటలోనే ఆయన సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. ఆయన ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, నిలోఫర్‌లో పీజీ చేశారు. అనంతరం వారణాసీలో ఎండోక్రైనాలజీ పూర్తి చేసిననంతరం ఉస్మానియా ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి తన జీవితాన్ని ఆరంభించారు. 24 ఏండ్లుగా ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. ఆయన భార్య డాక్టర్ మనిషా సహాయ్ సైతం ఉస్మానియా ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఆయన ఇద్దరు కూతుళ్లు వారి తరహాలో వైద్య విద్యనభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే రోగులకు తన వంతు బాధ్యతగా మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. వైద్యుల కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ విధంగా మరింతగా సేవలందించేందుకు అవకాశం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మహా ఉద్యమంతో పీడీఎస్‌ను స్థాపించిన జార్జిరెడ్డి

- రేపు ఓయూలో 50 వసంతాల స్వర్ణోత్సవ సభ
- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ

నవతెలంగాణ - ముషీరాబాద్

అవినీతి, నిరంకుశంకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి మహా ఉద్యమంతో పీడీఎస్‌ను జార్జిరెడ్డి స్థాపించారని పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అన్నారు. విద్యార్థుల నోట్లో నాలుకలా కోట్లాది మంది విద్యార్థులకు చలనాన్ని కథనాన్ని అందించిన పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రేపు నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార యంత్రాంగపు అవినీతి, నిరంకుశంకు వ్యతిరేకంగా ఉస్మానియాలో జార్జిరెడ్డి మహా ఉద్యమంతో పీడీఎస్ ఏర్పరిచారని తెలిపారు. 1972లో ఏప్రిల్ 14న మతోన్మాద గుండాలు జాను కిరాతకంగా వెన్నుపోటుతో కత్తులతో దాడి చేసి హత్య చేశారు. జార్జ్ హత్యతో జంపాల ఆ పోరాట వారసత్వాన్ని అందుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రగతిశీల భావాలతో కూడిన సంస్థలను ఐక్యం చేసి 12, 13 అక్టోబర్ 1974లో మొదటి పీడీఎస్‌యూ మహాసభతో రాష్ట్రవ్యాప్త చేశారన్నారు.ఈ 50 ఏండ్ల పోరాట ప్రస్థానంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, చేరాలు, కోలాశంకర్, రమణయ్య, సాంబయ్య, స్నేహలత త్యాగాల అమరత్వంతో చరిత్ర లిఖించిందన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యల నుండి అధిక ధరలు, ప్రజా సమస్యలు ర్యాగింగ్ దళితులు బలహీన వర్గాలపై వివక్షలతో కూడిన దాడులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిందని, అనేక మెదళ్లకు చైతన్యం అందించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. శాస్త్రీయ, సమాన, విద్యాసాధనకు 50 ఏండ్లుగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నదని.. విదేశీ ప్రయివేటు యూనివర్సిటీలను వ్యతిరేకిస్తూ స్వదేశీ యూనివర్సిటీల బలోపేతం కోసం ఉద్యమిస్తుందన్నారు. అనేక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తూ ఎన్నో విజయాలను సాధించిందని తెలిపారు. ఈ తరుణంలో ఠాగూర్ ఆడిటోరియం ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం సెప్టెంబర్ 30న జరిగే స్వర్ణోత్సవ సభకు వేలాదిమంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ముఖ్య వక్తలుగా జస్టిస్ జి.బి. కొల్సే పాటిల్ రిటైర్డ్ జడ్జి ముంబై హైకోర్టు, ప్రొఫెసర్ హరగోపాల్, కె శ్రీనివాస్, సతీష్ చందర్, పోటు రంగారావు, గుమ్మడి నరసయ్యలతో పాటు ప్రముఖులు పూర్వ పీడీఎస్ యు నాయకులు ప్రస్తుత నాయకులు హాజరుకానున్నారన్నారు. ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, ఉపాధ్యక్షులు ఎస్. అనిల్, సహాయ కార్యదర్శి కే ప్రవీణ్, రాష్ట్ర నాయకులు రాకేష్, కావ్య తదితరులు పాల్గొన్నారు.



ఏబీ.బర్ధన్ స్ఫూర్తితో పజా ఉద్యమాలు నిర్మిద్దాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏబీ.బర్ధన్ స్ఫూర్తితో శక్తివంతమైన ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ సూచించారు.కామ్రేడ్ ఏబీ.బర్ధన్ శత జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆయన కటౌట్ ను ఏర్పాటు చేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ ఏబీ.వర్ధన్ తన జీవితాన్ని మొత్తం ప్రజల కోసం త్యాగం చేశారని, విద్యార్థి ఉద్యమం నుంచి తన ప్రస్థానాన్ని మొదలు ఎట్టి స్వతంత్రంగా ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు.బహుభాషా కోవిదుడు, మేధావిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు.పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం రాజీలేని పోరాటాలను నిర్వహించిన ఘనత కామ్రేడ్ బర్ధన్ కే దక్కుతుందన్నారు.ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తున్న బర్ధన్‌ను సంవత్సరాల తరబడి జైలులో పెట్టారని గుర్తు చేశారు.తీవ్రమైన నిర్బంధాల మధ్య అజ్ఞాతవాసం గడిపారని, నేడు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వర్గ, రైతు వ్యతిరేక విధానాలపై ఆయన స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలను చేయాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు.కామ్రేడ్ బర్ధన్ ఈ దేశంలో కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక దోపిడిని ఎత్తిచూపుతూ కులం, వర్గం, సామాజిక న్యాయం వంటి అనేక సమస్యలపై విశ్లేషణతో కూడిన రచనలు చేసి ప్రజలను చైతన్యం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సిపిఐ సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, కాంపల్లి శ్రీనివాస్, నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, జంగయ్య, బాలకృష్ణ, మహమూద్, చైతన్య, బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, కళ్యాణ్, అనిల్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజలకు అసౌకర్యం కలగకుండా పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని నూతన సెవరేజి పైప్ లైన్ పనులను శనివారం జలమండలి డ్యూపిటీ జనరల్ మేనేజర్ కార్తీక్ రెడ్డి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్‌తో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పండుగల నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా డ్రయినేజీ పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన పైప్ లైన్ ఏర్పాటు ప్రక్రియలు పలుచోట్ల మంచినీటి డ్రయినేజీ పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు మరమ్మతులు చేయాలని అధికా రులను కోరారు. నాయకులు శ్రీకాంత్ , ఉమేష్ గారు, ఆనం ద్ రావు,సాయి కుమార్, జ్ఞానేశ్వర్ గౌతమి స్కూల్ ప్రిన్సిపాల్ గోపాల కృష్ణ,బస్తి వాసులు కృష్ణ నేత,వజ్రేశ్వర్, పెంటయ్య యాదవ్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత్రి విజయభారతి కన్నుమూత

- గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్న మృతదేహం

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రముఖ రచయిత్రి, బొజ్జ తారకం సతీమణి విజయ భారతి అనారోగ్యంతో కన్నుమూశారు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు సనత్‌నగర్‌లోని రెనోవా ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో శనివారం తుది శ్వాస విడిచారు. విజయ భారతి భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధన కోసం అప్పగిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం నేడు జరగనుంది. కవి రచయిత బోయి భీమన్న కుమార్తెని బోయి విజయభారతి అంబేద్కర్ జ్యోతిబాపూలేను ఆమె అధ్యయనం చేశారు. ఆ ప్రభావంతోనే భారతీయ కుల వ్యవస్థ, స్వరూప స్వభావాల గురించి పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా విశ్లేషణలు. సాహిత్య, సామా జిక అధ్యయనశీలిగా అనేక రచనలు చేశారు. అంబేద్కర్ జీవిత చరిత్రను సమగ్రరీతిలో రాశారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన ఈ గ్రంథం పలు ముద్రణలు పొందింది. అలాగే పురాణాల్లో దళిత స్త్రీ పాత్రల గురించి అనేక రచనలు చేశారు. వీరి వ్యాస సంకలనం '75 ఏళ్ల స్వతంత్ర భారతం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా శీర్షికతో ఇటీవల వెలువడింది. తన ఆత్మకథను కూడా రాతప్రతిగా సిద్ధంచేశారు. ఇది ప్రచురణ కావాల్సి ఉంది.



నృత్య కళాకారిణీలకు చేయూత

● అవని వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



శ్రీ నృత్య అకాడమీ వ్యవస్థాపకులు ప్రత్యూష శిల్పారామంలో నిర్వహించిన.. కూచిపూడి నృత్య కళా ప్రదర్శనకు, అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్, ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి కళాకారినిలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలలో ఆసక్తి కలిగిన, కళాకారులకు తమ వంతు చేయూత ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

బతుకమ్మ కుంటలను పరిశుభ్రం చేయాలి

● కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బతుకమ్మ ఆడే మహిళలకు అసౌకర్యాలు కలగకుండా బతుకమ్మ కుంటలు పరిశుభ్రంగా చేయాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం డివిజన్ పరి పరిధి సోమయ్యనగర్, కూన మహాలక్ష్మీ నగర్ ప్రాంతాలలోని బతుకమ్మ కుంటలను అధికారులు ఆయా ప్రాంత నేతలతో కలిసి పనులను పరిశీలించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఆయా ప్రాంత వాసులు పాల్గొన్నారు.

నూతన మండలాల్లో ఎంఈఓ కార్యాలయాలు..







నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాలకు చెందిన మండల విద్యాధికారులు జెమిని, కృష్ణ, రామకృష్ణలు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ని కలిశారు. నూతనంగా ఏర్పడిన దుండిగల్, బాచుపల్లి మండలాలకు ఎంఈఓ కార్యాలయాల భవ నాలు నిర్మించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల లో పారిశుద్ధ నిర్వహణ, వాచ్‌మెన్ ఏర్పాటు, వాచ్‌మెన్ రూమ్‌ల నిర్మాణం, మంచినీటి సదుపాయాల వంటి పలు సమస్యలను విన్నవించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండలాలలో మండల విద్యాధికారి కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో వాచ్ మెన్ రూము, మంచినీటి సరఫరా, పారిశుద్ధ నిర్వహణకు కావలసిన అన్ని చర్యలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రమేష్, పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయునిలుపాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎమ్మెల్యే

ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. అభివృద్ధి పనులపై ప్రజలకు ఇబ్బంది కలుగకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేయాలనీ అధికారులు సూచించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం సమావేశంలో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో నిర్మాణ దశలో ఉన్న పనులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేయవద్దని తరలించడంలో శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అన్ని చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఓపెన్ జిమ్‌లను సక్రమంగా నిర్వహించాలి. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఇప్పటికే ఉన్న ఓపెన్ జిమ్, పార్కులను సక్రమంగా నిర్వహించడంతో పాటు నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలి. అదేవిధంగా పార్కుల్లో అవసరానికి అనుగుణంగా.. ఒకటి లేదా రెండు హై మాస్ లైట్లను ఏర్పాటు చేయడం.. ఉచిత మంజీరా నీటి కనెక్షన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

కాలనీలలో ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తిచేయాలి..

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కాలనీలలో తవ్విన సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను తాత్సారం చేయకుండా వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ఈ సమీక్ష సమావేశంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, కమిషనర్ డి.సౌజన్య, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి : ఎమ్మెల్యే

దుండిగల్ : బాచుపల్లి ఫ్లై ఓవర్ పనుల వెంటనే పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి అని స్థానిక కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. అనంతరం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాచుపల్లి ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి చౌరస్తా వద్ద సుమారు రూ.146 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాచుపల్లి - మియాపూర్ ఫ్లై ఓవర్, బాచుపల్లి - మల్లంపేట్ - భౌరంపేట్ రోడ్డు నిర్మాణ పనులతో పాటు సుమారు 135 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న మియాపూర్-బాచుపల్లి - గండిమైసమ్మ రోడ్డు విస్తరణ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాచుపల్లి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు, బాచుపల్లి - మల్లంపేట్ - భౌరంపేట్ రోడ్డు నిర్మాణ పనులు, మియాపూర్ - బాచుపల్లి -గండిమైసమ్మ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తయితే మియాపూర్ - గండిమైసమ్మ రహదారిలో వెళ్లే వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు పరిసర ప్రాంతలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. అదేవిధంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు అవాంతరంగా ఉన్న కరెంట్ పోల్స్‌ను యుద్ధప్రాతిపదికన షిఫ్టింగ్ చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, హెచ్ఎండిఏ ఎస్.ఈ హుస్సేన్, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ డి.సౌజన్య వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలశనాయుడుకు ఐకాన్-2024 అవార్డు





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచంలోని అతి చిన్న వయస్కురాలైన సోషల్ వర్కర్ హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ కలశనాయుడు ఇప్పుడు ఆసియా ఐకాన్‌గా మారారు. సోషల్ సర్వీస్ రంగంలో కలశనాయుడు చేస్తున్న సేవలకుగాను ఆ చిన్నారిని ఆసియా ఐకాన్ అవార్డు-2024 వరించింది. శ్రీలంక రాజధాని కొలంబోలో ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన ఆసియా ఐకాన్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవంలో కలశనాయుడు అవార్డును స్వీకరించారు. కొలంబో గవర్నర్ సెంథిల్ చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారు. ఈ సందర్భంగా కలశనాయుడును వేదికపై ఉన్న ఆహుతులు ప్రశంసలతో ముంచెత్తారు. అతి చిన్న వయసులోనే అకుంఠిత సేవా భావంతో పని చేస్తున్న కలశనాయుడు నేటి తరానికి ఆదర్శమని అభినందించారు. అంతేకాదు 11 ఏండ్ల ఆ చిన్నారి సాధించిన విజయాలు, అవార్డులు, రివార్డుల గురించి తెలిసి ఆశ్చర్యపోయారు. ఐక్యరాజ్య సమితి కలశనాయుడును గ్లోబల్ యంగెస్ట్ సోషల్ వర్కర్ బిరుదుతో సత్కరించడం, సేవా రంగంలో ఆ చిన్నారి చేసిన సేవలకు గాను యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ పీస్ కౌన్సిల్ గౌరవ డాక్టరేట్‌తో సన్మానించడం ఆసియా ఖండానికే గర్వకారణమని పలువురు అన్నారు. తండ్రి స్థాపించిన కలశ ఫౌండేషన్ ఫౌండేషన్ ఆశయాలను ఐదేండ్లకే అర్థం చేసుకున్న చిన్నారి కలశనాయుడు తాను కూడా అందులో భాగమైంది. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను నూతన నాయుడు రాష్ట్ర స్థాయిలో నిర్వహించగా, ఆ స్ఫూర్తితో ఆ కార్యక్రమాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు కలశనాయుడు. ప్రస్తుతం కలశ ఫౌండేషన్ ద్వారా సుమారు 135 దేశాల్లో సేవా కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయి. స్థానిక స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల పరస్పర సహకారంతో కలశనాయుడు తన ఫౌండేషన్ కార్యకలాపాలను విస్తృతం చేస్తున్నారు. తల్లిదండ్రులు డాక్టర్ ప్రియానాయుడు, డాక్టర్ నూతన నాయుడు గైడ్‌లైన్స్‌తో కలశ ఫౌండేషన్ ద్వారా కలశ నాయుడు సమాజ సేవ చేస్తున్నారు.

భగత్ సింగ్ 117వ జయంతి ఉత్సవాలు



● సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పలు డివిజన్‌లో భగత్ సింగ్ 117వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. సర్వమత, సర్వజన, సమానత్వం భగత్ సింగ్ ఆశయమని సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి గోదా వెంకటేష్‌లు అన్నారు. షహీద్ భగత్ సింగ్ 117వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) ఆధ్వర్యంలో శనివారం జగద్గిరిగుట్ట డివిజన్,జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్, మఖ్దూమ్ నగర్, భగత్ సింగ్ మార్గ్‌లలో భగత్ సింగ్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ స్వతంత్ర సమరయోధుడని,తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెల్లదొరల గుండెల్లో రైళ్ల పరిగెత్తించిన యువ కిశోరం, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని అందించి మన దేశ యువతకు ఉద్యమ మార్గదర్శకుడు అయ్యాడన్నారు. భగత్ సింగ్ కన్న ఆశయాలను ఆశయాలకు అనుగుణంగా నడిచినపుడే నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత నేటి యువత పై ఉందని అందుకు కుల,మత రహిత, సమసమాజ స్థాపనకై అందరూ కదం తొక్కాలని పెట్టుబడిదారీ వ్యవస్థ అంతమై కష్టజీవుల రాజ్యస్థాపనకు భగత్ సింగ్ స్ఫూర్తిగా తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉజ్జిని హరినాథ్ రావు, సదానందం, సహదేవ రెడ్డి, రాములు, దొరవీ బాబు, సామ్యూల్, ముసలయ్య, ముత్తు, నర్సింహ, రత్నం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ సీపీఐ కార్యక్రమంలో శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె. మనోచారి ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి జి. కృష్ణ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్ గొప్ప స్వసంత్ర సమరయోదని, భారత దేశ స్వసంత్రం కోసం తన ప్రాణాలనే త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు దావీద్, రాజు గౌడ్, నారాయణ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ 118 లో భరత్ నగర్ కాలనీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి భగత్ సింగ్ జయంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ సెక్రెటరీ అశోక్ చారి, వాటర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



భారత స్వాతంత్రోద్యమంలో అత్యంత ప్రభావశీలి విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని.. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్‌లోని భగత్ సింగ్ విగ్రహనికి సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏఐటీయూసీ అధ్యక్షులు ఆశీ.యాదయ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు అని కోనియాడారు. భారత్‌లో బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ విప్లమాత్మక ఉద్యమాలను చేశారన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన క్రీడా ఉత్సవాలు



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఫార్మసీ కళాశాలలో గత రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ క్రీడా ఉత్సవాలలో రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల నుంచి జేఎన్‌టీయూ పరిధిలోని పలు ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ రకాలైన క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ బ్యాట్ మింటన్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైకిలింగ్ అథ్లెట్ శ్రీమతి వందన కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. క్రీడలలో చురుకుగా పాల్గొనే విద్యార్థులు తమ కెరీర్‌ను దృఢంగా కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఇష్టమైన క్రీడలను క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయలన్నారు. క్రీడలో నైపుణ్యం సాధించడానికి మెళకువలను నేర్చుకోవలన్నారు. విద్యారంగంలో కూడా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, క్రీడల ద్వారా మానసిక శరీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్, ప్రిన్సిపల్ డా.మురళీ ప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.అర్ణబ్ మలిక్ తదితరులు పాల్గొన్నారు.

'గైడ్ టు హెల్త్ అండ్ సైబర్ డిఫెన్స్'పై అతిథి ఉపన్యాసం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 'గైడ్ టు హెల్త్ అండ్ సైబర్ డిఫెన్స్'పై సీఎస్ఐ అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించింది. ఈ ఉపన్యాసానికి వక్తలుగా జీడిమెట్లకు చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఫిట్జీ కోచింగ్ ప్రయివేటు లిమిటెడ్‌లో కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్ కొలిపాక సౌమ్య హాజరయ్యారు. అలాగే ఎంఎల్ఆర్ఐటీకి చెందిన బాలికలలు ఈ ఉపన్యాసానికి హాజరయ్యారు. ఈ ఉపన్యాసంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ రోజు రోజుకూ ఆడపిల్లలు (స్త్రీలు) ఎదుర్కొంటున్న సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించగా, ఆడపిల్లలకు అండగా ఉన్న చట్టాలపై కొలిపాక సౌమ్య యువతుల కోసం కొన్ని ఆరోగ్య, డైట్ టిప్స్ ఇచ్చారు. సెషన్ పూర్తిగా ఇంటరాక్టివ్‌గా ఉంది. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస రావు, డాక్టర్ రాధికాదేవి, హెచ్ఓడీలు డాక్టర్ ఎ.బలరాం, డాక్టర్ కె.సాయి ప్రసాద్, డాక్టర్ ఎస్‌వీ.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఎం.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-దుండిగల్

గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే 2024 ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు ర్యాంప్ వాక్‌లతో కళాశాల ప్రాంగణమంతా అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టి.వి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పి.ఆర్.ఓ రవి సుధాకర్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో శాఖ మహాసభలు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలం ఓల్డ్ బోయిన్‌పల్లిలో సీపీఐ(ఎం) శాఖ మహాసభలు పార్టీ కార్యాలయంలో జరిగాయి. ఈ మహాసభకు ఏ. శ్రీధర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ శాఖ మహాసభకు జిల్లా కార్యదర్శి పి.సత్యం, బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌లు పాల్గొని శాఖ మహాసభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేయాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని అన్నారు. అదే విధంగా బీసీ గణను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఓల్డ్ బోయిన్‌పల్లిలో పార్టీ బలోపేతం కోసం పార్టీ సభ్యులు కృషి చేయాలని, డివిజన్ పరిధిలోని బస్తీలలో నెలకొన్న స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం భగత్ సింగ్ జయంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మహాసభలో పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా వి. వెంకట్ నర్సయ్య ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు శ్రీధర్, ఎస్. వెంకట్, జాన్ సిమ్మి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేలిన ఎలక్ట్రిక్ బైక్.. మెడికల్ షాప్ దగ్ధం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎలక్ట్రిక్ బైక్ పేలి మంటలు చెలరేగి... మెడికల్ షాప్‌కు వ్యాపించిన ఘటన.. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కుత్బుల్లాపూర్ సూరారం చౌరస్తాలోని ఆదిత్య మెడికల్ షాప్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. షాప్ ముందు బ్యాట్రీ బైక్ చార్జింగ్ పెట్టడంతో వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో షాపు అద్దాలు పగిలి పోయి లోపలికి మంటలు వ్యాపించాయి. పార్క్ చేసిన బైక్ మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు. ఈ సంఘటనలో ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తుంది.. ప్రధాన రహదారి కావడంతో మంటలు చెలరేగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదురుకున్నారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయా యి. షాప్‌లో మంటలు వ్యాపించడంతో గమనించిన షాప్ సిబ్బంది వెంటనే బయటకు పరుగులు పెట్టడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనలో ఆదిత్య మెడికల్ షాప్ మంటలు వ్యాపించడంతో పూర్తీగా దగ్ధం అయ్యింది.

రోడ్డు వెడల్పు పనులకు అధికారులు సహకరించాలి



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఐడియల్ కంపెనీ వారు రోడ్డు వెడల్పు చేయకుండా అడ్డుకుంటున్నారని సోమవారం వరకు ఐడియల్ అధికారులు రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కైతలాపూర్ నుంచి హైటెక్ సిటీ వెళ్లే రహదారి రోడ్డు విస్తరణ కోసం మట్టంవారి సహాయంతో జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలతో ప్రతిరోజు ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఐడియల్ కంపెనీ వాళ్ళు రోడ్డు విస్తరణ పనులను అడ్డుకుంటున్నారన్నారు. హైటెక్ సిటీ వెళ్లే రహదారిలో నిత్యం ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు విస్తరణ చేయాలని మట్టం వారి సహాయంతో 100 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. 100 ఫీట్ల రోడ్డును పనులు చేయడానికి గత ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. వెడల్పు చేయుటకై మఠం వారు జీహెచ్ఎంసీకి కావలసిన స్థలాన్ని ఇవ్వడానికి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ బాబురావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార విద్యపై అవగాహన





● పోస్టర్ మేళాలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో, శనివారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో, జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు మాట్లాడుతూ జిల్లాలో 73 ప్రభుత్వ ఉన్నత, ఎనిమిది ప్రైవేటు పాఠశాలలో కౌమార విద్యపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా కౌమార దశలో బాల బాలికలకు కలిగే శారీరక మానసిక, ఉద్వేగ పరమైన మార్పుల గురించి పూర్తి స్థాయి అవగాహన కల్పించ మన్నారు. హెచ్ఐవి, ఎస్టిఐ సంక్రమిత వ్యాధుల నివారణకు అవసరమైన, జీవన నైపుణ్యాలను పెంపొందించడం, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి, ఇతర ప్రమాదకర ప్రవర్తనలకి ఉన్న సంబంధాలను, లైంగిక వేధింపులు, భావవ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, కౌమారానికి సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్ మేళాలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి రమేష్ సంజీవ, మండల విద్యాధికారులు హరిశ్చందర్, కిషన్, భాగ్యమని, ఎస్సి.ఈ.ఆర్.టి ఫ్యాకల్టీ ఈ.డి మధుసూదన్ రెడ్డి , కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో జాషువాది ప్రత్యేకం



నవతెలంగాణ-ఓయూ

కులమత వివక్షకు, పేదరికానికి ఎదురీది తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేకత నిలుపుకున్న కవి గుర్రం జాషువా అని ప్రొఫెసర్ కాశీం అన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో ఓయూ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రాజీవ్ అధ్యక్షతన జరిగిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని జాషువా కవిత్వాన్ని గానం చేశారు. ఈ కార్యక్రమంలో గబ్బిలం కావ్య గానం చేసిన ప్రముఖ సినీ నటుడు,పద్య గాయకుడు మీసాల లక్ష్మణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఓయూ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా.విజయ లక్ష్మి, సహాయ ఆచార్యులు డా.రఘు పాల్గొని ప్రసంగించారు.

గొల్ల కొమురయ్య కాలనీలో పర్యటించిన కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

బన్సిలాల్‌పేట్ డివిజన్‌లోని కొత్త బోయిగూడలో గొల్ల కొమ్మురయ్య కాలనీలో కోట నీలిమ పర్యటించి పనులను పరిశీలించి అనంతరం సమీక్ష నిర్వహిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా కొనసాగుతున్న నీటి పొంగడం సమస్యతో ప్రతిరోజూ ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ 48 మీటర్ల దూరం మధ్య 4 కొత్త మ్యాన్‌హోల్స్ నిర్మించిందని, ఇది నీటి పొంగడం సమస్యను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని తెలిపారు. కాలనీ ప్రజలు, చాలా సంవత్సరాలుగా తమను వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించడంలో ఆమెకు కతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, జీఎల్ రమేశ్ , రాజశేఖర్ పండు గౌడ్, నారాయణ, అభిలాష్ నగరాజు, డాక్టర్ శివ లాల్, కాంతారావు , అయూబ్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభను జయప్రదం చేయండి



- ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ-ఓయూ

పీడీఎస్‌యూ పురుడుపోసుకుని 50 ఏండ్లు నిండుతున్న సందర్భంగా అక్టోబర్ 24న ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే అర్ధ శతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ 50 ఏండ్ల విద్యార్థి పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు. పీడీఎస్‌యూ పోరాటంతో అనేక చట్టాలు సైతం వచ్చాయన్నారు. ముఖ్యంగా 1975లో రమేజాబీ ఘటనపై పీడీఎస్‌యూ చేసిన పోరాటంతో మహిళలను అరెస్టు చేస్తే సాయంత్రం నాలుగు గంటల లోపు విడుదల చేయాలని చట్టం వచ్చిందన్నారు. విద్యా ప్రయివేటీకరణ కార్పొరేటీకరణకు ప్రయివేటు, కార్పొరేట్, విదేశీ విశ్వవిద్యాలయాలకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాడిందన్నారు. విద్యార్థుల సమస్యలకు వ్యతిరేకంగా వారి హక్కులను సాధించడం కోసం, ఎలాంటి అంతరాలు లేని సమ సమాజం కోసం సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యలో అశాస్త్రీయమైన భావజాలాన్ని నింపి విద్యార్థుల మహిళలను ఆలోచింపనివ్వకుండా చేస్తున్నదన్నారు. పీడీఎస్‌యూ సమాజంలో ఉన్న కుల,మత,ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంతరాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు.

ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ. సమాజానికి ఉపయోగపడే అనేకమంది టీచర్లను ప్రొఫెసర్లను లాయర్లను డాక్టర్స్ ను అందించిన ఘన చరిత్ర పీడీఎస్‌యూకు ఉందన్నారు. విద్యార్థి ఉద్యమం చీలికలకు గురై నిశ్శబ్దంగా ఉన్న సమయంలో రెండు పీ.డీ.ఎస్.యు సంస్థలు ఐక్యమై ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విప్లవ అభిమానులకు, విద్యార్థులకు, పీడీఎస్‌యూ పూర్వ నాయకులకు ఉత్సాహాన్ని ఇచ్చే విషయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈ. ఉపేందర్, డాక్టర్ దుబ్బా రంజిత్, అంకుష్ గ్రాఫిక్స్ చరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎం శ్రీనివాస్, ఏడి రాము, పీడీఎస్‌యూ ఉభయ సంస్థల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ.మహేష్,భోనగిరి మధు, పొడపంగి నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్, నవీన్, గౌతమ్, శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులను 'డబుల్' ఇండ్లకు తరలింపు

- ఆధార్ కార్డు వెరిఫై చేసి లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు
- స్వయం సహాయక బృందాల ద్వారా నిర్వాసితులకు రుణాలు అందజేస్తాం
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ పరవహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించే చర్యల్లో భాగంగా నిర్వాసితుల జీవనోపాధికి, పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయంలోనికి తరలిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం హిమాయత్ నగర్ మండలంలోని వినాయకవీధి , శంకర్ నగర్ లను స్థానిక శాసన సభ్యులు అహ్మద్ బలాలతో కలసి కలెక్టర్ సందర్శించారు. వినాయక వీధి(రసూల్ పుర), శంకర్ నగర్ రివర్ బెడ్ లో 151 కుటుంబాలను గుర్తించి వినాయక వీధి, శంకర్ నగర్ రెండు ప్రాంతాల నిర్వాసితులకు మలక్ పేట నియోజక వర్గం సైదాపూర్ మండలంలోని పిల్లిగుడిసెలు, అలాగే జియా గూడ లోని రెండుపడకల గృహాలకు తరలింపు ప్రక్రియ జరుగుతుందని, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హౌసింగ్ శాఖలు శనివారం వినాయక వీధి(రసూల్ పుర) లోని 100 కుటుంబాలను పిల్లి గుడిసెలు డబుల్ బెడ్ రూమ్ సముదాయంలోనికి తరలించినట్టు కలెక్టర్ అన్నారు.

మూసి పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వాసులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి నిర్వాసితులకు గౌరవప్రదమైన రెండు పడకల గదుల ఇండ్లను లాటరీ ద్వారా కేటాయించి ఇంటి పట్టా సర్టిఫికెట్లు, తాళం చెవులు అందచేయడం జరుగుతుందని స్పష్టం చేసారు. నిర్వాసితుల జీవనోపాధికి, పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల పిల్లల చదువుల కోసం సమీపంలోని ఎస్సి, బిసి, మైనార్టీ గురుకులాల్లో ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా వారికి వారికి స్వయం సహాయక సంఘాలలో రుణాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఎలాంటి అపోహలు నమ్మొద్దని ,బస్తీవాసులు స్వచ్ఛందంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తరలి వెళుతున్నారని అన్నారు.

మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ మూసి పరివాహక ప్రాంతలైన వినాయక వీధి (రసూల్ పూర), శంకర్ నగర్ వాసులు గత ఎన్నో ఏండ్లుగా మూసీ నది వరదలతో చాలా ఇబ్బందులు పడే వారిని అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడి ప్రజలు స్వచ్ఛందంగా, శాంతియుతంగా ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలకు తరలి వెళ్తున్నారని తెలిపారు. ఆర్డీఓ కె.మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హౌసింగౌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం అమలులో ముందున్న ఇఫ్లూ

- కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్



నవతెలంగాణ-ఓయూ

జాతీయ విద్యా విధానం అమలులో ఇఫ్లూ ముందు వరుసలో ఉందని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ అన్నారు. జాతీయ విద్యా విధానం 2020 సమర్థవంతమైన అమలుకు ఉన్న ప్రాధాన్యతను ప్రస్తావించారు. ఎన్ఈపీ 2020ను దాని మాతస్వరూపంలో అమలు చేయడం వల్ల వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధన లో ఉపయుక్తం గా ఉంటుందన్నారు. ఇఫ్లూ క్యాంపస్‌లో నిర్వహించిన "సఫాయి మిత్ర సురక్షా శివిర్" అనే సఫాయి మిత్రల గౌరవ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం కత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, సైంటిఫిక్ పబ్లిషింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో కోర్సులు అందించి, ప్రస్తుతం ఇఫ్లూ అందిస్తున్న ప్రోగ్రాంలతో వాటిని అనుసంధానించాలని సూచించారు. విశ్వవిద్యాలయం భవిష్యత్ రంగాలలో పరిశోధనను ప్రోత్సహించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు గా విద్యార్థులను తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు."మన విద్యా ప్రణాళికలు విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచడంపై దష్టి సారించాలి, ఇందుకోసం విశ్వవిద్యాలయాలు సరికొత్త పాఠ్యపద్ధతులను తీసుకురావాలి" అని మజుందార్ అన్నారు.

మంత్రి సఫాయి మిత్ర సురక్షా శివిర్‌ను ప్రారంభించి, విశ్వవిద్యాలయం క్రీడా సముదాయంలో 60 మంది సఫాయి మిత్రలకు శుభ్రత కిట్లను పంపిణీ చేశారు.స్వచ్ఛత హి సేవ 4.0 కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ కార్మికులను సన్మానించారు.విద్యార్థులు, సిబ్బంది తమ నిత్య జీవితంలో స్వచ్ఛతను పాటించి దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా మార్చాలని మంత్రి పిలుపునిచ్చారు."ఎక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయ ప్రాంగణం లో మొక్క ను నాటారు.

గ్రంథాలయంలోని రీడింగ్ రూం మంత్రి ప్రారంభించారు. ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ హరిబండి లక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొ. కె. నరసింహరావు,ఇఫ్లూ కార్య నిర్వాహక మండలి సభ్యులు, డీన్లు, విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మహిళల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.నాగలక్ష్మి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

దేశంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు తీవ్రతరమవుతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.నాగలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా జూబ్లీహిల్స్ జోన్ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. మహిళలకు ప్రమాదకర దేశాల జాబితాలోకి భారత దేశం వెళుతోందని, మహిళలపై అఘాయిత్యాలు ఇదే విధంగా కొనసాగితే మహిళల మనుగడ, ఉనికి ప్రమాదకరంగా మారుతొందని చెప్పారు. భేటీ బచావో అని చెప్పే బీజేపీ ప్రభుత్వ పెద్దలు అనేక సంఘటనలలో నేరగాళ్లకే మద్దతు ఇస్తున్నారని అయోధ్యలోని రామాలయం కాంప్లెక్స్‌లో యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన దోషులలో బీజేపీకి సంబంధించిన యువకుడు ఉండడంతో అతను మైనర్ అని చెప్పి శిక్షనుండి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి చర్యలతో మహిళలపై నేరాలు మరింత పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో 15 మంది తో ఐద్వా జూబ్లీహిల్స్ జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా విజయ వాణి, అధ్యక్ష కార్యదర్శులుగా టీ.సమాధానం, జే సువర్ణ, ఉపాధ్యక్షులుగా వెంకటమ్మ ,ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా తులసీబాయి, శ్యామల, అనూష, ట్రెజరర్ గా పద్మ పార్వతమ్మ, కమిటీ సభ్యులుగా సుగుణ, నాగమణి ,విజయ, లావణ్య, శైలజ, సునీత ఎన్నికయ్యారు.

'సామాన్యుల ఇండ్లు కూల్చడం సరికాదు'



నవతెలంగాణ-ఓయూ

హైడ్రా పేరు మీద సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరికాదని, వాళ్ళ ఇండ్లను కూల్చడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బడా బాబులను, ధనవంతులను, కాంట్రాక్టర్లను, రాజకీయ పలుకుబడి ఉన్న వారిని వదిలిపెట్టి కూలినాలీ చేసుకొని రూపాయి, రూపాయి కూడ పెట్టుకుని ఇల్లు కట్టుకున్న పేద, మధ్యతరగతి ప్రజల ఇల్లును కూల్చడం సరికాదన్నారు. నిజంగా ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధిలో ఉన్న లేఔట్లకు పర్మిషన్ ఇచ్చిన హెచ్ఎండీఏ అధికారులను, ఇంటి నిర్మాణాలకు అనుమతించిన అధికారులను వెంటనే అరెస్ట్ చేసి విచారణ జరిపి వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఇండియన్ నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన ఏఎస్‌డబ్ల్యూఏ విద్యార్థులు

నవతెలంగాణ - బంజారాహిల్స్

నగరంలోని(ఏఎస్‌డబ్ల్యూఏ ఫౌండేషన్ వారి చిన్నారుల లెర్నింగ్ సెంటర్) నుంచి ఐదుగురు విద్యార్థులు అక్టోబర్ 20న హైదరాబాద్‌లో జరిగే 15వ ఇండియన్ నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారనీ ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఛాంపియన్‌షిప్‌ల చీఫ్ ఇన్‌చార్జ్ పి.శ్రీనివాస్ రాజ్ తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తానే స్వయంగా షాద్‌నగర్‌కు వెళ్లి జ్ఞాపకశక్తిపై సెమినార్ నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశానని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారని, ఈ విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్‌లలో పోటీ పడి విజయం సాధించడంతో పాటు దేశానికి పతకాలు సాధించడంలో భాగస్వాములవుతారని తెలిపారు.ఎంపికైన ఈ ఐదుగురు విద్యార్థులకు చాంపియన్‌షిప్ రుసుమును సామాజిక బాధ్యతతో డా॥ఉమా శర్మ,ఎస్, నంజూదా, ఎం.శ్రీలక్ష్మిలు ఆర్థిక సహరం అందిస్తున్నరాని అన్నారు. జ్ఞాపకశక్తి ఆటల పోటీల్లో భాగంగా ప్రతిభ కనబరిచిన ఈ ఐదుగురు విద్యార్థులకూ తాము తమ ఆస్వ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్ రాజ్,హరితలు ఇండియన్ నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్ 2024కి ఎంపిక కావడం గర్వంగా ఉందని తెలిపారు.



దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మహంకాళి ఆలయ ఈవో మనోహర్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.

నవతెలంగాణ-బేగంపేట

యూనివర్సిటీలలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి.పద్మ శ్రీ



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీలలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి.పద్మ శ్రీ డిమాండ్ చేశారు. ఈ నెల 30న చలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని శనివారం ఓయూలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పద్మ శ్రీ మాట్లాడుతూ యూనివర్శిటీ లో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, లేబర్ కోడ్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూనివర్సి టీలలో గ్రాండ్స్ విడుదల చేయకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని, పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తు బడా కంపెనీలకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందన్నారు. కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం సెప్టెంబర్ 30న జరిగే దేశవ్యాప్త సమ్మెను యూని వర్సిటీలలో కూడా విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

ఓయూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయు ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. సంవత్సారాలు గడుస్తున్నా వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల,ప్రజా ,కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగుల కష్టార్జితమైన పీఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్ న్యాచురల్ ఫండ్ సంస్థలకు అప్పచెప్పుతున్నదని అన్నారు. తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి చేస్తున్నదని... కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాలలో దోపిడీకి హద్దే లేకుండా పోతున్నదని అన్నారు. సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్‌లతో బానిసత్వంలోకి నెట్టేటువంటి ప్రమాదం ఉందని అన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ఈ నెల 30న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని, బీజేపీ వ్యతిరేక విధానాలకు వ్యతరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీను, నాగరాజు, సహాయ కార్యదర్శులు శివ,యాదమ్మ, వీరేశం, సుధాకర్, అనిత ,ప్రవీణ్, అనురాధ, ప్రమీల, అనురాధ పాల్గొన్నారు.

కామన్ విద్యావిధానం కోసం ఉద్యమిద్దాం

- ఏఐఎస్ఎఫ్ ఓయూ



నవతెలంగాణ-ఓయూ

కామ్రేడ్ షాహిద్ భగత్ సింగ్ 117 వ జయంతిని ఏఐఎస్ఎఫ్ ఓయూ కమిటి ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్స్ కాలేజీ వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్ మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్ భారతదేశాన్ని బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి విముక్తి చేయడానికై ఉద్యమించి కేవలం రెండు పదుల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని సైతం ముద్దాడిన మహనీయుడన్నారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు సమాజంలో అంటరాని తనానికి,మూఢవిశ్వాసాలకు, అసమానతలకు కారణమైన మతాన్ని, దేవుడు అనే భావనను నిరసించి నాస్తికుడుగా మారాడని తెలిపారు. తాను జైలులో శిక్ష అనుభవించే సమయంలో కార్ల్ మార్క్స్, లెనిన్, ఎంగెల్స్, టాల్ స్టాయ్,మాక్సీం గోర్కీ రచనలను విస్తృతంగా అధ్యయనం చేసాడని, స్వాతంత్ర్యం పోరాటంలో భగత్ సింగ్ త్యాగం మరువలేనిదన్నారు. భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తి తో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పై ఉద్యమించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎన్ఈపీ-2020 రద్దు చేయాలని, ప్రభుత్వం విద్యను, ప్రభుత్వం యూనివర్సిటీలను కాపాడుకోవడం కోసం, విద్య కార్పోరేటికరణ,కాషాయికరణకు వ్యతిరేకంగా, దేశంలో అందరికీ సమాన విద్య కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఉప్పల్ ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఆరేకంటి భగత్,అశ్విన్, రాధాకృష్ణ,మధు, లింగస్వామి,సలీమ్, రాజు పాల్గొన్నారు.

ఎక్కువ కాలం జీవించాలంటే వాకింగ్ చేయాలి



- కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ కార్డియాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి
- కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రిలో వరల్డ్ హార్ట్ డే వేడుకలు

నవతెలంగాణ-బేగంపేట్

మనం ఎక్కువ కాలం జీవించాలంటే ఎక్కువ దూరం వాకింగ్ చేయాలని, ప్రతిరోజూ 30 నిమిషాల సాధారణ ఎక్సర్‌సైజ్‌తో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ ఒత్తిడి లేని జీవితం గడిపితే గుండె సంబంధ సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ కార్డియాలజీ హెచ్ఓడీ, కార్డియో థోరాసిక్ సర్జన్, సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. శనివారం కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో వరల్డ్ హార్ట్ డే వేడుకలు నిర్వహించడంతోపాటు డాక్టర్ శ్రీధర్ కస్తూరి రాసిన ఓసీటీ(వన్ పోర్టల్ వేవ్ దే కెన్ యాక్సిస్ ఏ టు జెడ్), ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులకు ఉపయోగపడే ప్రొసీజర్ లిటరేచర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్డియో వాస్కులర్ డిసీజ్ కారణంగా ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 20.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. చెడు ఆహారపు అలవాట్ల కారణంగా ఆరు మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరి జీవితంలో డైట్ కీలక పాత్ర పోషిస్తుందని, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలని సూచించారు. తరచూ హెల్త్ చెకప్ లు చేసుకోవడం ద్వారా గుండె జబ్బులను ముందుగానే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం వల్ల జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చని తెలిపారు.ఆరోగ్యంగా ఉండడానికి మంచి నిద్ర చాలా ముఖ్యమని స్మోకింగ్, ఆల్కహాల్ కు దూరంగా ఉండాలని సూచించారు. గైడెడ్ యాంజియో ప్లాస్టి ద్వారా 50 శాతం స్టంట్ త్రాంబోసిస్ తగ్గుతుందని, మళ్లీ వచ్చే అవకాశాలు తగ్గుతాయని, ఈ బుక్ ముఖ్యంగా ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టులకు ఉపయోగపడే విధంగా రాశానని తెలిపారు. ఎలా ప్రొసీజర్ చేయాలి, సైంటిఫిక్ లిటరేచర్ రక్తనాళాల్లో బ్లాక్ ఎలా ఉంది క్యాల్షియం లాక మరేదైనా ఎంత పొడవున ఉంది, ఎంత డయామీటర్, ఏ సైజు స్టంట్ వేయాలి స్టంట్ ఇంప్లాంట్ తర్వాత ఎక్స్పాండ్ అయ్యిందా లేదా అనే విషయాలను బుక్ ద్వారా తెలుసుకోవచ్చు.

అనంతరం ప్రపంచ హార్ట్ డే సందర్భంగా కేక్ కట్ చేసి కార్డియాలజీ విభాగంలో పనిచేసే సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ శైలేందర్ సింగ్, డాక్టర్ ఎస్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఆర్ రాజారాం, డాక్టర్ సందీప్ జనార్ధన్, కార్డియో థోరాసిక్ సర్జన్ నరసింగరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ డి లింగస్వామి, అసోసియేట్ కార్డియాలజిస్టులు డాక్టర్ ప్రణయ్, డాక్టర్ కావ్య, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ హిమాంచు భాటియాలను కిమ్స్ హాస్పిటల్ సీఓఓ సుధాకర్ జాదో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లతో పాటు జీఎం చందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-బేగంపేట్

ఎవరికి ఏ కష్టమొచ్చినా నేనున్నాను అంటూ అండగా నిలిచే మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మోండా మార్కెట్‌లో షాపులు కూలి నష్టపోయిన 6 టైలరింగ్ కుటుంబాలకు శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో రూ. 20 వేల చొప్పున వ్యక్తిగతంగా ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఈ నెల 24న మోండా మార్కెట్ లోని ఓల్డ్ జైల్ ఖానా గోడ కూలి పక్కనే ఉన్న టైలర్ షాపులపై పడటంతో 6 షాపులు కూలిపోవడం, అందులోని కుట్టు మిషన్ లు, దుస్తులు, ఇతర సామాగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే ఘటనాస్థలికి చేరుకొని బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని, ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయానికి బాధిత కుటుంబాలను ఆహ్వానించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల నుండి టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అనుకోని సంఘటన తో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ ఘటనలో షాపులలోని కుట్టు మిషన్ లు, ఇతర సామాగ్రి కాకుండా రానున్న, దసరా, దీపావళి పండుగల సందర్భంగా స్టిచ్చింగ్ కోసం కష్టమర్లు ఇచ్చిన దుస్తులు కూడా మట్టి శిథిలాల్లో కలిసిపోయాయని తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘటన జరిగిన రోజునే విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకెళ్ళడంతో రెవెన్యూ అధికారులు ప్రమాదస్థలికి చేరుకొని పంచనామా కూడా నిర్వహించారు. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, రాములు, మహేందర్, మహేష్, జయరాజ్, మేరు సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నియోజకవర్గంలోని స్థానికులకే ఇస్తారనికంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు శనివారం ఆయన మూడో వార్డు మడ్ఫోర్ట్ , గాంధీ నగర్ , శ్రీరామ్ నగర్ ప్రాంతలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంనగర్ ప్రజల కోరిక మేరకే పర్యటనకు వచ్చానని అన్నారు. కాగా శ్రీ రామ్ నగర్ , మారెడ్ పల్లి ,సిల్వర్ కాంపౌండ్ ,నారాయణ జోప్పిడి ప్రాంతలలో ఉన్న డబుల్ బెడ్ ఇండ్లు నియోజకవర్గ ప్రజలకు మాత్రమే వస్తాయి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికేతురాలకు ఇస్తుందని వస్తున్న పుకార్లను, ప్రజలు నమ్మొద్దని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రలు పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రజలు కూడా డబుల్ బెడ్ రూమ్ విషయంలో మధ్యవర్తులకి , ఏ రాజకీయ పార్టీ నాయకుడికి డబ్బులు ఇవ్వొద్దని చెప్పారు ప్రజలు నేరుగా ఆర్డీఓ, ఎంఆర్ఓను కలిసి దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముందుగానే ఆర్డీఓ, ఎంఆర్ఓల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. వారు స్వయంగా వచ్చి నిసహాయ స్థితిలో ఉన్న పేదలను ఎంపిక చేసి, ఎలాంటి ఒత్తులకు లొంగకుండా పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని తెలిపినట్టు లబ్దిదారులకు ఎమ్మెల్యే వివరించారు

బీజేపీకి ఆ హక్కు లేదు

- కార్పొరేటర్ విజయ రెడ్డి..



నవతెలంగాణ - బంజారాహిల్స్

స్వాతంత్ర సమరయోధులు దేశ స్వతంత్రం కోసం తన ప్రాణాలను అర్పించిన మహా యోధుడు భగత్ సింగ్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆ నైతిక హక్కు లేదని కార్పొరేటర్ విజయరెడ్డి అన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని పద్మావతి కాలనీలో గల భగత్ సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్య వర్గ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ మేడ్చల్ జిల్లా కోశాధికారిగా జంగిటి మల్లేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోశాధికారిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన జంగిటి మల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని ఈసీఎల్ భాస్కర్ రావు భవన్‌లో జరిగిన మూడో మహాసభలో నియమిస్తున్నట్టు ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా జంగిటి మల్లేష్ మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర, జిల్లా, కుత్బుల్లాపూర్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.



వరల్డ్ రేబీస్ ప్రివెన్షన్‌డే సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ వద్ద రేబిస్ వ్యాధి నివారణ చర్యల పై జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ బ్లూ క్రాస్ సంస్థ చైర్మెన్ అమల అక్కినేని, జీహెచ్ఎంసీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జంతు ప్రేమికులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై వీధి కుక్కలను చంపొద్దు వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రతి ఒక్కరూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. **-నవతెలంగాణ - బంజారాహిల్స్**

పేదలకు పునరావాసం కల్పించాకే

మూసీ ప్రక్షాళన చేపట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



నవతెలంగాణ - ధూల్‌పేట్

పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతనే మూసి సుందరీకరణ చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ. అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికై సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరావాసం కల్పించకుండా పేదల ఇళ్లను కూల్చివేస్తుంటే సీపీఐ(ఎం) పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసి ఇరువైపులా 50 మీటర్ల దూరం నుంచి ఉన్న ఇండ్లను కూల్చి వేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుల కారణంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆ నోటీసు చూసిన తర్వాత కొంతమంది హార్ట్ ఎటాక్‌తో ఆసుపత్రి పాలయ్యారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్లాన్ అని, ఆ ప్లాను మేము అమలు పరచాల్సి వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగు దేశం, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఈ మూడు పార్టీలే పరిపాలించాయన్నారు. ఈ పార్టీల ఆధ్వర్యంలోనే చెరువుల ఆక్రమణలైన, మూసి ఇరువైపులా స్థలాలైనా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు ఉంటే వాటిని వారి ఇష్టం వచ్చినట్టు చేసుకోండి అన్నారు. కానీ మురికి కాలువల చుట్టూ చిన్న చిన్న గుడిసెలు నిర్మించుకొని 40, 50 సంవత్సరాల నుంచి చాలీచాలని సంపాదనతో జీవితాలీడుస్తున్న పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దశాబ్దాల తరబడి ఇంత డబ్బు సమకూర్చి కొందరు గ్రామాలలో ఉన్న అర, ఒక ఎకరం భూములు అమ్ముకొని రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్న వారు చిన్న చిన్న స్థలాలు కొనుక్కొని గుడిసెలు వేసుకొని బతుకుతున్న వారికి అన్యాయం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తాము, ఇందిరమ్మ ఇల్లు ఇస్తాము, కట్టుకోవడానికి ఖర్చులు భరిస్తాము... అని చెప్తే ఇక్కడి నుంచి వాళ్ళు ఎటు వెళ్తారు? ఎక్కడ కట్టుకుంటారు? అన్నారు. ఇక్కడ స్థిరపడి జీవనం కొనసాగిస్తున్న వారు నగరం అవతలకి వెళ్లి ఎలా బతుకుతారని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నాణ్యత లేదని అవి ఎంత కాలం ఉంటాయో కూడా తెలియని పరిస్థితి ఉందని అన్నారు. అలాంటి ఇల్లు మాకు వద్దని మాకు ఇక్కడే మంచి భవనాలు కట్టించి మీరే వ్యాపారం చేసుకోండి అని అప్పజెప్తే అది అభివృద్ధి అవుతుంది కానీ లక్షల మందికి అన్యాయం చేసి వ్యాపార సంస్థలను నిర్మిస్తామంటే అది అభివృద్ధి ఎలా అవుతుందన్నారు. ఆ వ్యాపారమేంటో ఇక్కడి ప్రజల తోనే చేయించుకుంటే వారు బాగుపడతారని, మీ ఆధ్వర్యంలో నగరం అభివృద్ధి అవుతుంది అని సూచించారు. సీపీఐ(ఎం) పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి.విఠల్, ఎం.మీనా మాట్లాడుతూ.. హైదరాబాదులోని బహదూర్పుర, కార్వాన్, గోషామహల్, చార్మినార్ మలక్పేట్ అంబర్పేట్ నుండి ఉప్పల్ ఆవుతలి వరకు లక్షల కుటుంబాలు చిన్నచిన్న రేకుల ఇంళ్ళు వేసుకొని ఉన్నారని తెలిపారు. అక్కడ ఇండ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్లు ఇచ్చిన పేపర్లు ఉన్నాయని, కరెంట్ మీటర్లు ఉన్నాయని, వాటర్ సప్లై ఉన్నదని అప్పుడు ఈ బఫర్ జోన్ అన్న విషయం తెలియదా? అని ప్రశ్నించారు. ఆ ప్రభుత్వాలే ఇప్పుడు తిరిగి తీసుకుంటామంటే అది వారిగోతి వారే తవ్వుకోవడం అని అన్నారు. ఇక్కడున్న పేద ప్రజలకు పక్కా ఇల్లు కట్టించి వారికి పని కల్పించిన తర్వాతనే ఈ మూసీ నది సుందరీకరణ అయినా బఫర్ జోన్ అభివృద్ధి అయినా చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు లేనియెడల సీపీఐ(ఎం) పార్టీ ప్రజలను ఐక్యం చేసి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వారి సభ్యులు ఎల్ కోటయ్య, అబ్దుల్ సత్తార్, జంగయ్య, పద్మానగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు కె.నర్సిమ చారి, రాజు, సురేష్, గోవింద్ మూసి ఇరువైపులా కుటుంబాల ప్రజలు 150 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు.

యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలి



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆంగ్లేయులను గడగడ లాడించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం భగత్ సింగ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలో మహాదేవపురంలో హర్యజన్ సింగ్ ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. భగత్ సింగ్ ఒక వ్యక్తి కాదని శక్తి అని తెలిపారు ఆయన ఆశయ సాధన కోసం యావత్తు దేశ ప్రజలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండే రాజు, సంజు, పవన్, మరలింగ, ముఖేష్, బస్తీ నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడ జాగాలో.. కబ్జాదారులు పాగా..

- అధికారులకు ఫిర్యాదు చేసిన ఏఐటీయూసీ నేతలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజాపయోగకర పారిశ్రామిక వాడ జాగాలో.. కబ్జాదారులు పాగా వేస్తున్నారని.. ఏఐటీయూసీ నేతలు ఆరోపించారు. బాలానగర్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పేజ్ -2 గాంధీనగర్ పారిశ్రామిక వాడలో 400 చదరపు గజాల స్థలంలో ఉన్న ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ కూల్చిన.. స్థలము బోర్డులో ఉన్న కొందరు సభ్యులు మరి కొందరితో కుమ్మక్కై స్వాహ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, గతంలో కూడా పారిశ్రామిక వాడలో కార్మికుల ప్రయోజనార్థం మౌలిక సదు పాయాలు అయినటువంటి హాస్పిటల్, పార్క్‌కు వదిలిన 9.5 ఎకరాల స్థలంలో అప్పటి చైర్మెన్లు, బోర్డ్ సభ్యులు అందరు కలిసి ప్లాట్ నెంబర్ 114 నుంచి ప్లాట్ నెంబర్ 132, ఒక ప్రయివేటు కాలేజీ వారికి అప్పనంగా కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలో సుమారు 20,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, వంగాల శ్రీనివాస్,మండల ఏఐటీయూసీ అధ్యక్షులు వి.హరినాథరావులు బాలనగర్ సిఐటు చైర్మెన్, సంబంధిత అధికారులకు వివరిస్తూ 400 గజాల స్థలము అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కార్మికుల అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



మూసీ పరివాహక ప్రాంతాల బాధితులకు అండగా ఉంటా

- సీఎం అనాలోచిత నిర్ణయాలతో పేద ప్రజలు ఆగమవుతున్నారు
- ప్రభుత్వం పున:ఆలోచించుకోవాలి
-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

మూసి పరివాహక ప్రాంతాల ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ పేదల జీవితాలతో చలగాట మాడుతున్నాడని విమర్శించారు. శనివారం గోల్నాక డివిజన్ మూసీ పరివాహక ప్రాంతం తులసీరాంనగర్ లంకలో అక్కడి నివాసితులతో ఆయన మాట్లాడారు. అంబర్‌పేట మూసీ పరివాహక ప్రాంతాల నివాసితులు తమ ఇండ్లను హైడ్రా కూల్చుతారని భయాందోళనకు గురి కావద్దని సూచించారు. బుల్డోజర్ కన్నా ముందే మేముంటామని ఆయన భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ హైడ్రా బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని ఆయన గుర్తు చేశారు. నగరంలో హైడ్రా తమ ఇండ్లను కూల్చుతుందేమోనన్న భయంతో కొందరు గుండె పోటుకు గురై దవాఖానాల్లో చికిత్స పొందుతుండగా మరి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ప్రస్తుత మార్కెట్ విలువకు రెండింతలు చెల్లించడంతో పాటు వారితో సువివరంగా అధికారులు చర్చించి వారి ఆమోదం తర్వాతే ఇండ్ల జోలికి రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ విధమైన కార్యాచరణ లేకుండా పేదల ఇండ్లకు మార్కింగ్ వేసి తొంతర పాటు నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. హైడ్రా బాధితులు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని తాము రక్షణ కవచంలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, ఉమాదేవి, కాలేరు రామకృష్ణ, సంతోష్, కాలేదు, సుమతి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా నిర్ణయం మంచిదే

కాంగ్రెస్ నగర నాయకులు చేగురి రఘు



నవతెలంగాణ-అంబర్‌పేట

హైడ్రా నిర్ణయం భవిష్యత్ తరాలకు మంచిదే కానీ బడుగు బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయంగా వారికి అన్ని విధాలు ఆదుకొని పునారవాసం కల్పించిన తర్వాత కూల్చివేతలు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు చేగురి రఘు హైడ్రాకు సూచించారు.

అప్పీలు నోటీసు
ఒంగోలు ఫ్యామిలీ జిల్లా జడ్జి వారి కోర్టులో
OS NO 56/2024

మధుర హరిచరణి ...అప్పిలెంట్
వర్సెస్
కె.రాఘువేంద్రరావు, వగయిరా ...రెస్పాండెంట్లు

To,
R1 : కె.రాఘువేంద్రరావు, తండ్రి (లేటు) హరిబాబు, ప్లాటు నెం.738/ఎ, సిరి బాలాజీ టవర్స్ , Near by Vestex, నిజాంపేట రోడ్, హైదరాబాద్, తెలంగాణ స్టేట్.
R2 : కె.నాగార్జున, తండ్రి (లేటు) హరిబాబు, ప్లాటు నెం.207, అవంతినగర్, మోతీనగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్, తెలంగాణ స్టేట్.
R3 : బెజవాడ క్రిష్ణవేణి, భర్త గోపిచంద్, ప్లాటు నెం.303, వైష్ణవి ఎన్ క్లేవ్, శాంతినగర్, మదీనాగూడ, హైదరాబాద్, తెలంగాణ స్టేట్.

పై తెలిపిన కోర్టువారి ఎదుట పై తెలిపిన అప్పిలెంట్, పై తెలిపిన నంబరు అప్పీలులో తనకు రావలసిన ఆస్తిలో భాగపంపిణీ కోరుచూ అద్దంకి సీనియర్ సివిల్ కోర్టు వారి దావా ఓ.యస్.1/2017 నంబరులోని తేది 08.04.2024 తీర్పును Set Aside చేయించమని దాఖలు చేయగా, సదరు అప్పీలు మీ నోటీసు నిమిత్తం పై తెలిపిన కోర్టువారి యెదుట తేది 17.10.2024కి వాయిదా అయివున్నది. ఇందు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణలు వున్ననూ పై తెలిపిన కోర్టువారి యెదుట తేది 17.10.2024న ఉదయం 10:30 ని॥లకు హాజరుపడి మనవి చేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముందు అప్పీలును తీర్మానం చెదరు అని తెలియజేయుచున్నాము.

// కోర్టువారి ఉత్తర్వులతో //
ఒంగోలు,
20-09-2024.

ఇట్లు
మొలకలపల్లి అజయ్ బాబు,
గుంటూరు రామమూర్తి,
అప్పిలెంట్ తరపు న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT JUDGE VIKARABAD DISTRICT : AT : VIKARABAD
A.S.NO. 14 OF 2021

Between :-
Kerelly Gopal Reddy & others ...Appellants
AND
Buchi Reddy Sumathi @ Suvarna & others ....Respondents

NOTICE

To,
Nadikudi Laxmi Bai W/o. Jaya Shaker, Aged about : 45 Yrs, Occ: House wife, R/o. H.No.12-1-645/1, Asif Nagar, Hyd. .....Respondent No.13

The appellants here in have filed the above appeal being aggrieved by the Judgment and decree dt. 28-02-2020 passed in O.S.No.25/2006 on the file of the Senior Civil Judge, at Vikarabad which suit was decreed in favour of the respondents/plaintiffs with regard to the suit schedule property. The Hon'ble court was pleased to order for substitute service for respodent No.13 and case is posted the matter on 15-10-2024.

Hence, you are requested to appear before the above said Hon'ble Court at 10.30 a.m. on the said date either personally or through your authorized counsel, for submitting your claim or otherwise the matter will be adjudicated as per law.
Hence, this notice

//BY ORDER OF THE COURT//
A. MAHESH KUMAR
B. RAMU GOUD
Advocates
Hyderabad

IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURTS, AT: HYDERABAD.
O.S.NO. 2157 OF 2023

BETWEEN:
STATE BANK OF INDIA ... PLAINTIFF
AND
G.RAJU SHOBHA ... DEFENDANT

To,
G.RAJU SHOBHA W/o.Late Gugloth Raju Naik, Occ:Not Know to Plantiff, Age about 43 Years, R/o. 5-6-217, Nehru Nagar, RodaMestri Nagar,Near Bombay Hotel, IDA Jeedimetla, Gajula ramaram,Quthbullapur, Medchal-Malkajgiri District-500055.

NOTICE

Please take notice that the Plaintiff had filed the above suit for Recovery for Money against you. The Hon'ble Court had posted the above suit on 03.10.2024 for your appearance. Hence make it convenient to appear before the Hon'ble Court on 03.10.2024 at 10:30 a.m either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.

[BY ORDER OF THE COURT]
VEERA SHIVA KUMAR
ADVOCATE
Off: # Flat No.104, 1 st Floor, Agarwal Towers, H.No.2-3-703/2/A,Thirumala Nagar, Amberpet, Hyderabad-500013, Mob.No: 9154450333

LOST OF DOCUMENTS

I, Lawrence A Pereira S/o. D.S. Pereira R/o.H.No.10-1-508, Balaram Buildings, West Marredpally, Secunderabad – 500026, TG, have lost two Original Link Two Registered Sale Deed Document Bearing **No.3296/1992, Dated: 20-03-1992,** Regd at SRO Hayathnagar and another Document bearing **No.7441/1992, Dated: 02-07-1992,** Regd at SRO Hayathnagar, while I went to make Xerox copy the same nearby my residence. If anybody found please call 9030448179, 7207073424

CHANGE OF NAME

I, **BEKKERA RAJESHWARI W/o. ETTIKALA SRIDHAR** aged about 41years R/o.8-51/3/12/1, Dwaraka Nagar,Uppal ,Hyderabad 39, Telangana,India,do hereby declare that my son name has corrected from **SRI RAM ETTIKALA To ETTIKALA SRIRAM** and my name from **RAJESHWARI ETTIKA LA to BEKKERA RAJESHWARI** and my husband name from **SRIDHAR ETTIKALA To ETTIKALA SRIDHAR**

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
O.S.NO.577 OF 2022

Between:
Smt.B.Veena K.Rama Devi ...Plaintiffs
AND
Sri.K.Satyanarayana and others ...Defendants

To,
D5.Smt.K.Laxmi Narasamma W/o K.Narasimha D/o Late K.Lakshmaiah Aged about 38 yrs, Occ: Housewife R/o H.No.12-10-4 10/3, Sethapal Mandi Secunderabad.
D7.N.Janardhan Rao S/o Not known to the plaintiff Aged about 45 years, Occ: Business R/o Plot No. 106, Moti Nagar Hyderabad.
D8.T.Chandrasekhar, S/o. Jagannadham, Aged about 40yrs, Occ: Prop. SB Interior & Office systems D.No.4-7-41/4, Bapuji Nagar, Opp. HDFC Bank Nacharam, Hyderabad-500 076.
D9.J.Mohan Raj, S/o.Not known to the plaintiff Aged Aged about 36yrs, Occ:Mechanic, Sri Durga Motors, All Bike service, D.No.7-41/4, Bapuji Nagar, Near HMT Nagar,Hyderabad-500076.

NOTICE

Please take notice that the above named Plaintiff has filed the above said Suit and you were arrayed as Defendants No.5, 7 to 9 in the above said Suit and that the said Suit is posted **on 21.10.2024.** Hence, you are hereby directed to appear before the above said Hon'ble Court **on 21-10-2024 at 10.30 A.M** either in person or through your advocate failing which the matter will be decided in your absence on the material available on record before the Hon'ble Court.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s.Suresh Shiv Sagar, Advocate,
(Off: 5-9-58, Gupta Estates, Ground Floor, Basheer Bagh 'X' Roads, Hyderabad.)

IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT. AT: L.B. NAGAR
AS NO. 159 OF 2023

BETWEEN
SMT.V.LAXMI KUMARI ...APPELLANT
AND
SMT. E.VASANTHA ...RESPONDENT

To,
SMT. E.VASANTHA, W/O. SANTOSH KUMAR, AGED 50 YEARS, OCC: HOUSEWIFE R/O.H.NO.C-16, SBI COONY, GADDIANNARAM, RANGA REDDY DISTRICT. (RESPONDENT)

Sir,
Whereas the Appellant have filed the above Appeal filed under Order 43 Rule 1 R/W Section 96 of C.P.C against the Judgment and Decree passed in OS 122 of 2021 on the file of Hon'ble IV Addl. Junior Civil Judge, Ranga Reddy District, at LB Nagar. The Hon'ble Court posted the matter on 03-10- 2024 at 10-30 AM for your appearance.
Therefore, you are requested to appear before the Hon'ble IV Additional District Judge, Ranga Reddy District, L.B.Nagar on 03-10-2024 at 10-30 a.m. either in person or through Counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

(" BY ORDER OF THE COURT")
(V.RANGA REDDY)
ADVOCATE
COUNSEL FOR THE APPELLANT
H.No.11-8-148 (Plot No.33 & 34) Vikas Nagar, Saroomagar, Hyderabad-500 035.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT. AT: L.B. NAGAR
O.S.NO. 649 OF 2019

BETWEEN:
ADI NARASIMHA NAGAR OWNERS OWNER WELFARE SOCIETY, REP BY ITS PRESIDENT ...PLAINTIFF
AND
RUDRANKI RAJAPPA AND OTHERS ...DEFENDANTS

TO
1. AUKULA CHANDRA MOULI S/O VEERAPPA AGED 67 YEARS, OCC:RETD HEAD MASTER, R/O. H.NO. 3-62, KANDUKUR VILLAGE AND MANDAL RANGA REDDY DISTRICT. (DEFENDANT NO.2)
2. VEMULA VENKATA KUTUMBA RAO, S/O.V.NARSAIAH, AGED 36 YEARS, OCC: BUSINESS, R/O, GURAJALA VILLAGE, AND MANDAL, RANGA REDDY DISTRICT. (DEFENDANT NO.4)
3. THOTA CHANDRA SEKHAR, S/O. CHAKRAPANI, AGED 37 YEARS, OCC: BUSINESS, R/O.6TH WARD, AVANIGUDDA VILLAGE, NEAR WATER TANK, KRISHNA DISTRICT. (DEFENDANT NO.5)
4. THOTA RAMA KRISHNA PRASAD S/O THOTA CHAKRAPANI AGED ABOUT 51 YEARS, OCC. SOFDTWARE ENGINEER R/O FLAT NO. 301, SATYA SAI RESIDENCY, OPP. CHIREC PUBLIC SCHOOL, KONDAPUR, HYD. (DEFENDANT NO.7)
5. SMT THOTA SUSHMA W/O THOTA SYAMA KUMAR, AGED ABOUT 36 YEARS, OCC SOFDT WARE ENGINEER R/O FLAT NO. 301, SATYA SAI REESIDENCY, OPP. CHIREC PUBLCI SCHOOL, KONDAPUR, HYDERABAD. (DEFENDANT NO.8)
6. CHATLA SHARADA W/O CHATLA JAGADISHWAR, AGED 50 YEARS OCC. HOUSE WIFVE R/O VENKAT REDDY NAGAR, RAMANTHAPUR, R.R. DISTRICT (DEFENDANT NO.10)
7. RUDRANKI SHIVAMALA W/O LATE RUDRANKI KUMAR AGED ABOUT 51 YEARS, OCC. HOUSE WIFE R/O 15-5-282, OSMANGUNJ, GOWLIGUDA, HYDERABAD (DEFENDANT NO.11)
8. SMT R. NAVANEETHA ALIAS D. DARSINI W/O VIJAY KUMAR AGED ABOUT 29 YEARS, OCC. HOUSE WIFE R/O 4-9-53/A, RAM NAGAR, MAHABUBNJAGAR MANDAL MAHABUBNAGAR DISTRICT. (DEFENDANT NO.12)
9. SMT R. PRAVALIKA ALIAS SWAROOPA VARANASI, W/O VIJAY VARABASIM AGED AVIYTG 30 YEARS, OCC. HOUSE WIFE R/O 2-2-1103/4, VENKATESHWARA NAGAR, GOLNAKA ROAD TILAK NAGAR, NEW NALLAKUNTA, HYD. (DEFENDANT NO.13)
10.R.PRATHYUSHA W/o PRASAD AGED ABOUT 25 YEARS, OCC TEACHER, R/O 16-6-620, OSMANPURA, CHADER GHAT, HYD. (DEFENDANT NO.14)
11. MOUNIKA D/O R. KUMAR, AGED ABOUT 18 YEARS, OCC: PVT EMPLOYEE R/O 15-5-282, OSMANGUNJ, GOWLIIGUDA, HYD.(DEFENDANT NO.16)
12. RUDRANKI KOTAPPA S/O LATE LRUDRANKI BUCHAPPOA AGED ABOUT 45 YEARS, OCC AGRICULTURE, R/O 15-4-323, OSMANGUNJ, HYDERABAD. (DEFENDANT NO.17)
13. SMT RUDRANKI LALITHA W/O RUDRANKI KOTAPPA AGED ABOUT 44 YEARS, OCC HOUSE WIFE R/O 15-4-323 OSMANGUNJ,HYD. (DEFENDANT NO.18)
14. RUDRANKI SHIVA LINGAM S/O RUDRANKI KOTAPPA AGED ABOUT 24 YEARS, OCC PVT EMPLOYEE R/O 15-4-323, OSMANGUNJ, HYDERABAD. (DEFENDANT NO.19)
15. RUDRANKI SANTOSH S/O R. KOTAPPA AGED ABOUT 22 YEARS, OCC PVT EMPLOL YEE R/O 15-4-323, OSMANGUNJ, HYD. (DEFENDANT NO.20)
16. SMT RUDRANKI LAVANYA D/O RUDRANKI KOTTAPPA AGED ABOUT 20 YEARS, OCC STUDENT R/O 15-4-323, OSMANGUNJ,HYD. (DEFENDANT NO.21)
17. RUDRANKI MANEMMA ALIAS MOMULA MANEMMA W/O LATE RUDRANKI BUCHAPPA AGED ABOUT 65 YEARS, OCC HOUSE WIFE R/O 16-2-146/13/A, MALAKPET, HYD. (DEFENDANT NO.22)
18. SMT MOMULA SUJATHA W/O MOMULA CHANDRA SHAKER D/O LATE RUDRANKI BUCHAPPA, AGED ABAOUT 41 YEWARS, OCC HOUSE WIFE, R/O 16-2-146/13/A, MALAKPET, HYD. (DEFENDANT NO.23)

SIR,
Whereas the Plaintiff has filed the above suit for Declaration and Perpetual Injunction against the Defendants in respect of suit schedule property described hereunder. The Hon'ble Court posted the matter on 24-10-2024 at 10-30 AM for your appearance.
Therefore, you are requested to appear before the Hon'ble V Additional District Judge, Ranga Reddy District, at L.B.Nagar on 24-10-2024 at 10-30 a.m. either in person or through Counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

SCHEDULE PROPERTY

All that the Plots and open areas total admeasuring 14-33 gts in Survey No. 203, 204, 207, 208 & 209 of Mangalpally Village, Ibrahimpatnam Mandal, Ranga Reddy District. And bounded by:
NORTH : PART OF VENTURE A.N. NAGAR.**SOUTH:** PART OF VENTURE A.N. NAGAR.**EAST :** PART OF VENTURE A.N. NAGAR **WEST :** PART OF VENTURE A.N. NAGAR

(" BY ORDER OF THE COURT")
(V.RANGA REDDY)
ADVOCATE
(COUNSEL FOR THE PLAINTIFF)
H.No.11-8-148 (Plot No.33 & 34) Vikas Nagar, Saroomagar, Hyd-35.

ఒంగోలు ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో
FCOP 19/2024

ఈదర వీల్ మణి .. పిటీషనరు
వర్సెస్
దోలా అనిల్ హేమంత్ కుమార్ ... రెస్పాండెంట్

To.
దోలా అనిల్ హేమంత్ కుమార్ S/o అంజనేయులు C/o అవని సైట్, తులసీ వనం అపార్ట్ మెంటు పక్కన, ఎల్లమ్మ బండ - హైదరాబాద్- 500072 తెలంగాణ స్టేట్

పై తెలిపిన కోర్టు వారి ఎదుట పై తెలిపిన పిటీషనరు పై తెలిపిన నంబరు కేసులో పిటీషనరు కు మరియు పై రెస్పాండెంట్ అయిన మీతో తేది 28.02.2011న జరిగిన వివాహం ను రద్దు పరపించుచూ విడాకులు ఇప్పించమని కోరుచు పిటీషను దాఖలు చేసుకొనియుండగా మీ నోటీసు నిమిత్తం తేది 18.10-2024కి వాయిదా అయిఉన్నది. ఇందు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణలున్ననూ పై తెలిపిన కోర్టు వారి ఎదుట తేది 18.10.2024 న ఉదయం 10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మనవి చేసు కొనవలసినది. లేని యెడల మీ పరోక్ష మందు పై కేసును విచారించి తీర్మానించెదరని తెలియజేయడమైనది

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు
గల్లా గాంధీ
పిటీషనరు తరపు న్యాయవాది
ఒంగోలు. ప్రకాశం జిల్లా
సెల్ నెంబర్ 9948736955.

SUMMON NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/MNL/NLG/No. 204 Of 2024

Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT.LTD. Choutuppal Branch, Represented by its Legal Officer Sri M.Narsimha Raju, S/o. Pichaiah, R/o.Nalgonda town and District. ...Plaintiff/Disputant/Petitioner,
AND
1.Geddam Srinivas , S/o.Abbulu, Age about 45 yrs, Occ:Pvt. Emplyoee, R/o.H.No.2-20-158 , Chiluka Nagar,Uppal,Hyd-500039.
2.Gundiga Balaswamy ,S/o. Prakasham , Age about 42 yrs, Occ:Pvt.Emplyoee, R/o.H.No.2-3-72/12,ST Joseph Colony, Ghatkesar,R.R, Hyd-501301.
3.Dharnaboina Vivek, S/o.Madan, Age about 30yrs, Occ:Pvt. Emplyoee, R/o.H.No.562-7/1, Antharam,Bibinagar, Venkiryala ,Nalgonda District-508116.
4.Vemula Shyam Goud , S/o. Yadagiri , Age about 32yrs, Occ: Pvt.Emplyoee , R/o.H.No.4-120/3, Shanth Nagar,Ghatkesar,Ranga Reddy ,Hyderabad-501301.
5.Aily Upender, S/o.Yadagiri,Age about 37yrs, Occ: Pvt.Emplyoee , R/o.H.No.6-7,Kurvi, Uppara gudem,Warangal District-506002.
6.Sagiraju Krishna Murthy Raju S/o.Suryanaryana Raju, about 36yrs,Occ:Pvt Empolyee R/o. H.No.1-166,Kalavagattu, Kajuluru,Seela,East Godavari Dist.A.P-509324. ...Defendants/Opponents /Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series KTC01T05P Ticket No.36 Which was sanctioned bearing prior sanction order No.Vide PSC No.NG071220P216 and date on 07-12-2020 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.
As on the date of filing disputed Claim is Rs.4,97,554-00.
You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex Nalgonda town and District, in person duly on Dt. 09-10-2024 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRITCT DISTRICT REGISTAR OFFICE MUNCIPAL COMPLEX NALGONDA.

IN THE COURT OF THE HON'BLE II ADDL SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT: AAT:KUSHAIGUDA
I.A.No. 853 of 2024
IN
I.A.No.548 of 2016
IN
OS.No.371/2022
(old O.s.No. 809/16)

Between:
K.Rupa Rani & another ...Plaintiffs
And
G.Srinivas & another ...Defendants

D2) M.Shyam Sunder S/o M.Narasaiah @Narsing Rao, aged about 41 years, Occu: Business, R/o 12-11-1118/1, Boudhanagar, Warasiguda, Secunderabad. ..Defendant, No2

Please take notice that Plaintiffs-Smt K. Rupa Rani and another has filed Suit for Partition and Separate Possession in O.S.No. 371/2022, (Old No. 809/2016), on the file of Hon'ble II Addl Senior Civil Judge. Medchal Malkajgiri District At: Kushaiguda. the Summons sent to you were not served. Hence the Hon'ble Court has ordered substituted service of summons in I.A.No. 853/2024 by way of paper publication. Therefore you are hereby ordered to appear before the Hon'ble Court either in person or duly authorized advocate on **15.10.2024**. at 10-30 AM. Take Notice that in default of appearance the suit will be heard and determined in absence.

BY THE ORDER OF THE COURT.
M/S. MATTTAPALLY SRINIVAS - ADVOCATE
Cousel for petitioner/Plaintiffs
H.No. 2-3-539,Road no.2, Sainagar Colony, Nagole
Hyderabad

మెరీనో కంపెనీలో పర్యటించిన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం మెరీనో ఫుడ్స్ కంపెనీలో బాల కార్మికుడు జయప్రకాష్ కుమార్(15) తన కేటాయించిన క్వార్టర్స్‌లోని గదిలో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసులు సదరు కంపెనీ యజమాన్యం, కాంట్రాక్టర్‌పై చైల్డ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు నాగ మధు, మల్లేష్ కంపెనీలో పర్యటించి విచారణ చేపట్టినట్టు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ ఇంతియాజ్ రహీం తెలిపారు. నార్త్ ఇండియాకు చెందిన పలు రాష్ట్రాల బాల కార్మికులను తక్కువ వేతనాలకు రప్పించి వారికి వసతి సౌకర్యం కల్పిస్తూ కంపెనీలో పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మెరీనో ఫుడ్ కంపెనీలో బాల కార్మికుల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు నల్సార్ యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ సదస్సు



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్ పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ సదస్సుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని రెవెన్యూ అంశాలపై అన్ని జిల్లాల రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్లతో మంత్రి సమావేశం నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆర్ఐఈలకు సూచించిన విధంగా వారికి కేటాయించిన జిల్లా సిబ్బందిని దగ్గరుండి వారి హాజరు, సీటింగ్ ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టరు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లనుపరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో స్వాతంత్ర పోరాట యోధులు సర్దార్ భగత్ సింగ్, సకల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి సమాజ మార్పు కోసం కృషి చేసిన గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా సామాజిక ఉద్యమ నాయకులు వెంకటాద్రి గుర్రం జాషువా చిత్రపటానికి, స్ఫూర్తి గ్రూప్ యువజన నాయకులు బాలు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు మాట్లాడుతూ..సర్దార్ భగత్ సింగ్ బ్రిటిష్ వారి పాలనకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. భగత్‌సింగ్ ప్రజలందరూ సమానంగా జీవించే వ్యవస్థను నిర్మించాలని ఆకాంక్షించారని తెలిపారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. గుర్రం జాషువా అట్టడుగు సామాజిక తరగతుల నుండి వచ్చినప్పటికీ విద్యను అవపోసనం బట్టి అగ్రవర్ణాలకు దీటుగా కవిత్వాన్ని ఉపయోగించగలిగారని చెప్పారు. జాషువాను తృణీకరించిన వారే వారి కవిత్వానికి ముగ్ధులై కాలుకు గండే పెండేరం తొడిగారని చెప్పారు. ఆయన సమాజ మార్పునకు చేసిన కృషి అమోఘం అని చెప్పారు. సకల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడాలని వారికి జేజేలు చెప్పారు. అనంతరం సభికులందరూ వారి చిత్రపటాలకు పూలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివన్నారాయణ, బాలు, వెంకటాద్రి, శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, జయరాజ్, గొడుగు యాదగిరిరావు, గౌసియా, శోభ, అవని, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో..



కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలోని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి నాగరాజు హాజరై మాట్లా డుతూ.. భగత్‌సింగ్ ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పోరాడినందుకు షహీద్ భగత్ సింగ్‌గా కొనియాడ పడ్డాడని చెప్పారు. బాల్యంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణోద్య మానికి ప్రభావితుడై బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగి ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీష దిగుమతి చేసిన దుస్తులను తగులబెట్టాడని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని, నాయకులు శివశంకర్ రెడ్డి, శివప్రసాద్, రామ్మోహన్, ఉజ్మా, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా వరల్డ్ టూరిజం డే వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్‌లోని నారాయణ పాఠశాలలో ఏజీఎం పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ మంజుభార్గవి ఆధ్వర్యంలో వరల్డ్ టూరిజం డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నారాయణ చాంప్స్ కోఆర్డినేటర్ దీప్తి హాజరై మాట్లాడారు.1980 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి సంస్థ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. టూరిజం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వివిధ ప్రదేశాల్లోని ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించటం వలన ఆయా ప్రాంతాలలోని ప్రత్యేకత, చారిత్రాత్మక కట్టడాలు, ఆయా ప్రదేశాలలోని చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల సామాజిక, రాజకీయ, ఆర్థిక విలువలు ఎలా ప్రభావితం అవుతాయో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాప్రా ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పరిధిలోని ప్రింట్ మీడియా జర్నలిస్టులు కాప్రా ప్రెస్ క్లబ్ "(ప్రింట్ మీడియా) నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చర్లపల్లిలోని శ్రీకృష్ణ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉల్లోజు శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులుగా అదిమూలం శ్రీనివాస్, ఎండీ. అక్బర్, ప్రధాన కార్యదర్శిగా వేముల శంకర్, కోశాధికారిగా రుద్రగోని నర్సింగ్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి.సురేష్, శ్రీనివాస్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మామిడాల మల్లేష్, కే.నందీశ్వర్ సలహాదారులుగా వడ్లోజు జ్యోతిర్మయాచారి, కీసరి సహదేవ్ చారి, కడియాల రమేష్, సీర శ్రీనివాస్, విజయ్, శ్రీనివాసరావు, కే.సత్యనారాయణ, కేసీ. మోహన్, బెలిదే అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు మోతే వెంకటరెడ్డి, మెరుగు చంద్రమోహన్, ఇతర నాయకులు ఏ.భాస్కర్ రెడ్డి, గడ్డమీది బాలరాజు గౌడ్, లక్కిడి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, అశోక్ రెడ్డిలు సమన్వయంతో టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో పాఠశాల పరివర్తన కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు రంగులు వేయించారు. స్వయంగా కంపెనీ ఉద్యోగులు ఈ రంగులు వేయడం విశేషం. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఇన్‌చార్జి సీతారామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు. -నవతెలంగాణ,కాప్రా

'ఆశా'లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి





- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు ఉన్నికృష్ణన్
- నేరేడ్‌మెట్‌లో మల్కాజిగిరి మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆశా వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు ఉన్నికృష్ణన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మల్కాజిగిరి మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని బీఆర్ అంబేద్కర్ భవనంలో శనివారం సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉన్నికృష్ణన్ హాజరై మాట్లాడుతూ.. ఆశ వర్కర్స్‌కు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, రూ.10వేల పెన్షన్ అమలు చేయాలని తెలిపారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.హేమలత మాట్లాడుతూ.. ఆశా 'డే' సందర్భంగా ఆశా వర్కర్ల డిమాండ్ డేగా అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సెంటర్లలో సమస్యలపై మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రం అందజేయాలన్నారు. ఆశా వర్కర్లను మెడికల్ ఆఫీసర్ల వేధింపులు ఆపాలని, అదనపు పనులకు అదనంగా వేతనం ఇవ్వాలని కోరారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుమలత, నమ్రత, వసంత, చంద్రకాంత, రాజ్యలక్ష్మి, సంతోష, సుజాత, విజయ, లావణ్య, మమత, స్వప్న, శశికళ, పుష్పలత, బాలమణి తదితరులతోపాటు 70 మంది ఆశా వర్కర్స్ ఈ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి
- పలు అభివృద్ధి పనులకు తీర్మానం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 వార్డులలో అభివృద్ధి పనులకు రూ.6కోట్ల 50 లక్షలకు సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, ఇతర పనులకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రతి ఒక్కరూ నాగారం పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ కే. చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శనం రఘు, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు తీర్మానం



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత పాఠశాలల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు రూ.2లక్షలు, పార్కు ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.3 లక్షలు, పారిశుధ్య సామాగ్రి కొనుగోలుకు మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 4 లక్షల 57 వేలు, పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, నునే, బెల్లం, యాప్రాను గ్లౌసులు ఇచ్చేందుకు ఆరు నెలలకు గాను రూ. 5లక్షలు కేటాయించారు. ట్రాక్టర్లు, ఆటోలు రిపేరు కోసం మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 4 లక్షలు, దమ్మాయిగూడ పోచమ్మ గుడికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35లక్షలు, దమ్మాయిగూడ ప్రగతి నగర్ నుండి ఐకం కంపెనీ నాగారం మెయిన్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేయుటకు మున్సిపల్ సాధారణ నిధుల నుండి ఖర్చు చేసేందుకు పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, డీఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు నాను నాయక్, నాగయి పల్లి సుజాత, కొత్త హేమలత , మంగల్ పురి వెంకటేష్ , కొత్తసురేఖ,వరగంటి వెంకటేష్ , సంపన్ బోల్ స్వప్న, సరిత, ముప్ప శ్రీలత, పాండాల అనురాధ, వసుపతి రమేష్ గౌడ్,మాదిరెడ్డి నరసింహరెడ్డి, రామారం శ్రీహరి గౌడ్,కో ఆప్షన్ సభ్యులు,వడియాల రజిని,వహిదా బేగం, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలి



నవతెలంగాణ-బోడుప్పల్

భారత దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కి ప్రాణాలు త్యజించిన షహీద్ భగత్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని భగత్ సింగ్ యువజన మండలి అధ్యక్షుడు సాయిని నవీన్ కుమార్ అన్నారు. శనివారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్ అంబేద్కర్ విగ్రహం వద్ద భగత్ సింగ్ చిత్ర పటానికి పుల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్ చేసిన త్యాగం చాలా గొప్పదని అన్నారు. భగత్ సింగ్‌కు భారతరత్న ఇచ్చిన గౌరవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాయి కృష్ణ,వినీత్, గణేష్ , చందు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కుషాయిగూడ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. -నవతెలంగాణ,కాప్రా

ప్రజల సహకారంతో అభివృద్ధి చేస్తాం : కౌన్సిలర్



నవతెలంగాణ-కీసర

ప్రజల సహకారంతో అభివృద్ధి పనులుచేస్తామని 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఈశ్వరీపురి కాలనీలో రూ. 6 లక్షలు, ఎస్‌వీ నగర్ రోడ్డు నంబర్ 3లో రూ.3 లక్షలు, రోడ్డు నంబర్ 11లో రూ.3లక్షలు మామిళ్ల నారాయణ కాలనీలో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ దశల వారీగా ఆయా కాలనీల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ(ఎం) ఉప్పల్-ఏ శాఖ కార్యదర్శిగా అశోక్ రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

సీపీఐ (ఎం) ఉప్పల్ మహాసభ సమావేశం శనివారం ఎస్. నాగరాజు యాకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ (ఎం) కార్యదర్శి వెంకన్న హాజరయ్యారు. ఈ మహాసభలో ఉప్పల్ ఏ శాఖ కార్యదర్శిగా మేకల అశోక్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మేకల అశోక్ రెడ్డిలు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ(ఎం) పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, అందులో ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ఉప్పల్లో రామంతాపూర్ ప్రాంతంలో మూసి వెంబడి ఉన్న ఇండ్లను కూల్చివేస్తామని ప్రభుత్వం హెచ్చరికలు చేస్తున్నారని, పేదల ఇండ్లను కూల్చవద్దని డిమాండ్ చేశారు. ఉప్పల్ చిల్కానగర్ డివిజన్‌లో రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని తెలిపారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. నాగరాజు, ఎన్. యాకయ్య రాఘవరావు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ వై ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షానికి రోడ్డు చిత్తడిగా మారుతున్నాయని మిగిలిన రోడ్డు వేయాలని కోరారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ మిగిలిన రోడ్డు పనులు స్టార్ట్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ కాలనీవాసులు సత్తి రెడ్డి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ అప్పారావు, ప్రసాద్, ప్రశాంత్, ప్రతాప్ కుమార్, సురేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'బోడుప్పల్'ను అభివృద్ధిలో అగ్రస్థానం నిలుపుతాం

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మేయర్ తోటకూర అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 1.3.4.23 డివిజన్ల పరిధిలోని ద్వారకానగర్, మల్లయ్య నగర్, క్రాంతి కాలనీ, హరిత హారం కాలనీ, కృష్ణనగర్, వివేక్ నగర్ కాలనీ, శ్రీలక్ష్మినగర్, లెక్చరర్స్ కాలనీ ప్రాంతాలలో సుమారు రూ.1కోటి 71. లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పిస్తున్నామని వెల్లడించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సమస్యను పరిష్కరిస్తూ కాలనీలను అన్నివిధాలుగా అభివృద్ధిపథంలో నడిపిస్తున్నామని వివరించారు. రోడ్లు, డ్రయినేజీ-తాగునీటి సరఫరా వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో బోడుప్పల్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్ గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహా రెడ్డి, కొత్త చందర్ గౌడ్. బింగి జంగయ్యయాదవ్, రాసాల వెంకటేశ్ యాదవ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, డీఈ చిరంజీవి, ఏఈ రాజశేఖర్ లతో పాటు వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల జీవన స్థితిగతులను గుర్తించి వార్తలు రాయాలి

- నవతెలంగాణ ఎడిటర్ సుధా భాస్కర్
- హైదరాబాద్ రీజియన్ విలేకరులకు శిక్షణా తరగతులు
- పాల్గొన్న హైదరాబాద్ జీఎం లింగారెడ్డి, సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్రంలో ఉన్న కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, రోజువారి కూలీలు, భవన నిర్మాణ కార్మికుల జీవన స్థితిగతులను తెలుసుకొని, వారి కష్టాలను వెలికి తీసే వార్తలు రాయాలని, అలాంటి సిద్ధాంతాలతోనే నవ తెలంగాణ పత్రిక ఏర్పడిందని నవతెలంగాణ దినపత్రిక ఎడిటర్ సుధా భాస్కర్ అన్నారు. శనివారం ఈసీఐఎల్ రాధిక చౌరస్తాలోని మైత్రి హోటల్‌లోని బెంక్వాట్ హాల్‌లో నవతెలంగాణ హైదరాబాద్ రీజియన్ విలేకరుల శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతులకు డెస్క్ ఇన్‌చార్జి శివకిరణ్ అధ్యక్షత వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎడిటర్ సుధా భాస్కర్, నవతెలంగాణ జీఎం లింగారెడ్డి, సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధా భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయాలు, కార్మికుల కష్టాలను గుర్తించే వార్తలు ఉండేలా చూసుకోవాలన్నారు. కోమటి రవి మాట్లాడుతూ.. నగరంలో అనేక చోట్ల కార్మికులు ఉన్నారని, వారిని గుర్తించి, వారి సమస్యలను వెలికి తీసి వార్తలు రాయాలన్నారు. అనంతరం జీఎం లింగారెడ్డి మాట్లాడుతూ.. ముందుగా మనం ఒక మంచి ఉద్దేశాన్ని ఎంపిక చేసుకోవాలని, వృత్తిపరంగా అభివృద్ధి చెందాలని చెప్పారు. మన పరిధిలోని గవర్నమెంట్ ఆఫీసులు, అధికారులను, మండలాల వారీగా వచ్చే బడ్జెట్ ను అధికారుల నుండి తెలుసుకొని, వాటిపై ప్రత్యేకమైన కథనాలను రాస్తుంటేనే, విలేకరులుగా గుర్తింపు వస్తుందని చెప్పారు. మోఫిషియల్ సీనియర్ సబ్‌ఎడిటర్ విజయ మాట్లాడుతూ.. విలేకరులు రోజువారి వార్తలు ఏ విధంగా రాయాలి, వార్తలను ఏ విధంగా మెరుగుపరుచుకోవాలని పలు సూచనలు చేశారు. స్టేట్‌బ్యూరో ఛీఫ్ పద్మరాజు మాట్లాడుతూ వార్తల సేకరణ, సోషల్ మీడియా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మోఫిషల్ ఇన్‌చార్జి వేణు మాధవ్, జీఎం లింగారెడ్డి, మేనేజర్లు ఉపేందర్, భరత్, నవతెలంగాణ సిబ్బంది, విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతం పరిశీలన



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని ఎంపీ ఈటల రాజేందర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ చెరువు ముంపు బాధితులతో మాట్లాడారు. ఎవరూ అధైర్యపడొద్దని బాధితులకు భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను కన్నీరు పెట్టిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతీ, మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ క్లైమేట్ ఛాంపియన్ ప్రజక్తా కోలి

ప్రజక్తా కోలి... అత్యంత ప్రభావవంతమైన కంటెంట్ సృష్టికర్తగా, కార్యకర్తగా, నటిగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. తన తరానికి ఒక ట్రయల్‌బ్లేజర్‌గా ఆమెను చెప్పకోవచ్చు. ఇటీవలె ఆమె న్యూయార్క్ నగరంలో జరిగిన క్లైమేట్ వీక్ 2024లో పాల్గొని మరింత గుర్తింపు తెచ్చుకుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ ప్రతినిధులలో ఒకరిగా నిలిచి గ్లోబల్ యూత్ క్లైమేట్ ఉద్యమాన్ని ప్రారంభించడానికి గొప్ప ప్రణాళికను రూపొందించుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ప్రజక్తా కోలి మహారాష్ట్రలోని థానేలో పుట్టి పెరిగింది. తల్లి అర్చన కోలి ఫొనెటిక్స్ అండ్ లాంగ్వేజ్ ఉపాధ్యాయురాలు. తండ్రి మనోజ్ కోలీ రియల్ ఎస్టేట్ వ్యాపారి. చిన్నప్పటి నుండి రేడియో వినడమంటే ఆమెకు చాలా ఇష్టం. ఆరో తరగతిలో ఉన్నప్పుడే రేడియో జాకీ కావాలని కలలు కన్నది. థానేలోని వసంత్ విహార్ హైస్కూల్‌లో చదువుకుంది. పాఠశాల స్థాయిలోనే ఆమె తరచుగా ఉపన్యాస పోటీల్లో పాల్గొనేది. ముంబై విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ములుండ్‌లోని వి.జి.వాజ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ నుండి బ్యాచిలర్ ఆఫ్ మాస్ మీడియాలో పట్టభద్రురాలయింది.



జీవిత పరిస్థితులకు అద్దం పడుతూ...

రేడియోను ఎంతో ప్రేమించే ప్రజక్తా ముంబైలోని ఫీవర్ 104 ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లో ఇంటర్న్‌గా మీడియా జీవితాన్ని ప్రారంభించింది. ఏడాది పాటు అందులో ఇంటర్నింగ్ చేసి తన మొదటి షో కాల్ సెంటర్‌ను ప్రారంభించింది. మోస్ట్‌లీసెన్ అనే యూట్యూబ్ ఛానెల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె వీడియోలన్నీ రోజువారీ జీవిత పరిస్థితులకు అద్దం పడుతూ, ఎంతో పరిశీలనాత్మకంగా, హాస్యాస్పదంగా ఉంటాయి. అందుకే భారతీయ యూట్యూబర్లలో మంచి కంటెంట్ సృష్టికర్తగా గొప్ప పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె ప్రదర్శనలు, చలనచిత్రాల కోసం రాయడంలో బిజీగా గడుపుతుంది. తనకు ఆనందం కలిగించే కంటెంట్‌పైనే ఆమె దృష్టి పెడుతుంది. అలాగే ఒక పుస్తకాన్ని తీసుకొచ్చేందుకు కూడా ప్రయత్నిస్తోంది. జగ్ జగ్ జీయో(2022) చిత్రంలో తన నటనకు గాను ఉత్తమ నూతన నటీమణిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికి నామినేట్ చేయబడింది. లాయర్ అయిన వృషాంక్ షనాస్‌తో 2013లో ఆమెకు నిశ్చితార్థం జరిగింది.

కీలక ప్రసంగాలు

కేవలం తన కెరీర్‌కి మాత్రమే పరిమితం కాకుండా ప్రతి సామాజిక సమస్యపై స్పందించే ప్రజక్తా ఇటీవల యూత్ క్లైమేట్ వీక్‌కు తన గొంతు వినిపించింది. UNDP తరపున భారతదేశానికి మొట్టమొదటి యూత్ క్లైమేట్ ఛాంపియన్‌గా ఉన్న ప్రజక్తా వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సమిష్టి ప్రయత్నంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా యువకులను ఏకం చేయాలనే లక్ష్యం పెట్టుకుంది. ఆమె చేస్తున్న ఈ ఉద్యమం విద్య, న్యాయం, అట్టడుగు స్థాయి కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. మోనికర్ మోస్ట్లీ సేన్ ద్వారా వెళ్లే ఈ 31 ఏండ్ల ప్రముఖ డిజిటల్ సృష్టికర్త కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లతో సహా ఉన్నత స్థాయి ఈవెంట్‌ల శ్రేణిలో పాల్గొంటుంది. యువత నేతృత్వంలోని వాతావరణ విప్లవం కోసం ఆమె తన దృక్పథాన్ని పంచుకుంటుంది. ఇతరులను ఈ ఉద్యమంలో చేరేలా ప్రేరేపిస్తుంది. కీలకమైన వాటాదారులతో భాగస్వామ్యాన్ని ఏర్పరుస్తుంది. మీడియా ప్రభావం, స్థిరమైన అభివృద్ధి, సొల్యూషన్స్ హౌస్ క్రియేటర్ ప్యానెల్, గోల్స్ హౌస్ బ్రేక్‌ఫాస్ట్ రౌండ్‌టేబుల్, హోప్ హౌస్ రౌండ్‌టేబుల్, వెరిఫైడ్ రౌండ్‌టేబుల్ గురించి చర్చించే యుఎన్ ప్రధాన కార్యాలయంలోని నాణ+ ప్యానెల్‌లో ఫీచర్ చేసిన స్పీకర్‌గా ఆమె పాల్గొనడం ఆమె ఎజెండాలోని ముఖ్యాంశం. దీంతో పాటు సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్, ఎర్త్‌షాట్ ప్రైజ్ ఇన్నోవేషన్ సమ్మిట్ వంటి కీలక ఈవెంట్‌లకు కూడా ఆమె హాజరవుతుంది.



యువశక్తి అవసరం

గేట్స్ ఫౌండేషన్ ద్వారా గోల్‌కీపర్స్‌కు సలహా సభ్యురాలిగా పనిచేస్తున్న ప్రజక్తా గోల్‌కీపర్స్ సమ్మిట్‌కు కూడా హాజరవుతుంది. ఈ సమ్మిట్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (SDG\T) వైపు పురోగతిని వేగవంతం చేయడానికి ప్రపంచ నాయకులను, మార్పుకు ప్రయత్నించే వారిని ఒకచోట చేర్చింది. ఇక్కడ ప్రజక్తా ప్రపంచ వాతావరణం, అభివృద్ధి లక్ష్యాల పట్ల తన నిబద్ధతను నొక్కి చెబుతుంది. 'వాతావరణ సమస్యల గురించి కథ రూపంలో చెప్పేందుకు ఈ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించడంలో యువత కీలకమని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచ ఉద్యమంలో పాల్గొనడం రాబోయే తరాలకు స్థిరమైన భవిష్యత్తును సృష్టించడానికి ఉపయోగపడుతుంది. ఇందులో యువత శక్తి చాలా అవసరం. అందరం కలిసి మన స్థిరమైన భవిష్యత్తును రూపొందించుకోగలం. ఇందులో నా ప్రయాణాన్ని నా అనుచరులతో పంచుకోవడానికి, ఈ ఉద్యమంలో భాగమయ్యేలా వారిని ప్రోత్సహించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను' అని ఆమె పంచుకుంది.

సోషల్ మీడియాలో 17 మిలియన్ల మంది ఫాలోవర్లతో ప్రజక్తా అర్థవంతమైన మార్పు కోసం నితరంతరం కృషి చేస్తూనే ఉంది. UNDP భారతదేశపు మొట్టమొదటి యూత్ క్లైమేట్ ఛాంపియన్‌గా ఆమె అందులో కీలక పాత్ర పోషిస్తుంది. వాతావరణంతో పాటు యువత సాధికారత, లింగ సమానత్వం కోసం కూడా ఆమె ప్రపంచ వ్యాప్తంగా తన గొంతు వినిపిస్తుంది.



ఉసిరితో ఎన్ని లాభాలో

ఈ సీజన్‌లో లభ్యమయ్యే ఉసిరితో నిల్వ పచ్చళ్లు చేసుకుంటారు. కొందరైతే గింజలను తీసేసి కాయలను ఎండబెట్టి నిల్వ చేసుకుంటారు. బోలెడు ప్రయోజనాలున్న ఉసిరిని ప్రతి ఒక్కరూ తప్పక వాడాలి. ఎండబెట్టిన ఉసిరికాయ ముక్కలను రోజుకి 1 లేదా 2 తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.



విటమిన్లు-మినరల్స్ :

తాజా ఉసిరికాయలోనే కాదు.. ఎండిన ఉసిరి ముక్కల్లోనూ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఉసిరిలో ఉండే విటమిన్ సి ఎండిన తర్వాత యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ నుంచి రక్షిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు రావు.

అజీర్తి దూరం చేస్తుంది :

ప్రతిరోజూ ఎండిన ఉసిరి తింటే.. అజీర్తి సమస్య తగ్గుతుంది. జీర్ణశక్తి మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరు కూడా మెరుగ్గా ఉంటుంది.

జుట్టు సమస్య ఉండదు :

జుట్టు రాలడం వంటి సమస్యతో బాధపడే వారికి ఎండిన ఉసిరి మంచి పరిష్కారం. ఉసిరి ముక్కల్ని తినడం వల్ల శిరోజాలు రాలడం తగ్గి.. ఆరోగ్యంగా, పొడవుగా పెరుగుతాయి. కుదుళ్లు కూడా దృఢంగా ఉంటాయి.

వాపులకు చెక్ :

ఎండిన ఉసిరి ముక్కల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంపై వచ్చే వాపులు, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

చర్మానికి మేలు :

రోజూ రెండు ఎండిన ఉసిరి ముక్కలను తింటే.. చర్మం కాంతివంతంగా ఉంటుంది. చర్మంపై త్వరగా ముడతలు రావు. మొటిమలు, మచ్చలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. ఆందోళన, వణుకు, మతిమరుపు, నరాల బలహీనత వంటి అనారోగ్య సమస్యలు సైతం తగ్గుతాయి.

డిజిటల్ కార్డులో.. మహిళే కుటుంబ పెద్ద



(మొదటిపేజీ తరువాయి)

కలిగే ప్రయోజనాలు, లోపాలను అధికారులు వివరించారు. అనంతరం కార్డుల రూపకల్పనపై సీఎం వారికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల కార్డుల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం సేకరించాల్సిన పని లేదని పేర్కొన్నారు. సమాచార సేకరణ సమయంలో నిబద్ధతతో పని చేయాలని అధికారులకు సూచించారు.

ప్రతి నియోజకవర్గంలో రెండు ప్రాంతాలు ఎంపిక

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాలను (ఒక గ్రామీణ, ఒక పట్టణ) పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం సూచించారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు గ్రామాలు, పూర్తిగా పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు లేదా డివిజన్లను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాల సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబరు మూడు నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి (డోర్ టూ డోర్) పరిశీలన చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకు గాను గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, పట్టణ ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. వీరిని మానిటరింగ్ చేసేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలన సమగ్రంగా చేపట్టాలనీ, లోపాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. సమీక్షలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి కోదాడకు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో మునగాల మండలం గుడిబండ గ్రామానికి చెందిన గర్భిణి అలివేలు ఎక్కింది. ఈ క్రమంలో తాడువాయి స్టేజి వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే కండక్టర్, డ్రైవర్ స్పందించి బస్సును రోడ్డు పక్కకు ఆపారు. తోటి ప్రయాణికులు సహాయం చేయగా.. అలివేలు పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం 108 వాహనంలో సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై డిపో మేనేజర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులను అభినందించారు.

తయారీ రంగంలో స్తబ్దత


వ్యవసాయం,స్వయం ఉపాధిపైనే ఆధారం
కుటుంబ వ్యాపారాల్లో మహిళల ఉచిత సేవలు



న్యూఢిల్లీ : 2023-24లో దేశంలో నిరుద్యోగ రేటు 3.2 శాతం వద్ద స్థిరంగా ఉంది. అయితే ఉద్యోగాలలో నాణ్యత పడిపోతోందంటూ ఓ ప్రభుత్వ సర్వే చెప్పిన చేదు నిజం భయాందోళనలు కలిగిస్తోంది. తయారీ రంగంలో స్తబ్దత నెలకొని ఉండడం, తక్కువ ఆదాయాన్ని అందించే వ్యవసాయ రంగంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పనిచేయడం ఈ భయాందోళనలకు కారణాలు. అదీకాక స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఈ పరిస్థితి కన్పిస్తోంది. వ్యవసాయంలో కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్న మహిళలకు ఎలాంటి ఆర్థిక ప్రతిఫలం లభించడం లేదు. వ్యవసాయంలోనే కాకుండా కుటుంబ సభ్యులు నడిపే వ్యాపారాలలో కూడా మహిళలు భాగస్వాములవు తున్నారు. కానీ వారికి జీతం భత్యం ఏమీ అందదు. దేశంలో ఉపాధి పొందుతున్న వారిలో ఐదో వంతు మంది ఈ కోవకు చెందిన వారేనని, మూడో వంతు మంది స్వయం ఉపాధి పొందుతున్నారని 2023-24 సంవత్సరపు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) చెబుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) మాత్రం ప్రతిఫలం పొందకుండా కుటుంబానికి చేయూత అందిస్తున్న వారిని ఉపాధి పొందుతున్న వారీగా గుర్తించడం లేదు.

ప్రభుత్వ సంస్థలు ఏం చెప్పాయి?

నెలవారీ జీతాలు లేదా వేతనాలు పొందుతున్న వారి సంఖ్య సుమారు ఒక శాతం పాయింట్ పెరిగిందని పీఎల్ఎఫ్ఎస్‌ను ఉటంకిస్తూ కార్మిక మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ అందించిన సమాచారం ఆధారంగా పీఎల్ఎఫ్ఎస్ ఈ అంచనా వేసింది. ఈపీఎఫ్ఓ సమాచారం ప్రకారం ప్రతి నెలా పది లక్షల మంది అధికారిక ఉద్యోగాలలో చేరుతున్నారు. 2023 జూలై, ఈ ఏడాది జూన్ మధ్యకాలంలో నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం 1,01,920 కుటుంబాల నుండి వివరాలు సేకరించింది. వాటిని ఈ వారంలో విడుదల చేసింది. దేశంలో ఉద్యోగ పరిస్థితిపై నరేంద్ర మోడీ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలో ఈ సర్వే ఫలితాలు విడుదల చేయడం గమనార్హం.



వ్యవసాయంలోనే ఉపాధి

జనాభాలో ఉద్యోగుల దామాషాను తెలిపే కార్మికుడు-జనాభా నిష్పత్తి 2022-23లో 56 శాతం ఉండగా 2023-24లో 58.2 శాతానికి పెరిగింది. పదిహేను సంవత్సరాల వయసు పైబడిన వారిలో ఈ పెరుగుదల కన్పించింది. పీఎల్ఎఫ్ఎస్ ప్రకారం 2023-24లో వ్యవసాయంలో భాగస్వాములైన కార్మికులు 46.1 శాతం ఉండగా 2022-23లో 45.5 శాతంగానే ఉంది. 2004కు ముందు యాభై సంవత్సరాల పాటు వ్యవసాయంలో కార్మికుల భాగస్వామ్యం పెరిగింది కానీ మొత్తం కార్మికులలో వారి వాటా తక్కువగానే ఉన్నదని కార్మిక ఆర్థికవేత్త సంతోష్ మెహరోత్రా తెలిపారు. అయితే ఇటీవలి ధోరణులు తిరోగమనాన్ని సూచిస్తున్నాయని ఆయన చెప్పారు. 2004 తర్వాత వ్యవసాయేతర ఉద్యోగాలు పెరిగాయని, వ్యవసాయంలో ఉన్న వారు వేరే ఉపాధిని వెతుక్కోవడం మొదలు పెట్టారని వివరించారు. కానీ 2019 తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన చెప్పారు.

ప్రభుత్వ విధానాలే కారణం

2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దు, 2017లో ఓ ప్రణాళిక అంటూ లేకుండా జీఎస్టీని అమలు చేయడం, కోవిడ్ సమయంలో పూర్తి లాక్‌డౌన్ విధించడం వంటి పరిణామాలు వృద్ధి రేటును తగ్గించాయని, వ్యవసాయేతర ఉద్యోగాలు తగ్గిపోయాయని మహరోత్రా తెలిపారు. '2018-19, 2022-23 మధ్యకాలంలో వ్యవసాయ రంగంలో ఆరు కోట్ల మంది చేరారు. తయారీ రంగంలో ఉపాధి కల్పన పడిపోయింది. ప్రభుత్వం అవలంబించిన విధానాల కారణంగా నిర్మాణపరమైన మార్పు అధోముఖం బాట పట్టింది. వ్యవసాయ రంగం నుండి కార్మికులు తయారీ, సేవల రంగాల వైపు వెళ్లాల్సి ఉంటుంది. కానీ దీనికి వ్యతిరేకంగా జరుగుతోంది' అని వివరించారు. జీతం, వేతనం పొందని కుటుంబ కార్మికుల సంఖ్య 2017-18 వరకూ తగ్గుతూనే ఉంది. ఆ తర్వాత అది పెరగడం మొదలు పెట్టింది. ఆ పెరుగుదల ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

స్వయం ఉపాధి కూడా పెరుగుతోంది

పీఎల్ఎఫ్ఎస్ ప్రకారం 2022-23లో స్వయం ఉపాధి పొందిన వారి సంఖ్య 57.3 శాతం ఉండగా 2023-24లో అది 58.4 శాతానికి పెరిగింది. 2021-22లో ఉద్యోగులలో స్వయం ఉపాధి పొందిన వారి సంఖ్య 55.8 శాతంగా మాత్రమే ఉంది. కుటుంబాలు నిర్వహించే వ్యాపారాలలో సహాయకులుగా పని చేస్తున్న వారి సంఖ్య... ముఖ్యంగా ఎలాంటి వేతనం లేకుండా చాకిరీ చేస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. 2021-22లో ఈ సంఖ్య 17.5 శాతం, 2022-23లో 18.3 శాతం ఉండగా 2023-24లో 19.4 శాతానికి పెరిగింది. వ్యవసాయంలోనూ, కుటుంబాలు నిర్వహించే వ్యాపారాలలోనూ గ్రామీణ మహిళల భాగస్వామ్యం గత నాలుగు సంవత్సరాలలో పెరిగింది. చెప్పాలంటే ఇది ఉపాధికి సంబంధించిన దారుణ రూపం అని మహరోత్రా వ్యాఖ్యానించారు.

ఉద్యోగాలు కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగం ఇటీవలి కాలంలో ప్రభుత్వ విధానాల కారణంగా భారీగా నష్టపోయింది. ప్రభుత్వం ప్రారంభించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకాలు ఉద్యోగాలు కల్పించలేకపోయాయి.

సుందరీకరణ వెనుక అనేక బాగోతాలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మూసీ రివర్ ఫ్రంట్' పేరుతో ఆ నది సుందరీకరణ ప్రాజెక్టు కోసం రేవంత్ సర్కారు రూ. 1.50 లక్షల కోట్లను ఖర్చు చేస్తామని చెప్పటం వెనుక పెద్ద ఎత్తున బాగోతాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముందు రూ. 50 వేల కోట్లు అని చెప్పి ఇప్పుడు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని మూడింతలు పెంచటమంటే కాంగ్రెస్ ధన దాహం ఏ విధంగా ఉందో అర్థమవుతోందని ఆయన ఎద్దేవా చేశారు. తట్టెడు మట్టి కూడా తీయకుండా వేల కోట్లు తన్నుకుపోయే కుట్ర ఇందులో దాగుందని విమర్శించారు. కుంభకోణాల కాంగ్రెస్ ఆటలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఆ పార్టీ ఆడుతున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ హెచ్చరించారు.

తెలంగాణ భవన్‌కు బాధితులు

మూసీ సుందరీకరణకు సంబంధించి పలువురు బాధితులు తమ గోడును చెప్పుకునేందుకు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు... వారందరికీ అండగా ఉంటామని హామీనిచ్చారు. బాధితులకు న్యాయ సహాయం చేసేందుకు వీలుగా తమ పార్టీకి చెందిన న్యాయవాదుల బృందం 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందని భరోసానిచ్చారు.

గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు ఉన్నాయంటూ మార్చురీ లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మూసీనది సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి వేల మందిని నిరాశ్రయులను చేస్తున్నారన్నారు. సీఎంగా పేదలకు సహాయం చేయ్.. కన్నీళ్లు పెట్టించకు అని హెచ్చరించారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో నిర్మించుకున్న ప్లాట్లన్నీ కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రిజిస్ట్రేషన్ చేసినట్టు గుర్తు చేశారు. ఈ ఇండ్లలో నివసిస్తున్న వారు కరెంట్, నల్లా బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలో 40 ఏండ్ల నుంచి జీవిస్తుంటే నేలమట్టం చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం, నిర్వాసితుల ఇండ్లు తీసుకోవాలంటే నష్ట పరిహారం చెల్లించి, కొత్తగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఉందనీ, జీవనోపాధి కింద రూ.5 లక్షలు ఇవ్వాలని చట్టంలో ఉన్నట్టు గుర్తు చేశారు. పేదలను ఒప్పించాలి తప్పా.. ఈ బెదిరింపులు సరికాదని అన్నారు. శని, ఆదివారాల్లో కూలగొట్టే ప్రయత్నాలు చేయడం మూర్ఖత్వమని తెలిపారు. బలవంతంగా ఖాళీ చేయిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదనీ, ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మూసీలో నీళ్లు పారించాలి అనుకుంటున్నావా.. పేదోళ్ల కన్నీళ్లు, రక్తం పారించాలని అనుకుంటున్నావా.. అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హైడ్రా వేధింపులు భరించలేక.. ఆందోళనతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే మూడు ఆత్మహత్యలు జరిగాయని, ఇంకా ఎంత మందిని చంపాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని అన్నారు.

గాంధీ ఆస్పత్రిలో తీవ్ర మందుల కొరత ఉందనీ, రోగులు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ప్రయివేటు మెడికల్ షాపుల వద్ద లైన్లలో నిలబడి మందులు కొంటున్నారని తెలిపారు. గాంధీలో కనీసం పారాసిటామల్, గ్యాస్ సమస్యకు వాడే మందుల్లేక రోగులు విలవిల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేసిందన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో పిల్లలు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారనీ, విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టడంతో రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ పేరును నిలబెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించారు. వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని, బలవంతంగా ఇండ్లను కూల్చేస్తామంటే తాము, తమ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీస్తున్న కాంగ్రెస్ : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లికి చెందిన బుచ్చమ్మ తమ ఇల్లును హైడ్రా అధికారులు కూల్చివేస్తారని మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి కూల్చివేతలపై చర్చించాలని డిమాండ్ చేశారు.

వేడుకలో.. ఉన్నది కాలం




సుధీర్‌బాబు, సాయి చంద్

సుధీర్ బాబు తాజాగా నటిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజైన ఈ మూవీ టీజర్ స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సింగిల్ 'నాన్న సాంగ్' చార్ట్‌బస్టర్ హిట్‌తో మ్యూజికల్ ప్రమోషన్స్ కిక్ స్టార్ట్ చేసిన మేకర్స్ శనివారం సెకెండ్ సింగిల్ 'వేడుకలో..' అంటూ సాగే వెడ్డింగ్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. జై క్రిష్ ఈ పాటని పర్ఫెక్ట్ వెడ్డింగ్ సెలబ్రేషన్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన అందమైన, అర్థవంత మైన సాహిత్యం ఆకట్టుకున్నాయి. ఐశ్వర్య దరూరి, బృందా, చైతు సత్సంగి, అఖిల్ చంద్ర తమ వోకల్స్‌తో మెస్మరైజ్ చేశారు. ఈ సాంగ్‌లో సుధీర్ బాబు కూల్ ప్రజెన్స్ కట్టిపడేసింది. సుధీర్‌బాబు, సాయి చంద్ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ హైలెట్‌గా నిలిచింది. విజువల్స్ బ్యూటీఫుల్‌గా ఉన్నాయి. దీంతో ఈ పాట ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్ సెలబ్రేషన్స్ సాంగ్‌గా నిలిచింది అని చిత్రయూనిట్ తెలిపింది.

ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో సాయిచంద్, రాజు సుందరం, శశాంక్, ఆమని, అన్నీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 11న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి డీవోపీ: సమీర్ కళ్యాణి, సంగీతం: జై క్రిష్, ఎడిటర్: అనిల్ కుమార్ పి., క్రియేటివ్ ప్రొడ్యూసర్: మహేశ్వర్ రెడ్డి గోజాల, ప్రొడక్షన్ డిజైనర్: ఝాన్సీ గోజాలా, కొరియోగ్రఫీ: రాజు సుందరం, రైటర్స్: ఎంవీఎస్ భరద్వాజ్, శ్రవణ్ మాదాల, అభిలాష్ రెడ్డి కంకర.

దీపావళి కానుకగా జీబ్రా రిలీజ్



సత్యదేవ్

హీరో సత్య దేవ్, కన్నడ నటుడు డాలీ ధనంజయ నటిస్తున్న మల్టీ-స్టారర్ చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్లపై ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్నారు.

ఇటీవలే రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ జీబ్రా గ్లింప్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈనెల 30న జీబ్రా గ్లింప్స్ రిలీజ్ కానుంది. సత్య దేవ్, డాలీ ధనంజయను డైనమిక్‌గా ప్రజెంట్ చేసిన అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ప్రియాభవానీ శంకర్, జెన్నిఫర్ పిసినాటో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ఈశ్వర్ కార్తీక్, ఎడిషనల్ స్క్రీన్ ప్లే: యువ, సహ నిర్మాత: ఎస్ శ్రీలక్ష్మి రెడ్డి, డీవోపీ: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్.

నవచిత్రం

కర్ణాటక ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్‌లోకి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఎంట్రీ



టీజీ విశ్వప్రసాద్

100 చిత్రాల నిర్మాణ లక్ష్యంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ అనతికాలంలోనే ఓ బ్రాండ్ ఇమేజ్‌ని సొంతం చేసుకుంది. కచ్చితత్వానికి, మంచి క్వాలిటీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ తన విజన్‌తో నిర్మిస్తున్న చిత్రాలు, ముందుకు వెళ్తున్న తీరుతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. అంతేకాదు భారీ బడ్జెట్ చిత్రాలకు నిర్మాణానికి ప్రతీకగా ఈ బ్యానర్ నిలిచింది. ఓవర్సీస్‌లో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఉన్న పట్టు గురించి అందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు టాలీవుడ్‌లో సత్తా చాటిన పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఇకపై శాండిల్‌వుడ్‌లో కూడా తన ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమైంది. కన్నడ డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి టీజీ విశ్వ ప్రసాద్ అడుగు పెట్టబోతున్నారు. కేఆర్‌జీ స్టూడియోస్‌తో కలిసి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఇకపై అక్కడ సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేయనుంది. ప్రస్తుతం ఈ బ్యానర్ నుంచి 'శ్వాగ్', 'విశ్వం', 'మోగ్లీ', 'తెలుసు కదా..' వంటి తదితర చిత్రాలు అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. సినిమా నిర్మాణంతోపాటు పంపిణీ రంగంలోనూ తమ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సత్తా చాటాలనే లక్ష్యంతో ఉన్నాం అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తెలిపారు.

ఇందు రెబెక్కా వర్గీస్..



సాయి పల్లవి

శివకార్తికేయన్ నటిస్తున్న మల్టీలింగ్వల్ బయోగ్రాఫికల్ యాక్షన్ మూవీ 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఉలగనాయగన్ కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ మూవీలో సాయి పల్లవి ఫిమేల్ లీడ్‌గా నటిస్తున్నారు.

ఇందు రెబెక్కా వర్గీస్‌గా సాయి పల్లవిని పరిచయం చేస్తూ మేకర్స్ ఇంట్రో వీడియో రిలీజ్ చేశారు. ఇది ముకుంద్, ఇందుల ఎమోషనల్ జర్నీని అద్భుతమైన గ్లింప్స్‌గా ప్రజెంట్ చేస్తోంది. రిపబ్లిక్ డే పరేడ్ సీక్వెన్స్‌తో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ యుఎస్ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా వంటి ప్రముఖ వ్యక్తులతో పాటు ముకుంద్‌ను సత్కరిస్తున్న రియల్ ఫుటేజీని ప్రజెంట్ చేయడం మనసుని హత్తుకుంది. ఇందు పాత్రలో సాయి పల్లవి కట్టిపడేసింది.

తన ప్రజెన్స్, పెర్ఫార్మెన్స్‌తో ఇందు క్యారెక్టర్‌కు అథెంటిసిటీ తీసుకొచ్చింది. సాయిపల్లవి, శివకార్తికేయన్ కెమిస్ట్రీ అదిరిపోయింది. ఇంట్రో వీడియో ప్రధానంగా సాయి పల్లవి క్యారెక్టర్ పై ఫోకస్ చేసింది. ఈ గ్లింప్స్‌కి విశేష ఆదరణ లభించడం ఆనందంగా ఉందని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ మూవీ శివ్‌అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' చాప్టర్ ఆధారంగా రూపొందించారు. ఈ దీపావళికి అక్టోబర్ 31న థియేటర్లలో విడుదల కానుంది. నితిన్ ఫాదర్ సుధాకర్ రెడ్డి, ఆయన సోదరి నిఖిత రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ ద్వారా గ్రాండ్ గా విడుదల చేయనున్నారు.



వెంకటేష్, చిరంజీవి, బాలకృష్ణ

అత్యంత వైభవంగా ఐఫా అవార్డుల వేడుక

చిరంజీవి, బాలకృష్ణకు ప్రతిష్టాత్మక పురస్కారాలు

ఐఫా 2024 (ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ) వేడుక అబుదాబి వేదికగా అంగరంగ వైభవంగా జరుగుతోంది. దక్షిణాది, ఉత్తరాది తారలు ఈ వేడుకలో సందడి చేస్తున్నారు. ఈ వేడుకలో అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా పురస్కారాన్ని చిరంజీవి అందుకోవడం ఓ విశేషమైతే, గోల్డెన్ లెగసీ అవార్డును బాలకృష్ణ సొంతం చేసుకోవడం మరో విశేషం. ఇలాంటి విశేషాలకు వేదికగా నిలిచిన ఈ వేడుకలో ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సమంతను వరించింది.

ఇదిలా ఉంటే, ఈ వేదికపై టాలీవుడ్ అగ్ర హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. హీరో తేజ సజ్జా, రానా హోస్ట్ చేసిన ఈ వేడుక కన్నుల పండగగా సాగింది.

హీరో నాని ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అరుదైన ఘనతను సాధించారు. 'దసరా'లో తన అద్భుత మైన నటనకు మూడు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు (తెలుగు), సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ అందుకున్న నాని ఇప్పుడు ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డుల్లో ఉత్తమ నటుడు (తెలుగు) అవార్డుని దక్కించుకున్నారు. 'ఐఫా'లో దసరా సినిమాకి గానూ ఉత్తమ చిత్రం అవార్డును నిర్మాత సుధాకర్ చెరుకూరి అందుకున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన 'దసరా' విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, దసరాకు లభించిన ప్రేమ, గౌరవం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఈ అవార్డులు మొత్తం నటీనటులు, టీంకృషి, అంకితభావానికి నిదర్శనం. అందరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి ఐఫాలో భగవంత్ కేసరి చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు.

ఇక మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఏకంగా ఏడు విభాగాల్లో అవార్డుల్ని దక్కించుకుని అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది.

ఐఫా 2024 విజేతలు

అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా - చిరంజీవి

అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఇండియన్ సినిమా - ప్రియదర్శన్

ఉమెన్ ఆఫ్ ది ఇయర్ - సమంత

గోల్డెన్ లెగసీ అవార్డు - బాలకృష్ణ

ఉత్తమ చిత్రం (తమిళం) - జైలర్

ఉత్తమ చిత్రం (తెలుగు) - దసరా

ఉత్తమ నటుడు (తెలుగు) - నాని (దసరా)

అవుట్ స్టాండింగ్ ఎక్సలెన్స్ (కన్నడ) - రిషబ్ శెట్టి

ఉత్తమ నటుడు (తమిళం) - విక్రమ్ (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ నటి (తమిళం) - ఐశ్వర్యారాయ్ (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ దర్శకుడు (తమిళం) - మణిరత్నం (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ సంగీత దర్శకుడు (తమిళం) - ఏఆర్ రెహమన్ (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ విలన్ (తమిళం) - ఎస్‌జే సూర్య (మార్క్ ఆంటోనీ)

ఉత్తమ విలన్ (తెలుగు) - షైన్ టామ్ (దసర)

ఉత్తమ విలన్ (కన్నడ) - జగపతి బాబు

ఉత్తమ సహాయ నటుడు (తమిళం) - జయరామ్ (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ సినిమాటోగ్రఫీ - మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి

ఉత్తమ సాహిత్యం - జైలర్ (హుకుం)

ఉత్తమ నేపథ్య గాయకుడు - చిన్నంజిరు (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ నేపథ్య గాయని - శక్తిశ్రీ గోపాలన్ (పొన్నియిన్ సెల్వన్ 2)

ఉత్తమ దర్శకుడు (తెలుగు) - అనిల్ రావిపూడి

ఆటలు

వరుణుడి ఖాతాలో రెండో రోజు

- కాన్పూర్ టెస్టును వీడని వర్షం
- ఆట పూర్తిగా రద్దు
- భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

నవతెలంగాణ-కాన్పూర్



భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టును వరుణుడు వీడటం లేదు. తొలి రోజు ఆటకు అంతరాయం కలిగించిన వరుణుడు.. రెండో రోజు పూర్తిగా ఆటను సాగన్వివలేదు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో కాన్పూర్ టెస్టు రెండో రోజు ఆట వర్షార్పణంగా ముగిసింది. రెండో రోజు 90 ఓవర్ల ఆట రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. తొలి రోజు టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న భారత్.. బంగ్లాదేశ్‌ను 35 ఓవర్లలో 107/3 పరుగులకు కట్టడి చేసింది. యువ పేసర్ ఆకాశ్ దీప్ (2/34) రెండు వికెట్ల మాయజాలంతో మెప్పించాడు. బంగ్లాదేశ్ బ్యాటర్లు మోమినుల్ హక్ (40 నాటౌట్), ముష్ఫికర్ రహీమ్ (6 నాటౌట్) అజేయంగా నిలిచిన సంగతి తెలిసిందే.

అలా వచ్చి.. ఇలా వెళ్లి! : వెలుతురు లేమి, వర్షంతో తొలి రోజు 35 ఓవర్ల మాత్రమే సాధ్యపడగా.. రెండో రోజు కనీసం ఆటగాళ్లు మైదానంలో అడుగుపెట్టలేదు. రాత్రి కురిసిన వర్షంతో అవుట్ ఫీల్డ్ పూర్తిగా తడిచిపోయింది. దీంతో ఉదయం నుంచి పిచ్, అవుట్ ఫీల్డ్ మొత్తం కవర్లలో కప్పి ఉంచారు. ఉదయం గ్రీన్‌పార్క్ గ్రౌండ్‌కు చేరుకున్న భారత్, బంగ్లాదేశ్ క్రికెటర్లు ఎంతోసేపు డ్రెస్సింగ్‌రూమ్‌లో ఉండలేదు. ఉదయం 10.20 గంటలకు స్టేడియం నుంచి ఆటగాళ్లు హోటల్ గదులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు అంపైర్లు రెండో రోజు ఆటను అధికారికంగా రద్దు చేశారు.

వీడని వర్షం ముప్పు : కాన్పూర్ టెస్టును వర్షం ముప్పు వీడటం లేదు. తొలి మూడు రోజుల వర్షం ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నేడు ఉదయం సెషన్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురువనుంది. మధ్యాహ్నం నుంచి వరుణుడు కాస్త శాంతించనున్నాడు.

వర్షం తగ్గినా.. వరుసగా మూడు రోజుల వర్షంతో అవుట్ ఫీల్డ్ బాగా తిన్నది. స్వల్ప సమయంలో పిచ్, అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేయటం క్యూరేటర్, గ్రౌండ్స్‌మెన్‌కు అంత సులభం కాబోదు.

ఐదుగురితో పాటు ఓ ఆర్‌టీఎం!

ఐపీఎల్ ఫ్రాంచైజీలకు అనుకూలంగా వేలం రూల్స్



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆటగాళ్ల మెగా వేలం ముంగిట ఫ్రాంచైజీలకు అనుకూలంగా నిబంధనలను సడలిస్తున్నారు. ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకునే (రిటెన్షన్) అవకాశంతో పాటు వేలంలో మరో ఆటగాడిని తిరిగి సొంతం చేసుకునేందుకు ఓ ఆర్‌టీఎం (రైట్ టూ మ్యాచ్) కార్డ్‌ను అందించనుంది. దీంతో ఫ్రాంచైజీలు గరిష్టంగా ఆరుగురు క్రికెటర్లను తిరిగి జట్టులో నిలుపుకునే వీలుంది. నవంబర్ లేదా డిసెంబర్ రెండో వారంలో ఐపీఎల్ 2025 ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు వేలం రూల్స్‌ను బీసీసీఐ, ఐపీఎల్ ఉన్నతాధికారులు రూపొందిస్తున్నారు. అట్టిపెట్టుకునే ఆటగాళ్లలో స్వదేశీ, విదేశీ ఆటగాళ్లపై ఏమైనా ఆంక్షలు ఉంటాయా అనేది తెలియాల్సి ఉంది. ప్రతి ఫ్రాంచైజీ వేలంలో గరిష్టంగా రూ.115-120 కోట్ల ఖర్చు చేసేందుకు పర్సు పరిమితి పెంచనున్నారు. ఆదివారం బెంగళూర్‌లో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగేందుకు అవకాశం ఉంది. బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశం ముంగిట జరిగే ఈ భేటీలో వేలం రూల్స్‌కు తుది రూపు ఇవ్వటంతో పాటు ఆ నివేదికను ఏజీఎంకు సమర్పించనున్నారు. గతంలో ముగ్గురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవటం లేదా మూడు ఆర్‌టీఎం కార్డులు ఇచ్చేవారు. వేలంలో ఫ్రాంచైజీ పర్సుకు సైతం రూ.90 కోట్ల పరిమితి ఉండేది.



ట్రెసా, గాయత్రిలకు నిరాశ

సెమీస్‌లో పోరాడి ఓడిన డబుల్స్ జోడీ

మకావు ఓపెన్ సూపర్ 300

మకావు (చైనా) : మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత వర్థమాన డబుల్స్ జోడీ ట్రెసా జాలి, పుల్లెల గాయత్రిలకు అనూహ్య పరాజయం ఎదురైంది. మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ ట్రెసా, గాయత్రిలు శనివారం జరిగిన సెమీఫైనల్లో మూడు గేముల పోరాటంలో తలొంచారు. ఎనిమిదో సీడ్ చైనీస్ తైపీ జోడీ షాన్, హంగ్‌లు 21-17, 16-21, 21-10తో ట్రెసా, గాయత్రిలపై గెలుపొందారు. 60 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో గాయత్రి, ట్రెసాలు అంచనాలను అందుకోలేదు. తొలి గేమ్‌ను17-21తో కోల్పోయిన మనోళ్లు రెండో గేమ్‌లో పుంజుకున్నారు. 21-16తో రెండో గేమ్‌లో నెగ్గి లెక్క సమం చేశారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ట్రెసా, గాయత్రి నిరాశపరిచారు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయారు. 21-10తో మూడో గేమ్‌తో పాటు ఫైనల్స్ బెర్త్‌ను చైనీస్ తైపీ జంట సొంతం చేసుకుంది. గాయత్రి, ట్రెసా ఓటమితో మకావు ఓపెన్‌లో భారత టైటిల్ వేటకు తెరపడింది.

కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి

కనీసవేతనాలు చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు

- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా

నవతెలంగాణ-విలేకరులు



ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఏఓ రాజేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరావు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ తదితర రంగాల కార్మికుల సమస్యలపై ఈనెల 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ చేసినట్టు తెలిపారు. ఈ సర్వేలో చాలా సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సెలవులు కూడా సక్రమంగా అమలు చేయడం లేదని, ఖమ్మం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల పట్ల జవాన్ల వేధింపులు తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి ఎ.జె రమేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కి అందజేశారు. సమస్యలన్నింటినీ సానుకూలంగా విన్న జిల్లా కలెక్టర్ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ధర్నా అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లిఖార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బీ.మల్లేశం, జి. సాయిలు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంద బోయిన ఎల్లయ్య, కాముని గోపాలస్వామిలు పాల్గొని ప్రసంగించారు.నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమల కార్మికులు, గ్రామ పంచాయతీ, మోడల్ స్కూల్, మిషన్ భగీరథ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఏఎన్ఎం కార్మికులు ధర్నా నిర్వహించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం

భారత్, ఉజ్బెకిస్తాన్ ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (BIT)పై సెప్టెంబర్ 27వ తేదీన సంతకం చేశాయి. ఈ



ఒప్పందం రెండు దేశాల మధ్య పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడం, ఆర్థిక సహకారాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఒప్పందంపై భారత ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్, ఉజ్బెకిస్తాన్ ఉపప్రధాని ఖోజాయెవ్ జమ్షిద్ అబ్దుఖాకిమోవిచ్ తాష్కెంట్‌లో సంతకం చేశారు. ఒప్పంద నిబంధనల ప్రకారం పెట్టుబడులు వసూలు (expropriation) నుంచి రక్షణ పొందుతాయి. ఈ ఒప్పందం పెట్టుబడి కార్యకలాపాల్లో స్వచ్ఛతను ప్రోత్సహించడానికి, నష్టాలకు పరిహారం విధానాలను నిర్దేశించడానికి దోహదం చేస్తుంది. పెట్టుబడులను రక్షించడం ద్వారా, ఒప్పందం రాష్ట్రానికి నియమించుకునే హక్కులను కాపాడుతుంది. అందువల్ల కరెక్ట్ విధానాలకు అవకాశం కల్పిస్తుంది.

కరెంట్ అఫైర్స్

దీపక్ మెహతాకు ఐసీసీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

దీపక్ నైట్రైట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ సి.మెహతా ఇటీవల 59వ ఇండియన్ కెమికల్



కౌన్సిల్ (ICC) వార్షిక అవార్డుల కార్యక్రమంలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. దీపక్ మెహతా రసాయన పరిశ్రమలో ఒక విప్లవాత్మక నాయకుడిగా గుర్తించబడ్డారు. ఆయన మాజీ ఇండియన్ కెమికల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా, భారత ప్రభుత్వ రసాయన పరిశ్రమ టాస్క్ ఫోర్స్‌లో ముఖ్య సభ్యుడిగా, భారత దేశాన్ని ప్రపంచ రసాయన తయారీ శక్తిగా మారుస్తున్న ప్రాజెక్టుల్లో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన ఫిక్కీలో నేషనల్ కెమికల్స్ కమిటీ, సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఉన్నారు. ఇది ఈ రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన అంకితభావాన్ని చూపిస్తుంది.

రొబోటిక్ మ్యూల్స్‌ను ప్రవేశపెట్టిన భారత సైన్యం...

భారతసైన్యం ఇటీవల తన ఆర్థిక, ఆపరేషనల్ సామర్థ్యాలను పెంచేందుకు రొబోటిక్ మ్యూల్స్‌ను ప్రవేశపెట్టింది. రొబోటిక్ మ్యూల్ అనేది కుక్క ఆకారంలో రూపొందించిన రొబోట్, ఇది కఠినమైన భూముల్లో పర్యవేక్షణ, తేలికపాటి బరువులను రవాణా చేయడానికి సహాయపడుతుంది. 100 రొబోటిక్ మల్టీ-యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్ (ఎంయూఎల్‌ఈ) లను ముందుడుగు (యుద్ధ) ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎత్తైన ప్రాంతాలలో



వినియోగానికి భారత సైన్యం ఇటీవల ప్రవేశపెట్టింది. ఈ రోబోట్లు మెట్లు, వాలు కొండలు ఎక్కి, -40 నుంచి +55 డిగ్రీల సెల్సియస్ వరకు అత్యధిక ఉష్ణోగ్రతలలో పని చేయగలవు. అలాగే 15కేజీల బరువును మోయగలవు. అదే విధంగా ఎత్తయిన ప్రాంతాలలో మద్దుతు, రవాణాను మెరుగుపరచడానికి లాజిస్టిక్స్ డ్రోన్‌లు పరీక్షించబడుతున్నాయి. రోబోటిక్ మ్యూల్ అన్ని రకాల వాతావరణాలకు రూపొందించబడిన ఒక మన్నికైన, చురుకైన భూమి రోబోట్, వస్తువులను గుర్తించడానికి ఎలక్ట్రో-ఆప్టిక్స్, ఇన్ఫ్రారెడ్ టెక్నాలజీతో అమర్చబడి ఉంటుంది. ఇది నదుల గుండా, లోపల కదిలే సామర్థ్యం కలిగి ఉంటుంది.

చైనా ఖండాంతర క్షిపణి పరీక్ష విజయవంతం

ఒక్కసారే దాదాపు 10 అణ్వాయుధ వార్‌హెడ్‌లను మోసుకెళ్లే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి(ఐసీఎం)ని చైనా విజయవంతంగా పరీక్షించింది. హైనన్ ద్వీపం నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి సుమారు 12వేల కిలోమీటర్లు ప్రయాణించి పసిఫిక్ మహాసముద్రంలోని అంతర్జాతీయ జలాల్లోకి పడినట్లు తెలుసుస్తోంది. ఇది డీఎఫ్-31 లేదా డీఎఫ్-41 రకానికి చెందినది కావొచ్చని భావిస్తున్నారు. దీనికి 12 వేల నుంచి 15 వేల కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం ఉంది. ప్రస్తుత క్షిపణి అమెరికాలోని ప్రధాన నగరాలను సునాయాసంగా ఢీకొట్టగలదు. నలువైపుల నుండి రక్షణ కల్పించేలా తేలికపాటి తూటా రక్షణ కవచాలను (బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను) ఐఐటీ-ఢిల్లీతో కలిసి 'రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీవో) తీర్చిదిద్దింది. 360 డిగ్రీల కోణంలో ఎటు నుంచి ముప్పు ఎదురైనా ఇది అడ్డుకుంటుందని రక్షణ మంత్రిత్వశాఖ



వెల్లడించింది. ఈ సాంకేతికతను మన దేశంలోని కొన్ని పరిశ్రమలకు బదలాయిస్తారు. వీటికి 'అభేద్' (అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హై ఎనర్జీ డిఫీట్) అని పేరు పెట్టారు. వివిధ బీఐఎస్ ప్రమాణాల మేరకు వీటిని 8.2 కేజీలు, 9.9 కేజీల కనీస బరువుతో రూపొందించారు. పాలిమర్లు, దేశీయ బోరాన్ కార్బైడ్ సిరామిక్ పదార్థాలు ఉపయోగించి ఈ జాకెట్లను తయారు చేశారు.

నాడు తెలుగు ప్రాంతాల్లో ఆధునిక నాటక ప్రదర్శనకు ప్రేరణ ఇచ్చిన నాటక సమాజం?



నానాపురం నర్సింహులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం, రంగారెడ్డి జిల్లా.
9030057994

1. దశవిధ రూపకములను గూర్చి చెప్పిన గ్రంథం?
ఎ. భరతుని-నాట్యశాస్త్రం
బి.దండి-కావ్యాదర్శము
సి. ధనుంజయుడి-దశరూపకం
డి.భోజుడి-సరస్వతీ కంఠాభరణము.

2. ప్రాచీనాలంకారికుల దృష్ట్యా నాటకంలో ఎన్ని అంకాలుండాలి? మరియు నాయకుడు ఎలా ఉండాలి?
ఎ. 2-5 అంకములు-ధీర శాంతుడైన నాయకుడు
బి. 5-10 అంకములు-ధీరోదాత్తుడైన నాయకుడు
సి. 10-15 అంకమకులు - ధీర శాంతుడైన నాయకుడు
డి. 1-4 అంకములు-ధీరోద్ధతుడైన నాయకుడు

3. 'కావ్యేషు నాటకం రమ్యం' (కావ్యాలలో 'నాటకం' రమ్యమైంది) అన్న ఆలంకారికుడు.
ఎ. భరతుడు బి. దండి
సి. ధనుంజయుడు డి. కాళిదాసు

4. కావ్యం శ్రవ్యకావ్యం, దృశ్యకావ్యం అని రెండు విధాలు. అయితే దృశ్యకావ్యాలంటే?
ఎ. నాటకాది దశరూపకములు
బి. భారత, రామాయణాలు
సి. శ్రవణేంద్రియాలతో పాటు నేత్రేంద్రియాలకు ప్రీతి కల్గించేవి
డి. ఎ మరియు సి

5. 'దశ రూపకములు' ఏవి?
ఎ. నాటకం, ప్రకరణం, బాణం
బి. వ్యామోగం, సమవాకారం, డిమం
సి. అంకం, వీధి, ప్రహసనం, ఈహమృగం
డి. ఎ,బి మరియు సి

6. ప్రాచీన అలంకారికులు చెప్పిన నాటక లక్షణాలు?
ఎ. నాంది-ప్రస్తావన-విష్కంభం-పంచసంధులు-భరతవాక్యం మున్నగునవి నాటక ప్రధానాంగాలు.
బి. వీర, శృంగార రసములలో ఏదో ఒకటి ప్రధాన రసం కావాలి.
సి. నాయిక వధ ఉండరాదు. నాయకుడు ఒకవేళ మరణించినా పునరుజ్జీవితున్ని చేయాలి.
డి. పైవన్నీ

7. "పంచ సంధులు (ముఖ, ప్రతిముఖ, గర్భ, అవమర్శ, నిర్వహణ సంధులు) చెడిన నాటకము కీళ్లు సడలిన బొమ్మ" - అన్నవారు?
ఎ. శ్రీపింగళి లక్ష్మీకాంతం
బి. డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు
సి. డా॥ దివాకర్ల వేంకటావధాని
డి. విశ్వనాథ సత్యనారాయణ

8. సంస్కృత లక్షణాల ప్రకారం తెలుగులో 'వీధి' లక్షణాలతో రాయబడి, 'వినుకొండ వల్లభరాయుడి' పేరు కనిపిస్తున్న క్రీడాభిరామం' అనే రూపక కర్త ఎవరు?
ఎ. నన్నయ బి. పాల్కురికి సోమన
సి. శ్రీనాథుడు డి. పోతన

9. నాడు తెలుగు ప్రాంతాల్లో ఆధునిక నాటక ప్రదర్శనకు ప్రేరణ ఇచ్చిన నాటక సమాజం?
ఎ. జగన్నాథ విలాసినీ నాటక సమాజం
బి. ధార్వాడ నాటక సమాజం
సి. విద్యార్థి నాటక సమాజం
డి. ఆంధ్ర భాషాభిమాన సమాజం

10. తెలుగులో సంస్కృత నాటకాల అనువాదాలు/స్వతంత్ర తెలుగు నాటకాలు ఎప్పటి నుండి ప్రారంభమయ్యాయి?
ఎ. 1893 తర్వాత
బి. 1885 తర్వాత
సి. 1860 తర్వాత
డి. పూర్వకాలం నుండి

11. తొలి తెలుగు స్వతంత్ర నాటకం ఏది?
ఎ. శ్రీకోరాడ రామచంద్ర శాస్త్రి-మంజరీ మధుకరీయం
బి. కొక్కొండ వేకంటరత్నం-నరకాసుర విజయవ్యామోహం
సి. వావిలాల వాసుదేవ శాస్త్రి-నందక రాజ్యం
డి. కందుకూరి వీరేశలింగం పంతులు-రాజశేఖర చరిత్ర



12. 'ప్రతాపరుద్రీయం' నాటకం రాసినవారు?
ఎ. కొక్కొండ వేంకటరత్నం
బి. విద్యానాథుడు
సి. కందుకూరి వీరేశలింగం
డి. వేదం వెంకటరాయశాస్త్రి

13. ధర్మవరం రామ కృష్ణమాచార్యుల నాటకాలు గుర్తించుము?
ఎ. చిత్రనళీయం, విషాద సారంగధర, పాదుకా పట్టాభిషేకం
బి. ప్రమీలార్జునీయం, ప్రహ్లాదనాటకం, అజామీళ, చంద్రహాస
సి. ఎ మరియు బి
డి. గయోపాఖ్యానం, ప్రసన్నయాదవం, సీతాకళ్యాణం

14. క్రింది వానిలో సరికానిది?
ఎ. సరసవినోదినీ సభ-ధర్మవరము రామకృష్ణమాచార్యులు
బి. ధార్వాడ నాటక సమాజం-కందుకూరి విరేశలింగం
సి. సుమనోరమా సభ-కోలాచలం శ్రీనివాసరావు
డి. హిందూ సమాజం-శ్రీ ఇమ్మనేని హనుమంతరావు

15. 'బొబ్బిలి యుద్ధం' విషాదాంత చారిత్రక నాటకరక్త?
ఎ. శ్రీపాదకృష్ణమూర్తి
బి. పానుగంటి లక్ష్మీనరసింహారావు
సి. చిలకమర్తి లక్ష్మీనరసింహం
డి. బలిజేపల్లి లక్ష్మీకాంతం

16. తెలుగులో వెలువడిన తొలి స్వతంత్ర సాంఘిక నాటకం?
ఎ. హరిశ్చంద్ర
బి.చింతామణి
సి. ప్రతాపరుద్రీయం
డి. కన్యాశుల్కం

17. సురవరం ప్రతాపరెడ్డి గారు రాసిన నాటకాలు?
ఎ. తప్పెవరిది, గాలివాన
బి. చలిచీమలు, వెంటాడే నీడలు
సి. ఉచ్చల విషాదం, భక్తతుకారం
డి. చింతామణి, రోషనార

18. 'ఆంధ్రనాటక పితామహుడు'గా ప్రసిద్ధిగాంచిన వారు?
ఎ. గురజాడ అప్పారావు
బి. ధర్మవరం కృష్ణమాచార్యులు
సి. వేదం వేంకటరామశాస్త్రి
డి. చిలకమర్తి లక్ష్మీనరసింహా

19. 'నాటక శిల్పం' అనే విమర్శనాత్మక గ్రంథం ఎవరిది?
ఎ. మొదలి నాగభూషణ శర్మ
బి. పి.ఎస్.ఆర్.అప్పారావు
సి. సర్దేశాయి తిరుమలరావు
డి. పింగళి లక్ష్మీకాంతం

20. 'తెలుగు నాటక వికాసకం' అనే గ్రంథం రాసి, నాటక ప్రక్రియపై పరిశోధన చేసిన వారు?
ఎ. డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు
బి. మొదలి నాగభూష శర్మ
సి. బలిజేపల్లి లక్ష్మీకాంతం
డి. వావిలాల వాసుదేవ శాస్త్రి

21. 'ప్రోలోగు, ఎపిలోగు'-లాంటి పాశ్చాత్య సంప్రదాయాలు తెలుగు ఏ ప్రక్రియలో కనిపిస్తాయి?
ఎ. నవల
బి. నాటకం
సి. కథ
డి. నాటిక

22. 'దురాశాభంగము' అనే నామాంతరం గల 'సునందినీ పరిణయము' అనే నాటకం రాసినవారు?
ఎ. శ్రీ కందుకూరి వీరేశలింగం
బి. కాళ్లకూరి నారాయణరావు
సి. శ్రీకోలాచలం శ్రీనివాసరావు
డి. బళ్ళారి రాఘవా


23. సుల్తానా చాందు బీబీ, చంద్రగిర్యభ్యుదయం, ప్రతాపాక్షరీయం, మైసూరు రాజ్యం-లాంటి చారిత్రక నాటకాలు రాసి, 'ఆంధ్ర చారిత్రనాటక పితామహులని' ప్రసిద్ధిగాంచిన వారు?
ఎ. కాళ్లకూరి నారాయణరావు
బి. ధర్మవరం కృష్ణమాచార్యులు
సి. బలిజేపల్లి లక్ష్మీకాంతం
డి. కోలాచలం శ్రీనివాసరావు

24. 'ప్రతాపరుద్రీయము' అనే ప్రసిద్ధ నాటకం రాసినవారు?
ఎ. వేదం వేంకటరామ శాస్త్రి
బి. కోలాచలం శ్రీనివాసరావు
సి. కందుకూరి వీరేశలింగం
డి. వావిలాల వాసుదేవ శాస్త్రి

25. ఆంధ్ర షేక్స్పియర్ శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహం గారు రాసిన నాటకాలు/నాటకం
ఎ. పాదుకాపట్టాభిషేకం
బి. రాధాకృష్ణ, విప్రనారాయణ
సి. కంఠాభరణం
డి. పైవన్నీ

సమాధానాలు

1.సి	2.బి	3.ఎ	4.డి	5.డి
6.డి	7.ఎ	8.సి	9.బి	10.సి
11.ఎ	12.డి	13.సి	14.బి	15.ఎ
16.డి	17.సి	18.బి	19.ఎ	20.ఎ
21.బి	22.సి	23.డి	24.ఎ	25.డి



2017లో రాజ్యసభలో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు, అత్యంత ప్రతిభ కలిగిన రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేయగల ఆకర్షణీయ వ్యక్తిత్వం స్వంతం చేసుకున్న ఏచూరి నిజాయితీకి ప్రతిరూపంగా నిలబడ్డారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్న చురుకైన వ్యక్తిగా దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. తన మరణానంతరం పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి (ఏయిమ్స్- ఢిల్లీ) అందించాల్సిందిగా కోరుకున్న ఏచూరి ప్రదర్శించిన విలువలు, నడిచిన సన్మార్గం దేశానికే మార్గదర్శకం.

ఏచూరి జీవితం...యువతరానికి దారిదీపం!



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

కమ్యునిస్టు యోధుడు,విద్యావేత్త, మహోన్నత వ్యక్తిత్వం మూర్తీభవించిన బడుగుల పక్షపాతిగా 72 ఏండ్ల సుదీర్ఘ జీవితాన్ని సామాజిక న్యాయస్థాపనకు అంకితం చేసిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఆ పార్టీకే కాదు, వామపక్ష ఉద్యమానికి, దేశానికి తీరనిలోటు. ఎందుకంటే ఏచూరి జీవితాంతం పేద ప్రజల కోసమే పనిచేసిన నాయకుడు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఏచూరి సీతారామ్ 12 ఆగస్టు 1952న ప్రభుత్వ అధికారి ఏచూరి కల్పకం - ఇంజనీర్ సర్వేశ్వర సోమయాజీ దంపతులకు మద్రాసులోని తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ప్రముఖ సంఘ సంస్కర్త దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ శిష్యురాలిగా తల్లి కల్పకం నేర్పిన సామాజిక న్యాయ బాధ్యతలను అర్థం చేసుకున్నారు. ఆమె సోదరుడు పూర్వ ఐఏఎస్ అధికారి, చీఫ్ సెక్రటరీ మోహన కందా మేనల్లుడుగా సీతారామ్ రాజకీయాల పట్ల చిన్నతనం నుంచే ఆసక్తి పెంచుకున్నారు.హైదరాబాద్ 'ఆల్ సేయింట్స్ స్కూల్'లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన ఏచూరి ఆ తర్వాత 'నిజామ్ కాలేజీ'లో తదనంతర విద్యాభ్యాసం ఢిల్లీలో కొనసాగింది. 1970లో ఢిల్లీ 'ప్రెసిడెంట్ ఎస్టేట్ స్కూల్'లో సిబిఎస్సీ చదివి పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి, ఢిల్లీ యూనివర్సిటీ 'సేయింట్ స్టీఫెన్స్ కాలేజీ'లో బి ఏ ఆనర్స్ (ఆర్థిక శాస్త్రం), 'జెఎన్‌యూ'లో ఎంఎ ఎకనామిక్స్ ప్రథమ శ్రేణిలో పట్టాలు పొందారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితిలో నిరసనల్లో పాల్గొని అరెస్టయ్యారు. హిందూస్తానీ టైమ్స్ పత్రికలో సంపాదకీయ వ్యాసాలు రాయడంలో మన సీతారామ్ మేధో సంపత్తిలో దిట్ట. కుమారుడు ఆశీష్ 34వయేటా 2021లో కరోనాతో మృతిచెందాడు.ఆ బాధను తొందరలోనే దిగమింగుకుని ప్రజాసేవలోనే నిరంతరం నిమగ్నమయ్యాడు. కుమార్తె అఖిల హిస్టరీ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

యాభైఏండ్ల క్రితం జెఎన్‌యూలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన సీతారాం ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, తదనంతరం జాతీయ అధ్యక్షుడిగా తన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. 1970ల్లో జెఎన్‌యూ పర్యటనను వ్యతిరేకించి నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి యూనివర్సిటీ విద్యార్థుల కోరికలు వినిపిస్తూ రాజీనామా చేయాలని ముందుండి ధైర్యంగా పోరాడారు. జెఎన్‌యూ ఎన్నికల్లో మూడుసార్లు గెలిచి అధ్యక్షుడిగా నాయకత్వ పటిమ చూపారు. 1975లో సీపీఐ(ఎం)లో చురుకైన కార్యకర్తగా చేరి 1984లో పార్టీ సెంట్రల్ కమిటీలో సభ్యుడిగా ఎదిగారు. 1985,1988లో సెంట్రల్ సెక్రటేరియట్, 1992లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు.1996లో యూపిఏ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ఆ కాలంలోనే అణుఒప్పందానికి వ్యతిరేకంగా కూటమి నుంచి వైదొలిగారు. మతోన్మాద పార్టీ అయిన బీజేపీ మూడోసారి అధికారంలోకి రాకుండా లౌకికపార్టీలను ఐక్యం చేసి 'ఇండియా' కూటమి నిర్మాణంలో ప్రధాన భూమిక నిర్వహించారు. పార్టీలన్నింటినీ ఐక్యం చేసి ఒక్కతాటికి తీసుకు రావడానికి కృషి చేశారు. ఆ ఫలితం ఇటీవల ఎన్నికల్లో స్పష్టమైంది. వెరసి బీజేపీ మెజార్టీ కోల్పోవడమే.

19 ఏప్రిల్ 2015 నుంచి నేటి వరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా పార్టీకి, ప్రజలకు అమూల్య సేవలందించారు. 2015-17 వరకు పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2017లో రాజ్యసభలో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు, అత్యంత ప్రతిభ కలిగిన రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేయగల ఆకర్షణీయ వ్యక్తిత్వం స్వంతం చేసుకున్న ఏచూరి నిజాయితీకి ప్రతిరూపంగా నిలబడ్డారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్న చురుకైన వ్యక్తిగా దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. తన మరణానంతరం పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి (ఏయిమ్స్- ఢిల్లీ) అందించాల్సిందిగా కోరుకున్న ఏచూరి ప్రదర్శించిన విలువలు, నడిచిన సన్మార్గం దేశానికే మార్గదర్శకం. కామ్రేడ్స్ సుర్జిత్ సింగ్, జ్యోతి బసు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొన్న ఏచూరి జీవిత చరమాంకం మచ్చలేని రాజకీయ జీవితం గడిపారు. రాజకీయ పరిపక్వత, నైతిక ప్రవర్తన, నీతి నియమాలు, ఆయన అర్ధ శతాబ్దపు జీవన ప్రస్థానం నేటి యువభారతానికి దారిదీపం.

'దామగుండం' రక్షణకు.. మరో 'చిప్కో' ఉద్యమం అవసరమే!

70వ దశకంలో జరిగిన చిప్కో ఉద్యమం మొదలుకొని ప్రస్తుతం ముందుకొచ్చిన "దామగుండం" రక్షణ ఉద్యమం వరకు ఎంతో మంది పర్యావరణవేత్తలు, పర్యావరణ ప్రమాదాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. 300 చెట్లను కాపాడుకునేందుకు జరిగిన "చిప్కో" ఈ యాభై ఏండ్లలో దేశంలో అనేక కీలకమైన సహజ వనరులు, పర్యావరణ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. చిప్కో ఉద్యమం "గౌరాదేవి" అనే మహిళా నేతృత్వంతో ప్రారంభమై "సుందర్ లాల్ బహుగుణ" నాయకత్వంలో విస్తృతపరచబడింది. అదే తరహాలో తెలంగాణలోని వికారాబాద్ జిల్లా "దామగుండం" అటవీ ప్రాతంలో సుమారు మూడువేల ఎకరాల్లోని 12లక్షల పై చిలుకు చెట్లను రక్షించేందుకు "జర్నలిస్టు తులసీచందు" ఒకడుగు ముందుకేసింది. స్పందించే సమూహాన్ని తట్టిలేపింది. "జర్నలిస్టు తులసిచందు" చొరవతో ఇప్పుడు "దామగుండం" రక్షణ కోసం చిప్కో తరహా ఉద్యమం అవసరమనే నినాదం ముందుకొచ్చింది. ఈ పిలుపులో సహజ వనరుల పరిరక్షణ కోసం తపించే శక్తులు వ్యక్తులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ హితులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, కవులు, రచయితలు ప్రతిఒక్కరూ "దామగుండం" రక్షణ మూవ్‌మెంట్‌లో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి పేరుతో మానవ మనుగడకు ముప్పు తెచ్చేలా దామగుండం అడవిని విధ్వంసం చేయడం మనిషి ఆయుష్షుతో, ప్రకృతితో చెలగాటమాడటం కాక ఏమవుతుందని ప్రశ్నించాలి.



జీవ మనుగడకు ఈ భూమ్మీద అనుకూలమైన పర్యావరణం ఉండటం తప్పనిసరి. కానీ అభివృద్ధి పేరుతో పాలకుల కనుసన్నల్లో జరుగుతున్న విధ్వంసం వల్ల పర్యావరణం విపరీతమైన ఇబ్బందులకు గురవుతోంది. ముఖ్యంగా అడవులను విచక్షణారహితంగా నరికివేయడం, సహజ వనరుల విధ్వంసానికి పాల్పడటం ఫలితంగా అనేక పర్యావసానాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే ప్రకృతిని చూసే విధానం యుగయుగానికి మారవచ్చు, కానీ ప్రకృతి మారదంటారు ప్రసిద్ధ ప్రకృతి తత్వవేత్త మసనోబు. నిజంగా ప్రకృతి మారడం లేదా అనే ప్రశ్న రావడం సహజం. ప్రకృతి స్వభావంలో మార్పులేదు. కానీ అభివృద్ధి పేరిట ప్రకృతిని కొల్లగొట్టే విధానాలతో దాని సహజ గమనాన్ని అడ్డుకునే ప్రయత్నాలు శతాబ్దాలుగా జరుగుతూనే వున్నాయనేది కాదనలేని సత్యం! ఈ నేపథ్యంలోనే పర్యావరణ సమస్య తలెత్తుతోంది. ముందే చెప్పినట్లుగా మానవాళి ప్రశాంతంగా జీవించాలంటే ప్రకృతి, పర్యావరణం సజావుగా ఉండాలి. దీనికి విరుద్ధంగా సాగించే ప్రయాణం మానవ అస్తిత్వానికి పెనుసవాలే. సాంకేతికత, వృద్ధి పేరిట ప్రకృతి గుండెల్లో చిచ్చుపెట్టే ధోరణి అవాంఛనీయం. ఏమాత్రం క్షేమం కానిది. ప్రకృతి - పర్యావరణం - అభివృద్ధి మధ్య అనుసంధానాన్ని సాధించడానికి బదులుగా ఒకదానికొకటి పోటీగా నిలబెట్టడంలో దుర్మార్గంగా వ్యవహరించే ధోరణి పెరిగింది. సముద్రాల, నదుల, పర్వతాల, అడవుల ఉనికికి ముప్పుగా పరిణమించే విధానాలు అమలవుతున్నాయి.

ఫలితంగా పర్యవసానాలు రానున్న యాభయేండ్లలో ఊహించని విపత్కర పరిస్థితులు ముందుకొచ్చే ప్రమాదం ఉందని అనేక అధ్యయనాలు ఇప్పటికే తెలుపుతున్నాయని గమనించాలి. ఇలాంటి పరిస్థితులున్న నేపథ్యంలో అభివృద్ధి పేరుతో వేల ఎకరాల్లోని "దామగుండం" అడవిలో సుమారు 12లక్షల పై చిలుకు చెట్లను తొలగించి "రాడార్ ప్లాంట్" ఏర్పాటు చేయాలనే ఆలోచన సరైనది కాదు. అడవుల్ని అంటి పెట్టుకుని శతాబ్దాలుగా జీవిస్తున్న జనాన్ని వారి జీవన మనుగడను ప్రశ్నార్థకం చేయడమే అవుతుంది. గత రెండు మూడు దశాబ్దాలలో చోటుచేసుకున్న విపత్తులు నగరాల ఉనికినే చెల్లాచెదరు చేశాయనే వాస్తవాన్ని కూడా మరువొద్దు. ప్రకృతిని జయించడం పేరిట విధ్వంసానికి పాల్పడటం తను కూర్చున్న కొమ్మని తానే నరుక్కోవడం అవుతుందని గుర్తించాలి. "దామగుండం" అడవిని ధ్వంసం చేస్తే హైదరాబాద్ నగరానికి ఎంతటి ముప్పు వాటిల్లనుందో ఇప్పటికే అనేక విశ్లేషణలు తేటతెల్లం చేశాయి. అందుకోసమే అడవుల సంరక్షణ అవసరాన్ని, ప్రకృతి - పర్యావరణాన్ని కాపాడుకునే అవసరాన్ని మనిషి గుర్తించాలి. ముఖ్యంగా పాలకులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అడవుల నరికివేత, పర్యావరణ సమతుల్యత దెబ్బతీనే విధంగా చేపట్టే చర్యలు మానుకోవాలి.

చివరిగా..."చిప్కో" సత్యాగ్రహ ఉద్యమం ఆనాడే కాదు, ఇవాళ కూడా మనకు మన ప్రపంచానికి ఎంతో స్ఫూర్తిదాయకం.ఆ స్ఫూర్తి ప్రస్తుతం "దామగుండం" రక్షణకోసం జరుగుతున్న ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ, ప్రకృతితో మమేకమై జీవించడం మొదలైన ఎన్నో పాఠాలు మనకు చిప్కో ఉద్యమంతో పాటు ఆ స్ఫూర్తితో జరిగిన అనేక ఉద్యమాలు నేర్పిస్తు న్నాయి. శాంతియుతంగా గాంధేయ మార్గంలో చెట్లను కౌగిలించుకొని ఒక మహిళా నాయకత్వంతో చిప్కో ఉద్యమం మొదలైన విధంగా యాభై ఏండ్ల తరువాత అనివార్యంగా తెలంగాణలో ముందుకొచ్చిన దామగుండం అడవి రక్షణకోసం మహిళా అయినటువంటి "జర్నలిస్టు తులసిచందు" వాయిస్‌తో ఉద్యమం మొదలైంది. ఈ "సేవ్ దామగుండం" ఉద్యమం కూడా అనేక అనుభవాలు నేర్పుతూ చరిత్రలో నిలిచిపోక తప్పదు. "చిప్కో" తరహాలో జరిగే శాంతియుత సత్యాగ్రహ ఉద్యమాన్ని బలపరుద్దాం..బాసటగా నిలుద్దాం..భాగస్వామ్యం అవుదాం...

గత రెండు మూడు దశాబ్దాలలో చోటుచేసుకున్న విపత్తులు నగరాల ఉనికినే చెల్లాచెదరు చేశాయనే వాస్తవాన్ని కూడా మరువొద్దు. ప్రకృతిని జయించడం పేరిట విధ్వంసానికి పాల్పడటం తను కూర్చున్న కొమ్మని తానే నరుక్కోవడం అవుతుందని గుర్తించాలి. "దామగుండం" అడవిని ధ్వంసం చేస్తే హైదరాబాద్ నగరానికి ఎంతటి ముప్పు వాటిల్లనుందో ఇప్పటికే అనేక విశ్లేషణలు తేటతెల్లం చేశాయి. అందుకోసమే అడవుల సంరక్షణ అవసరాన్ని, ప్రకృతి - పర్యావరణాన్ని కాపాడుకునే అవసరాన్ని మనిషి గుర్తించాలి. ముఖ్యంగా పాలకులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అడవుల నరికివేత, పర్యావరణ సమతుల్యత దెబ్బతీనే విధంగా చేపట్టే చర్యలు మానుకోవాలి.